# కాకి బంగారం

## డా॥ సి. ఆనందారామం

### 1

"రాణిని హత్యచేసారు. పాడునూతిలో పడేసారు"

ఆ గ్రామంలో ఎవరినోట విన్నా ఈమాటే!

రాణి!....సమాజాన్ని సమూలంగా కదిలించివేసిన రాణి... సమాజంలోని కుళ్ళునీ మురుగుటోయిన మురిగిపోతున్న కంపు కొట్టే రహస్యాల్నీ ధైర్యంగా బయపటదేసి సమాజాన్ని చూసి హేళనగా నవ్విన రాణి....ఈనాడు దారుణంగా హత్య చేయబడింది.

"ఇలాంటి కథలకు ముగింపు ఇలాగే ఉంటుంది. అయితే ఆత్మహత్య - లేకపోతే హత్య-" అన్నారు, ఎవరో. పోలీసులు రంగంలోకి వచ్చారు. పాడుబడ్డ నూతిలోంచి రాణి శవాన్ని బయటికి తీసారు. అది నిస్పందేహంగా హత్య-ఒంటినిండా కత్తిపోట్లు ఉన్నాయి, అందాలన్నీ రాసిపోసి నట్టుగా ఉండే రాణిశరీరం కత్తిపోట్లతో-గడ్డకట్టిన నెత్తురు చారికలతో నీటిలో నాని, నాని వచ్చిన వికారంతో పరమ భయంకరంగా ఉంది.

కేసు ఇన్వెస్టిగేషన్ చెయ్యవలసిన భారం సి. ఐ. డి. ఆఫీసర్ తిలక్‌మీద పడింది. ఆ గ్రామానికి మరో పని మీద వచ్చాడు. అక్కడి చిన్నరైతులు చాలాసార్లు పోలీసు అధికారులకు విన్నపాలు పంపుకున్నారు. ఆ గ్రామంలో పెద్దమనిషిగా చెలామణి అవుతున్న ఇంచుమించు నూరెక రాల పొలాన్ని ఆజమాషీచేస్తున్న వెంకట్రావు మిగిలిన రైతులకు నీళ్ళు వదలకుండా సకాలానికి కూలీలు అంద కుండా అనేక ఇబ్బందులు కలిగిస్తున్నాడని- ఎన్నోసార్లు ఆ గ్రామంలో ముఠాతగవులు జరిగాయి. ఆ తగవుల్లో ఏనాడూ ఏ పోలీసూ వెంకట్రావుముఠాలోంచి ఎవరినీ అరెస్ట్ చేయ లేదు-చిన్న రైతుల గుంపులోనుంచి మాత్రం అరెస్ట్‌చేసి జరిమానా వేసి వదిలేస్తున్నారు. కేసు, విచారణ-ఏమీలేదు. పోలీసులన్నా, కోర్టులన్నా భయపడి ఆ పల్లెరైతులు ఎలాగో జరిమానా కట్టుకుని బయటపడుతున్నారు. రాను రాను అల్లర్లు ప్రతిమించాయి-ఎవరైనా అన్యాయాన్ని ఎల్లకాలమూ సహిం చలేరు. కొందరు యువకులు ముందుకొచ్చి ఈ విషయంలో విచారణ జరిపించాలని పట్టుబట్టారు-అధికార వర్గాలు సాధా రణంగా అల్పజీవుల్ని లెక్కచెయ్యవుగానీ, సంఘబలానికి కాస్త భయపడతాయి. కన్నీళ్లు తుడవటానికయినా విచారణ జరిపించాలి. ఆ సందర్భంలో వచ్చాడు తిలక్-అనుకోకుండా రాణి కేస్ ఎదురయింది.

రాణిని ఎందుకు హత్యచేసారా అని ఆశ్చర్యపడక్కర్లేదు-రాణి ఎందరి రహస్యాలనో బయటపెట్టింది. ఎందరినో నవ్వులపాలు చేసింది. వాళ్ళలో ఎవరైనా కావచ్చు-అయితే, భాగ్యనగరంలో ఉండి ఆంధ్రదేశాన్నంతా అల్లకల్లోలం చేసే రాణి ఈ మారుమూల గ్రామానికి ఎందుకు వచ్చిందో విచారించాడు తిలక్. రాణి తండ్రి యాదయ్య ఆ గ్రామంలో ఉన్నాడని, తండ్రిని చూడడానికి రెండేళ్ళకో, మూడేళ్ళకో ఆ గ్రామానికి వస్తుందనీ చెప్పారు-యాదయ్యను వెతుక్కుంటూ వెళ్ళాడు తిలక్. ఒక గోచీపెట్టుకుని కల్లు పాకలో ముంతమీద ముంత తెగ తాగుతున్నాడు యాదయ్య. కన్న కూతురు అంత దారుణంగా హత్యచేయబడగా అలా తప్పతాగుతున్న తండ్రిని చూసి ఎలాగో అయింది తిలక్ మనసు. వృత్తి రీత్యా అతడు క్రింది తరగతుల వాళ్ళతో మసలుతూనే ఉంటాడు. అయినా వాళ్ళను ఎలా అర్థంచేసు కోవాలో అతని కెప్పటికీ తెలియటంలేదు. యాదయ్య పక్కన కుర్చీలో కూచుని, యాదయ్య భుజం తడుతూ "యాదయ్యా! నీ కూతుర్ని హత్యచేసారు, నీకు తెలుసా?" అన్నాడు.

యాదయ్య ఆ తాగిన మత్తులోనే బావురుమని ఏడ్చే సాడు. "అవునండీ! సంపేసారు. అన్నేయంగా సంపేసి నారు. దాని బతుకట్టా బుగ్గయిపోనాది బాబయ్యా! ఈ పాపి ష్టోడిని సూట్టానికి రాకుండాపోయినా బాగుండేది బాబయ్యా! సంపేసినారు బాబయ్యా? సంపేసినారు...."




ఒకవంక ముంతతో కల్లుతాగుతూ మరోవైపు ఏడుస్తున్నాడు యాదయ్య- అతడిని ఆ ధోరణిలోంచి మళ్ళించడం చాలా కష్టమయింది తిలక్‌కి-

"రాణికి శత్రువులెవరున్నారో నీకు తెలుసా ?"

"రాణా ? అదెవరు బాబయ్యా ?"

"అదే! నీ కూతురు! ఇప్పుడు హత్య చెయ్యబడ్డ అమ్మాయి !"

"అదాండి ! అది మల్లండి. నా కూతురండి. నా కూతురే నండి- నా మాటినలేదండి- యెదవ సదువులెందుకే అన్నానండి-యినలేదండి- సదువు మనకి కూడూ గూడ్డాయెట్టదే- అన్నానండి. యినలేదండి సుఖ:గా కూలీనాలీ పేసుకు బతుకే అన్నానండి-యినలేదండి సదువుకుని ఉద్దేగం పేసి మాకేదో ఒరగబెట్టేత్తానని మొండికేసిందండి - కామోసుకున్నానండి. అప్పుడే దాన్ని కాళ్ళిరగొట్టుంటే బాగుండి పోనండి. ఇంత గోరం జరిగేది కాదండి. ఆ మాయదారి సదువు మొదలెట్టినకాడ్నించి మాకు కట్టాలు మొదలయినాయండి-"

ఒకటే ధోరణిలో చెప్పుకుపోతున్నాడు యాదయ్య తాగిన మైకంలో ఏడుస్తున్నాడు. గుండె బాదుకుంటున్నాడు- మళ్ళీ తాగుతున్నాడు- ఇక్కడి పరిస్థితుల్లో అతనితో మాట్లాడి ప్రయోజనం లేదనుకున్నాడు తిలక్-ఇక. ఒకవేళ కూతురు హత్యవల్ల కలిగిన దుఃఖం భరించలేకే తాగుతున్నాడేమో! వీళ్ళకి మంచికీ, చెడ్డకీ అన్నిటికీ తాగుడే శరణ్యం. వెళ్ళిపోయాడు తిలక్. ఆ మరునాడు వచ్చాడు యాదయ్య ఇంటికి- అది ఒక మోస్తరు పెంకుటిల్లు. అన్ని సదుపాయాలతో బాగానే ఉంది. అతడు పెట్టుకున్న గోచీకి ఆ ఇంటికీ సంబంధం లేనట్లుగా ఉంది.

అతడి ఎదురుగా రాణిశవం పోస్టుమార్టమ్ జరిగాక అప్పగించారు. అంచేత మరింత భయంకరంగా వుంది. కళ్ళు ఉండేచోట దూదిపెట్టారు. ఆ శవంముందు కూచుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. అప్పటికి బాగా అనుభవంలోకి వచ్చినట్లుంది కూతురుపోయిన బాధ- అతని పక్కన మరెవరూ లేరు- రాణికి అక్కచెల్లెళ్లెవరూ లేరా? తల్లి లేదా? చెల్లెళ్ళు ఉన్నట్లు విన్నాడు. వాళ్ళెందుకు రాలేదో, మరి!

యాదయ్య అలా ఏడుస్తోంటే అతడిని ఓదార్చేవాళ్ళు కూడాలేరు. అంత్యక్రియల విషయం ఆలోచించినవాళ్ళు లేరు. గ్రామంలో జనం ఎవరూ ఆ దరిదాపులకి రాలేదు. అప్పుడు ఒక నడివయసు వ్యక్తి వచ్చాడు! బాగా తాగుడికి అలవాటుపడ్డట్టు అతడికళ్ళు ఎఱ్ఱగావున్నాయి-అతడు చకచక అంత్యక్రియలకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసాడు. ఆ నలుగురు వ్యక్తులు, బాగాతాగివున్నవాళ్ళు, శవాన్ని భుజాల మీద కెత్తుకున్నారు. శవం కదిలాక భోరుమన్నాడు యాదయ్య-అతడు లేచి నిలబడగలిగే స్థితిలో లేడు- అయినా శవంవెంట కదిలాడు-

శవవాహకులు కానీ, నడివయసు వ్యక్తి కానీ, శవదహనం పూర్తిగా అయ్యేవరకూ వుండలేదు - శ్మశానంలో కూచుని కుములుతోన్న యాదయ్యని అక్కడే వదిలేసి వెళ్ళిపోయారు. అప్పుడు తిలక్ యాదయ్య భుజం మీద చెయ్యివేసి "ఊరుకో ! ఏడ్చి చెయ్యగలిగింది లేదు. నీకు తెలిసిన వివరాలు చెప్పు. ఇంత ఘోరం చేసినవాళ్ళకి తగిన శిక్ష విధించొచ్చు-" అన్నాడు.

"ఏం చెప్పను బాబయ్యా ! అది ఆణిముత్తెమంటిది దొరా! దాన్ని ఈ యెదవలే సంపుకుతిన్నారు," అన్నాడు తుపుక్కున నేలమీద వూస్తూ....

"ఇప్పుడు అంత్యక్రియలు చేయించిన ఆ నడివయసు వ్యక్తి, అతను నీ కేమతాడు?"

"ఆడా! జగన్‌గాడు- ఆడు నాకేంకాడు- ఆడు తార్పుడుగాడు-ఆడే దాన్ని యీ రొంపిలోకి దించినోడు కాదులెండి- అంతకుముందే ఆ ముదనష్టపు నాయకుడు దీన్ని సెడగొట్టిండు-ఆడిమీది కసితోనే ఇదిట్టా అధ్వాన్నమయిపోనాది."

తిలక్ యాదయ్యను చెయ్యపట్టుకుని లేవదీసి రిక్షాలో కూచోబెట్టి, ఇంటికి తీసుకొచ్చాడు- తనే హోటల్‌కి తీసుకెళ్ళి భోజనం పెట్టించి, "ఇప్పుడు చెప్పు యాదయ్యా ! మీ మల్లికి సంబంధించినంతవరకు నీకు తెలిసిందంతా చెప్పు" అన్నాడు - యాదయ్య మళ్ళీ ఏడుపు గొంతుకతో "దాన్ని సంపినోళ్లెవరో నాకు తెలవదు బాబయ్యా ?" అన్నాడు.


"అది మేం తెలుసుకుంటాం ! మీ మల్లి చదువుకువెళ్ళి

నప్పటినుంచీ జరిగింది చెప్పు-"

యాదయ్య తనకు తోచినట్లు అస్తవ్యస్తంగా చెప్పాడు- అది ఒక క్రమంలో పేరిస్తే........

## 2

ఆ ఊరికి యెలిజబెత్ టీచర్‌గా రావటం రాణి అదృష్టం-రాణి మొదటిపేరు మల్లమ్మ - "మల్లి" అని పిలుస్తారు అందరూ - అప్పటివరకూ మల్లి తల్లి వెనకాల పాచిపనులకు వెళ్తూ, గొడ్లవెంటవెళ్ళి పేడ పోగుచేసుకుని పిడకలు చేస్తూ-అప్పుడప్పుడు తీరికదొరికినప్పుడు స్నేహితురాళ్ళతో, అచ్చన గాయలు, చింతపిక్కలూ ఆడుకొంటూ కాలం గడిపేసేది. ఆ ఊళ్ళో నామమాత్రంగా ఒక గవర్నమెంటు బడి వుండేది. ఒక టీచరూ వుండేది. కానీ, ఆ టీచర్ ఎప్పుడూ ఆ ఉళ్లో ఉండేదికాదు - పక్క టౌన్లో వుండేది- ఎప్పుడైనా ఇన్‌స్పెక్షన్‌కి వస్తున్నారని తెలిసినప్పుడు - ఆ విషయం ఆవిడ తన బావగారి సహాయంతో ఎలాగో తెలుసుకొనేది- అప్పుడు మాత్రం త్వరత్వరగా బడికొచ్చేసి-ఎలాగో లంచాలు పెట్టి పిల్లల్నందరినీ బడిలో పోగేసి-చదువు చెప్తున్నట్లు నటించి ఆ ఇన్స్‌పెక్షన్ కాగానే మళ్ళీ టౌన్‌కి పోయేది-ఆ విషయం ఎలాగో బయటపడి, ఆవిడని మరోమూలకి ట్రాన్స్‌ఫర్ చేసారు-ఆ తరువాత యెలిజబెత్ వచ్చింది. యెలిజబెత్ పేరుకి మాత్రమే క్రిస్టియన్ - మాటలో వేషభాషలలో మర్యాదలో హిందువులాగే ఉంటుంది - చక్కని వాయిల్ చీరలు గంజిపెట్టి ఇస్త్రీ చేసినవి కట్టుకుంటుంది పొందికగా- పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా, అందరితోనూ ఎంతో ప్రేమగా మాట్లాడుతుంది- ఇంటింటికీ వెళ్ళి అందరికీ నచ్చజెప్పి పిల్లల్ని పోగుచేసి బడిలో సమావేశపరుస్తుంది. నయభయాన వాళ్ళకు చదువు బోధపరచడానికి ప్రయత్నిస్తుంది-మల్లికి చదువంటే మొదట్లో శ్రద్ధలేకపోయింది, అందరు పిల్లల్లాగే: గొడ్ల వెనకాల పందేలేసుకుంటూ పోట్లాడుకుంటూ తిరగటం, అవసరమయితే అంట్లగిన్నెలు తోమటం- దొంగతనంగా మామిడికాయలు కోసుకురావటం, ఇవే బాగుండేవి. పుస్తకాల ముందు కూచునేకంటె. యెలిజబెత్ ఎంతో ప్రయాసపడి మల్లికి నచ్చజెప్పింది. చదువుకుంటే ఇలా కూలి చేసుకోనక్కర్లేదనీ, మంచి వుద్యోగాలు వస్తాయనీ చెప్పింది. ప్రస్తుతం ప్రభుత్వం హరిజనులకి పైచదువులకి స్కాలర్‌షిప్పు లిస్తోందనీ, ఉద్యోగాలలోకూడా రిజర్వేషన్లున్నాయనీ వివరించింది. సంస్కారవంతమైన మధ్యతరగతి జీవితాన్ని ఎంతో అందంగా వర్ణించింది. ఆ రకంగా




మల్లికి చదువులో ఆసక్తి ఏర్పడింది. అతి త్వరలోనే మల్లి ప్రాథమిక పాఠశాలలోచదువు పూర్తిచేసి టౌన్‌లో హైస్కూలులో చేరింది.మల్లికిస్కాలర్‌షిప్‌రావటానికి అవసరమయిన అప్లికేషన్లన్ను యెలిజబెత్ తనే స్వయంగా పంపించింది.

మల్లికి హైస్కూల్‌లో చేరగానే కొండెక్కినంత సంతోషం కలిగింది. అలస్యంగా చదువులో చేరటంవల్ల హైస్కూల్లో చేరేనాటికే మల్లి పరికిణీవోణీలు వేయడం ప్రారంభించింది. తన స్కాలర్‌షిప్ డబ్బులోంచి తల్లికీ తండ్రికీ ఇవ్వకుండా పోట్లాడి పోట్లాడి రెండు పరికిణీలు కుట్టించుకుంది. వాటిపై వోణీలు కొనుక్కుంది. అవి ఎప్పుడూ శుభ్రంగా వుతుక్కుని ఇస్త్రీచేయించుకుని కట్టుకునేది. సహజంగా అందమైన మనిషి కావటంవల్ల ఆ పరికిణీఓణీలలో నేర్పరి అయిన శిల్పి చెక్కిన శిల్పంలా ఉండేది. ముఖం కళకళలాడుతూ అప్పుడే విచ్చిన తామర పద్మంలా స్వచ్ఛంగా తేజోవంతంగా ఉండేది - అక్కడితో ఊళ్ళో యువకుల కళ్ళన్నీ మల్లివైపుకే తిరిగాయి — మల్లి గుడిసెల్లో ఉండే హరిజన పిల్ల-ఏపూటకాపూట తిండికే గతిలేనిది. తల్లీ, తండ్రీ కూలిపని చేసుకుని బతికేవాళ్ళు. అంచేత అయిదో, పదో పారేస్తే వచ్చి తమ వళ్ళో వాలుతుందన్న ధీమా అందరికీ - ఒకవేళ మల్లికి అంగీకారం కాకపోయినా, తమను మల్లి కానీ, ఆమె తల్లిదండ్రులుగానీ ఏమి చెయ్యరన్న భరోసా. ఆ ఊళ్ళో వెంకట్రామయ్య, అతడి పరివారమూ ఇంచుమించు మదించిన ఆబోతుల్లాగానే తిరుగుతారు. కూలిచేసుకునే హరిజనుల ఆడవాళ్ళు అనేకులు వీళ్ళ వాతపడ్డారు. కొందరు డబ్బుకక్కుర్తికి వాళ్ళే లొంగిపోయారు. కొందరిని వీళ్ళు బలవంతాన లొంగదీసుకున్నారు- కొన్ని శవాలు ఊరి చెరువులో తేలాయి-అయితే శవాలు తేలాక మాత్రం కొంత అల్లరయింది. ఆ వూరికి ప్రాతి

కేయులూ మిగిలిన ప్రాంతాలవాళ్ళూ రావటం – ఆ ఆత్మహత్యలగురించిన వార్తలుపత్రికలకెక్కించడం, వాటికి వెనక జరిగిన సంఘటనలు ఆరాతియ్యటం – ఈ గొడవలతో వెంకట్రావు బృందానికి వెనుక మద్దతుగాఉన్న పాలకవర్గంలోని ప్రముఖులు వెంకట్రావుని చాలా తీవ్రంగా మందలించారు– ఇకముందు ఏవైనా అత్యాచారాలు జరిగితే తాము కల్పించుకోమనీ, శిక్ష అనుభవించవలసి వస్తుందనీ కూడా హెచ్చరించారు – ఆ కారణంగా వాళ్ళెవరూ మల్లిని బహిరంగంగా బలాత్కరించటానికి సాహసించలేదుకానీ, వంకరచూపులూ, వెకిలిమాటలూ, దారికడ్డంగా సైకిలు నిలపటాలు – ఏదైనా బహుమానాలు ఇవ్వటానికి ప్రయత్నించటాలూ – వగైరాలు మాత్రం నిరాఘాటంగా సాగిపోయేవి – వీటి బారినుంచి తప్పించుకోవటానికి మల్లికి దినదినగండంగా ఉండేది – ఒకనాడు వెంకట్రావు నడివీధిలోనే మల్లికి అడ్డుగా నిలబడి "ఎంత చక్కగా ఉన్నావే! కడిగిన ముత్యంలా! ఎందుకొచ్చిన చదువులు? ఎంత చదువు చదివినా నీకొచ్చేదేముంది? ఒక్క రాత్రికి నాదగ్గరకి రా? సంవత్సరమంతా కష్టపడి నువ్వు సంపాదించగలిగేది నీ చేతుల్లో పోస్తాను." అనేసాడు–అతడి పరివారమంతా అదేదో జోక్ అయినట్లు విరగబడినవ్వారు– మల్లి "ఛీ!" అని అక్కడినుంచి తప్పించుకుని వచ్చేసింది. ఆ ఊళ్ళో ఇలాంటి వాళ్ళంతా సిగ్గొగ్గులు లేకుండా ఇంత బాహాటంగా తనతో అంత లేకిగా ప్రవర్తించటం మల్లికి చాలా కష్టంగా ఉంది, అయితే వాళ్ళను ఎలా ఎదుర్కోవాలో మాత్రం ఆ పనిపిల్లకి తెలీలేదు – తండ్రికి చెప్తే నాలుగు బండబూతులుతిట్టి ఆ కోపంలో కల్లుపాకకి పోయి మరికాస్త తాగొస్తాడు – లేదా "యెదవ చదువు–వద్దంటే యిన్నావా? –" అని తననే తిడతాడు– తప్పంతా తన చదువుదే అయినట్లు – అక్కడికి చదువుకోని ఆడవాళ్ళజోలికి ఎవరూ రానట్లు – అయితే ఒకటిమాత్రం కాదనటానికి వీల్లేదు – తను చదువుకోవటం వల్ల–కొంత శుచిగా, శుభ్రంగా, సంస్కారవంతంగా ఉండటంవల్ల అందరికళ్ళూ తనమీదే ఉన్నాయి – అయితే అందుకని తను చదువు మానెయ్యాలా? ఇదెక్కడి అన్యాయం? వెంకట్రావు బృందంలో ఒకరి కూతురుకూడా చదువుకొంటుంది – మరి ఆ పిల్లజోలికి వెళ్ళరేం? ఆ పిల్ల నడిచిరాదు – పరదాలున్న ఎడ్లబండిలో వెళ్ళివస్తుంది. ఒకే ఊరినుంచి ఒకేచోటికి వెళ్ళివస్తున్నా, తనను బండిలో ఎక్కించుకోదు. వర్షం వస్తున్నా సరే! ఒకే స్కూల్లో చదువుతున్నా, తను అందరికంటె అధికురాలయినట్లు రాణిలా ప్రవర్తిస్తుంది – – స్కూల్లో మిగిలినవాళ్ళు కూడా ఆ అమ్మాయిని అలాగే చూస్తారు – ఆ పిల్లపేరు సత్యవతి. పెద్ద రూపవంతురాలు కాదు – తెలివైనది కాదు– చురుకైనది కాదు – మరి ఈ గౌరవమంతా దేన్ని చూసి? ఆ అమ్మాయి వెనుకఉన్న డబ్బుచూసి....

మల్లి ఒక క్లాసు తరువాత ఒకక్లాసులోకి వస్తూ ఈ సమాజాన్నీ అర్థంచేసుకుంటున్నకొద్దీ ఆమెకు సమాజంపైన క్రోధమూ, కసీ పెరుకోసాగాయి– ఏదో ఒకనాడు ఈ సమాజాన్నంతా ఆటబొమ్మని ఆడించినట్లు ఆడించి తనకాళ్ళమీద పడేసుకుని గర్వంగా నవ్వాలనే తీవ్రమైన కాంక్ష కలిగేది.

మల్లి ఐదో క్లాసు చదువుతుండగా మల్లికి మరో చెల్లెలు పుట్టింది. ఈ మధ్యలో ఇద్దరు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళూ పుట్టారు. కుటుంబ నియంత్రణ పాటించాలని వాళ్ళకు తెలీదు. అప్పుడప్పుడు గ్రామసేవికలూ, మిడ్‌వైఫ్స్ వచ్చి చెప్పినా, దాని వాళ్ళొక ప్రహసనంగా తీసుకుని వేడుకగా వింటారు – దూరదర్శన్ వాళ్ళొస్తే, చిరునవ్వులతో పోజులిస్తారు. వాళ్ళు చెప్పమన్న మాటలు చెప్తారు. ఒకే గుడిసెలో కాపురముంటున్నా, ఏ చిరుగుల కంబళినో మరుగు చేసుకోగలుగుతారు. పిల్లలు పుడ్తూనేఉంటారు. మల్లికి బాగా జ్ఞానం వచ్చాక పుట్టిన ఆ చెల్లెలికి మల్లి తనే "మహతి" అని పేరుపెట్టుకుంది. ఆ పేరంటే మల్లికి చాలా ఇష్టం. ఆ తరువాత తండ్రితో పోరిపోరి ఎలా అయితేనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవటానికి ఒప్పించగలిగింది. మహతి ఇంచుమించుగా మల్లిచేతులలోనే పెరిగేది. ఆ పిల్ల అంటే తగని ముద్దు మల్లికి–ఆ పాపని ఎలాగైనా బాగా చదివించి గొప్పవాళ్ళ పిల్లల్లా తయారు చేయాలని కలలు కనేది.

మల్లి క్లాసులో అందరికంటె పెద్దది – మల్లి అందుకు చాలా సిగ్గుపడుతూ ఉంటుందికూడా – పదో క్లాసులో కొనవలసిన టెక్స్టుఅన్నీ కొనలేకపోయింది మల్లి – తన స్కాలర్‌షిప్ డబ్బులతో తను రెండు చీరలు కొనుక్కుంది. మహతి కోసం పాలడబ్బాలు కొంది. మహతి చాలా ఆరోగ్యంగా పెరగాలనేది మల్లి పట్టుదల – అంచేత లెక్కలటెక్స్ట్ కొనలేదు– ఏ రోజు హోంవర్క్ ఆ రోజు క్లాస్‌మేట్స్ దగ్గిర నుంచి ఎక్కించుకోవచ్చు – అనుకుంది. అయితే అలా ఎక్కించుకోవటం ప్రతి రోజూ కుదరలేదు. అలాలెక్కలు ఎక్కించుకోవటానికి బడి అయిపోయాక కూచోవాలి. ఆ టౌన్‌లో చదివే పిల్లల్లో చాలామంది చుట్టుపక్కల పల్లెల్లోంచి వచ్చేవాళ్ళే! అందుచేత ఎవరూ స్కూల్ అయిపోయాక కూచోటానికి ఒప్పుకోలేదు. టౌన్‌లో ఉండేవాళ్ళు పెద్దింటి పిల్లలు–వాళ్ళసలు మల్లితో స్నేహం చెయ్యటానికే ఇష్టపడరు–ఆ రోజు లెక్కలు హోంవర్క్ చెయ్యాని

వాళ్ళందరినీ లెక్కల మాస్టారు నిలబెట్టారు. మల్లి కూడా నిలబడవలసి వచ్చింది. ఒక్కొక్కరినీ మాస్టారు కారణ మడుగుతున్నారు, హోంవర్క్ చెయ్యనందుకు - అందరూ కడుపునొప్పి అనో, కాలునొప్పి అనో ఏదో ఒక కారణం చెప్తున్నారు. మల్లి మాత్రం "నేను లెక్కల పుస్తకం కొనుక్కోలేదు. అందుకని చెయ్యలేకపోయాను- హోంవర్క్ లెక్కలు ఎక్కించుకొందామంటే, ఎవరూ టెక్స్ట్ ఇయ్యలేదు." అంది. మాస్టారు మిగిలినవాళ్ళని మందలించి తనకు టెక్స్ట్ ఇప్పిస్తారని ఆశపడుతున్నట్లు - ఆ మాస్టారు వికృతంగా నవ్వి- "లెక్కల టెక్స్ట్ కొనలేదా? స్కాలర్‌షిప్ డబ్బంతా తమరి షోకులకే సరిపోలేదు కాబోలు!" అన్నారు- క్లాసంతా ఘొల్లున నవ్వింది. ఇలాంటి జోక్స్‌కి అందరూ నవ్వుతారు- కానీ ఆ జోక్స్ ఎవరిని ఉద్దేశించి వేయబడ్డాయో, వాళ్ళు ఎలాంటి చిత్రవధ అనుభవిస్తారో. ఎవరూ ఊహించలేరు. మల్లి సిగ్గుతో చితికిపోయింది. ఆ క్లాసు అయిపోయాక మిగిలిన క్లాసులకు హాజరుకాలేకపోయింది. ఆ కాంపౌండులో ఉన్న ఒక మర్రిచెట్టుకింద కూచుని మోకాళ్ళలో తలదూర్చి ఏడవసాగింది. స్కూల్ అయిపోయిందని గానీ, మిగిలిన పిల్లలందరూ వెళ్ళిపోయారని గానీ మల్లికి తెలియనే తెలియదు-అలా ఏడుస్తూనే ఉంది.

"మల్లీ!" అనే పిలుపు విని తలఎత్తింది. ఎదురుగా వేదమూర్తి-పొట్టినిక్కరు, పొట్టిచేతుల చొక్కాతో పాలు కారే పసిముఖంతో-నుదట విబూది రేఖలు, ఆ క్రింద కనుబొమల మధ్య చిన్న గుండ్రని కుంకుమబొట్టుతో- చొక్కా క్రిందనుంచి కొంచెం కొంచెం కనపడే యజ్ఞోపవీతంతో- వేదమూర్తి తన క్లాసే అయినా అగ్రవర్గాలపట్ల అజ్ఞాతంగా ఉండే బెరుకుతో, అతడితో ఎప్పుడూ మాట్లాడలేదు మల్లి. అతడూ ఆడపిల్లలతో ఎక్కువగా మాట్లాడేవాడు కాదు.

"ఇదిగో లెక్కల టెక్స్ట్ తీసుకో!"

పుస్తకం అందించాడు - మల్లి సంతోషంతో వికసించిన ముఖంతో "ఇప్పుడే లెక్కలన్నీ ఎక్కించుకుని ఇచ్చేస్తాను" అని పుస్తకాలసంచీ తెరవబోయింది. వేదమూర్తి వారిస్తూ "వద్దు. ఆ పుస్తకం నీదగ్గరే ఉంచేసుకో. నేనూ మా ఫ్రెండూ కలిసి ఇంటిదగ్గర మరో పుస్తకం చదివి లెక్కలు చేసుకుంటాం! అదీకాక ఇప్పటికే చీకటిపడుతోంది. మీ ఊరు వెళ్ళాలంటే చాలా దూరం నడవాలి కదూ!" అన్నాడు.

అప్పుడు చూసింది మల్లి, సూర్యుడు అస్తమించగా నల్లని మబ్బుల చుట్టూ ఎఱ్ఱని వలయాలు దిద్దుకొంటున్న ఆకాశాన్ని-

"హమ్మో! ఇప్పుడెలా? దారిలో ఆ రౌడీమూక ఎదురయితే నా ప్రాణాలుతీస్తారు." భయంతో పాలిపోతూఅంది. ఆ ముఖం చూస్తే జాలేసింది వేదమూర్తికి-

"నేను సాయం వస్తాను-"

"మళ్ళీ నువ్వు మాత్రం ఒంటరిగా రావద్దూ? మీది మా ఊరు కూడా కాదు-"

"ఫరవాలేదు- నాకు సైకిలుంది- అయినా నేను మొగాణ్ని- నాకు భయం లేదు-"

ఆ మాటలకి నవ్వొచ్చింది మల్లికి- ఆ పొట్టి నిక్కరులో ఉన్న అబ్బాయి సగర్వంగా "నేను మొగాణ్ని" అంటున్నాడు. పుట్టుకతోనే వస్తుందేమో ఈ అహంకారం.

సైకిల్ నడిపించుకొంటూ మల్లిపక్కన నడుస్తున్నాడు వేదమూర్తి. మల్లి భుజాలదాకా ఉన్నాడంతే! మొగపిల్లలు పొట్టిగా ఉండి ఉండి ఒక్కసారిగా ఎదిగిపోతారు.

"నీ కెన్నేళ్ళూ?" ముద్దుగా అడిగింది మల్లి-

"పదమూడు- నీకు?...."

"ఇరవై-"

"హమ్మబాబోయ్! అన్నేళ్ళా, ఇంకా పదోక్లాసు...."

"అవును, నేను చాలా ఆలస్యంగా బళ్ళో చేరాను-"

చిన్నబోయిన మల్లి ముఖంచూసి తను అలా అన్నందుకు నొచ్చుకున్నాడు వేదమూర్తి-

"సారీ! నిన్ను అవమానించాలని నా ఉద్దేశం కాదు-"

"నువ్వు నన్ను అవమానించలేదు- ఆశ్చర్యపోయావు- ఎవరైనా ఆశ్చర్యపోతారు-"

హరిజనవాడ ప్రాంతాలకు రాగానే వేదమూర్తి ఆగిపోయాడు - అక్కడ కొందరు గుడిసెలముందు వీధిలోఉన్న బండలమీద చేపపొలుసులు అరగదీస్తున్నారు- మరొకరు కోడిని కొయ్యటానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు పదేళ్ళ ఆడపిల్లలు వీధిలోనే దిసమొలల్తో స్నానాలు చేస్తున్నారు.

వేదమూర్తి ముఖంలోని అసహ్యాన్నీ, కంపరాన్నీ చూసి మల్లి లజ్జపడుతూ "ఇంక నువ్వు వెళ్ళిపో!" అంది. వేదమూర్తి తన సైకిలు వెనక్కు తిప్పుకొంటూ "ఇక్కడా నువ్వు ఉంటున్నది?" అన్నాడు.

'నీకూ, ఈ వాతావరణానికీ సంబంధం లేదు-' అన్నట్లుగా ఉన్నాయి అతడి మాటలు-

ఆరోజు రాత్రి మల్లికి నిద్రపట్టలేదు- 'ఇక్కడా, నువ్వు ఉంటున్నది?' అన్న వేదమూర్తి మాటలే అనుక్షణం చెవులలో ప్రతిధ్వనించసాగాయి.

**3**

తనెవరో, తన కులమేమిటో తెలుసుకున్నాక, వేదమూర్తి తనకు దూరంగా ఉంటాడనుకుంది మల్లి- కానీ

అలా జరగలేదు – అతడు మరింత సన్నిహితంగా వచ్చాడు. అతడి కళ్ళలో తనపట్ల మరింత సానుభూతి. అదేగాక ఏదో అద్భుత భావం. ఆ పంకంలోంచి ఈ పంకజం ఎలా వచ్చిందా, అన్నట్లుండే భావం. అతడిని "వేదా" అని పిలిచే చనువు మల్లిక రావటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. వేదమూర్తి తన టెక్స్టుబుక్స్ మాత్రమే కాక తన నోట్స్ కూడా ఇచ్చేవాడు. వేదమూర్తి తండ్రి ఇంగ్లీష్ లెక్చరర్– అంచేత ఇంగ్లీష్ పాఠాలకు అతడు స్కూల్లో టీచర్ కంటె, గైడ్స్‌లో ఉండే నోట్స్ కంటె, మంచి పాయింట్స్ ఇస్తుండేవాడు.... అవన్నీ మల్లికిచ్చేవాడు.... నిస్వార్థమయిన ఆ స్నేహానికి మల్లి పొంగిపోయేది. ఇద్దరూ పదో క్లాసు పాసయ్యారు– వేదమూర్తి కాలేజీలో చేరిపోయాడు, ఆ టౌన్‌లోనే, ఇంటర్ యం. పి. సి. గ్రూప్‌లో. మల్లి కాలేజీ పేరెత్తితే మండిపడ్డాడు తండ్రి. కాలేజిలో చేరాక అప్లై చేసుకుంటే స్కాలర్‌షిప్ వస్తే రావచ్చు కాని, ముందు ఫీజు కట్టాలి. ఆడపిల్లలకి ట్యూషన్ ఫీజు లేదు కానీ, లైబ్రరీ ఫీజూ, లాబరేటరీ డిపాజిట్లు వగైరాలున్నాయి– ఆ డబ్బు ఎక్కడినుంచి వస్తుంది మల్లికి? వేదమూర్తికి సానుభూతి ఉంది కాని, తండ్రిని డబ్బడిగే ధైర్యం లేదు. అయిదూ, పదీ అయితే తేగలడు. కానీ, అతడి బుర్రలో ఉపాయాలున్నాయి– మల్లితో చెప్పాడు–

"నాకు తెలిసిన డాక్టర్‌గారి కుటుంబం ఉంది. వాళ్ళింట్లో ముగ్గురు బండ – అంటే మొద్దుబుర్రగల ఆడపిల్లలున్నారు. వాళ్ళ బుర్రల్లోకి చదువు ఇంజక్ట్‌చేయగల ఆడటీచర్ కోసం వెతుకుతున్నారు. నిన్ను వాళ్ళకు పరిచయంచేస్తాను. వాళ్ళకు నీ పరిస్థితి చెప్పుకుని ట్యూషన్‌ఫీజు కింద అయిదొందలు అడ్వాన్స్‌గా అడుగు. కానీ, ఆ తరువాత రోజూ ఆ పిల్లలకి రెగ్యులర్‌గా ట్యూషన్ చెప్పాలి – ఏం, చెప్పగలవా?"

"చెప్తాను – ఎంత కష్టమైనా పడతాను – – ఏదైనా చేస్తాను. కాలేజిలో చేరి చదువుకోవలసిందే?" పట్టుదలగా అంది. వేదమూర్తి మల్లిని డాక్టరుగారి కుటుంబానికి పరిచయం చేసాడు. వాళ్ళు ఇంటికి వచ్చి తమ పిల్లలకి చదువుచెప్పే ఆడటీచర్‌కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. డాక్టరుగారి భార్య అయిదొందలు అడ్వాన్స్ ఇయ్యటానికి జంకినా, డాక్టరుగారు నచ్చజెప్పి ఇప్పించారు. ఆ రకంగా కాలేజీలో చేరింది మల్లి– మల్లికిప్పుడు డబ్బు విలువ బాగా తెలిసింది. ఆ ట్యూషన్ మానకపోగా మరి కొన్ని కుదుర్చుకుంది – కొంత డబ్బు ఎవరికీ తెలియకుండా దాచుకుంది బేంక్‌లో, డిగ్రీ చదువుకోసం – అలాగని చదువులో కూడా ఏ మాత్రం వెనకపడలేదు–

అయితే ఊళ్ళో ఆబోతులాంటి వెంకట్రావు బృందంతో అవస్థలుమాత్రం మల్లికి తప్పలేదు. ఏరోజుకారోజు ఎక్కడ ఎదురుపడ్డా వెంకట్రావు అతిదగ్గరగా వచ్చేసి ముఖంమీద ముఖంపెట్టి "వంద! వంద రూపాయలిస్తాను, ఒక్కరాత్రికి. వస్తావా?" అంటూఉంటాడు– చుట్టుపక్కలవాళ్ళు నవ్వుతారు. దారినపోయేవాళ్ళు కొందరు చూసీ చూడనట్లుగా పోతారు– కొందరు నవ్వుతారు– ఇంకా కొంతమంది మానవత్వం ఉన్నవాళ్ళు ముఖం చిట్లించుకుని చిరాకు ప్రదర్శిస్తారు. అంతేకాని, ఒక్కరంటే ఒక్కరుకూడా వెంకట్రావుని చీవాట్లుపెట్టరు – ఇదెక్కడి అన్యాయమని అడ్డుతగలరు. ఇంత బాహాటంగా ఇలాంటి ఛండాలపు మాటలు మాట్లాడుతున్నా, అతడి పెద్దమనిషితనానికేమీ లోటులేదు– ఎందుకంటే ఈ రకమైన మాటలన్నీ అతడికి హాస్యాలు– అతడు హాస్యమని ప్రకటిస్తే దానిని కాదనే దమ్ములు ఆ ఊళ్ళో ఎవరికీ లేవు. లోగడ ఒకరిద్దరు అతడి దుర్మార్గాన్ని ఎదుర్కొన్నారు – అది చివరకు పెద్ద తగవులాటకి దారితీసింది – చాలా మందికి పెద్ద పెద్ద దెబ్బలు తగిలాయి. దెబ్బలు తగిలినవాళ్ళు పోలీస్‌కేస్ కూడా పెట్టారు. కానీ, ఏ పోలీసులూ వెంకట్రావునీ అతడి బృందాన్నీ ఏమీ చెయ్యలేదు. కళ్ళుపోయినవాళ్ళు కాళ్ళు విరిగినవాళ్ళూమాత్రం ఈ నాటికీ అలాగే ఉన్నారు. అంచేత ఎవరూ అతడిని ఢీకొనటానికి సాహసించలేదు. వెంకట్రావులాంటి పెద్దమనిషి ముసుగులో ఉండే రౌడీలు మాత్రమేకాదు–గుళ్ళోపూజారికూడా రసికతలో తానేంతక్కువకాదనిపించాడు–ఒకనాడు కాలేజీనుంచి వస్తుండగా గుడి ప్రాకారందగ్గిర నిలబడిఉన్న పూజారి చూసాడు – "రా! అమ్మాయ్! వచ్చి దేవుడి ప్రసాదం తీసికెళ్ళు!" అని ఆహ్వానించాడు. ఆశ్చర్యంతో తబ్బిబ్బయిపోయింది మల్లి– ఎందుకంటే హరిజనులని గుళ్ళలో ప్రవేశింపచెయ్యాలని చట్టాలూ, ఆదేశాలూ, ఆశయాలూ ఎన్నెన్ని ఎలా ఉన్నా ఆ ఊళ్ళో గుడిలోకి హరిజనులని రానియ్యరు. హరిజనులలోనూ గుళ్ళోకి వెళ్ళాలని పట్టుబట్టేవాళ్ళు ఎవరూ లేరు. వాళ్ళకు దైనందిన జీవితసంగ్రామంతోనే కాలమంతా గడిచిపోతోంది. ఇక దేవుడూ, దయ్యమూ అంటూ మథనపడటానికి అవకాశమెక్కడిది? పూజారిగారు రమ్మని ఆహ్వానించినా, ఆ గుళ్ళోకి– తనవాళ్ళెవరికీ ప్రవేశంలేని ఆ గుళ్ళోకి నేను రానని చెప్పాలనిపించింది మల్లికి– కానీ, తరతరాలుగా వస్తున్న– రక్తంలో జీర్ణించుకుపోయిన కొన్ని నమ్మకాలు, కొన్ని ఆచారాలు– దేవుడి ప్రసాదం వద్దంటే పాపం వస్తుందన్న అనుమానం– పెద్దవాడు, పూజారి

మాటను తిరస్కరించటం బాగుండదన్న సంకోచం ....అన్నీ కలిసి కాదవలేక గుళ్ళోకి వెళ్ళింది. పూజారి అప్పటికప్పుడు పళ్ళెంలో హారతికర్పూరంవేసి వెలిగించి హారతి ఇచ్చాడు. ఆ హారతిపళ్ళెం మల్లిదగ్గిరగా తీసుకొచ్చి మల్లి కళ్ళ కద్దుకుంటూండగా వెకిలిగా నవ్వుతూ "మీ కులంవాళ్ళెవరినీ దేవుడికి ఇంత దగ్గరగా రానియ్యం – నీకు మాత్రమే ఈ దర్శనం" అన్నాడు. మల్లి తానా హారతి కళ్ళకద్దుకున్నందుకు పశ్చాత్తాపపడింది. ఆ హారతిపళ్ళెన్ని విసిరికొట్టనందుకు సిగ్గుపడింది– ఆ తర్వాత పూజారి ఇన్ని కొబ్బరిచిప్పలూ, బోలెడన్ని లడ్డూలూ – ఓ తట్టలోవేసి మల్లి ముందుకుచాపి "ఇందా! ప్రసాదం" అన్నాడు. మల్లి చెయ్యిచాపి అందుకోబోయింది–"నీకు ఇంత ప్రసాదం పెడుతున్నా కదా, నాకేం ఇస్తావు?" అంటూ మల్లి చెయ్యిపట్టుకుని మీదకు లాక్కోబోయాడు. మల్లి మొదట నిర్ఘాంతపోయింది – అంతలో తేరుకుని పూజారిని విదిలించికొట్టి గుళ్ళోంచి బయట పడింది. ఆ విదిలించటంలో ప్రసాదాలన్నీ గుళ్ళోని బురద నేలమీద దొర్లిపడ్డాయి. బయటపడ్డాక జరిగిందేమిటో ఆలోచించేసరికి మల్లికి మతిపోయినట్లయింది. గుడి – దేవుడు – పూజారి – ప్రసాదం.

ముందుకోపం – ఆ తర్వాత అసహ్యం – ఆ వెనక ఆపుకోరానంత నవ్వూ వచ్చాయి! ఛ! ఇదేం సమాజం? ఈ పూజారీ, వెంకట్రావూ వీళ్ళే ఈ సమాజాన్నేలే పెద్దలు! పెద్దమనుష్యులు! ఏనాటికయినా ఇదే సమాజంలో వీళ్ళ నిజస్వరూపాలు బయటపెట్టి వీళ్ళను అవమానించగలదా? ఆ అవకాశం వస్తుందా!

కుతకుత ఉడికిపోసాగింది మల్లి మనసు – మల్లి బి.యస్.సి. లోకి వచ్చేసింది ఆమెతో పాటు వేదమూర్తి కూడా వచ్చాడు– డిగ్రీలోకి వచ్చేసరికి అప్పటివరకు పొట్టిగా ఉన్న వేదమూర్తి ఒక్కసారిగా పొడుగయిపోయాడు. అయినా మల్లి కంటికిమాత్రం అతడు చిన్నపిల్లాడిలాగే కనిపించాడు. ఎప్పటిలా "వేదా!" అనే పిలిచేది. వేదమూర్తిలోనూ మల్లిపట్ల అభిమానం అలాగే ఉంది.

ఆ సంవత్సరం ఫిజిక్స్ లెక్చరర్‌గా నారాయణ్ వచ్చారు. ఆయన వచ్చిన కొద్దిరోజుల్లోనే అందరి దృష్టిలో మంచి లెక్చరర్‌గా పేరుతెచ్చుకున్నారు – చాలామంది అమ్మాయిల లాగే మల్లికూడా అతడివైపు ఆకర్షించబడింది – కానీ తన బతుక్కి అంత అదృష్టంకూడానా అని తన ఆశలను తనలోనే అణచుకొంది – అతడు మాత్రం చాలా రిజర్వ్‌డ్‌గా అందరినీ అభిమానిస్తోనే, అందరినీ అల్లంతదూరాన ఉంచేవాడు. ఆ డిసెంబరు సెలవుల్లో డిగ్రీ సెకండ్ఇయర్ విద్యార్థులందరూ రామప్పకు విహారయాత్రకు బయలుదేరారు. ఒక కంపార్ట్‌మెంట్ అంతా విద్యార్థినీవిద్యార్థులకే సరిపోయింది. పాటలూ, పద్యాలూ, జోక్స్, ఒకరిని ఒకరు వెక్కిరించుకోవటాలూ – కేరింతలతో జరిగింది ప్రయాణం ఎవరికీ అసలు ప్రయాణం చేసినట్లే అనిపించలేదు. ఎవరి ముఖంలోనూ ప్రయాణపు బడలిక లేదు, ఉత్సాహంతప్ప – కాజీపేటలో దిగి గెస్ట్‌హౌస్‌లో విద్యార్థులకు విద్యార్థినులకూ వేర్వేరుగా రెండుగదులు బుక్‌చేసుకుని స్నానాలవీ చేసుకుని, హోటల్‌లో కాఫీ ఫలహారాలు పూర్తికానిచ్చి, వరంగల్లు చూడటానికి వెళ్ళారు. ముందు వేయిస్తంభాల గుడి చూసారు– శిథిలావస్థలో ఉన్నా అద్భుతమైన కళాసంపద తొణికిసలాడుతున్న దేవాలయం అది. ఒకేరాతితో నిర్మించిందిగా తోచే అనేక శిల్పాలు అలా ఒకేరాతితో నిర్మించినవి కావనీ, ఏ భాగానికి ఆ భాగం నిర్మించి వాటిని అతికించారనీ విద్యార్థులకు తోడుగా వచ్చిన రామస్వామిశాస్త్రిగారు చెప్పారు– విరిగిపోయిన కళాఖండాలనుచూస్తే ఆ విషయం అర్థమవుతుంది. రాతిరాతినీ సిమెంట్‌తో అతికారు – అంటే ఆనాటి కాకతీయ శిల్పులకు సిమెంట్ వాడకం తెలుసు అని వివరించారు శాస్త్రిగారు – వివిధ నాట్యభంగిమలలో ఉన్న స్త్రీమూర్తులు – వికసించిన పద్మాకృతులు — దేవాలయంలో అంతట చల్లగాఉండేలా క్రాస్‌వెంటిలేషన్‌తో నిర్మించిన మంటపాలు – వివిధాలంకరణలలో చెక్కిన గంభీరమైన నంది విగ్రహాలు – అవన్నీ చూసుకుంటూ ముగ్ధులయిపోతున్నారు– "చూడండి! ఈనాడు మనం బాడీజీలలో వాడే పీటముడి ఆనాడే మన పూర్వులకు తెలుసు–ఇదిగో నందిమెడలో ఆ పీటముడి–" అని అతి చాకచక్యంతో సన్నని వంపులతో అందంగాచెక్కిన ఆ పీటముడిని చూపించారు–శాస్త్రిగారు. ఆ శిల్పాల్లో మరో ప్రత్యేకత ముగ్గురువ్యక్తులు నాట్యం చేస్తుండగా మనకు ఆరుకాళ్ళకు బదులు నాలుగుకాళ్ళే కనిపిస్తాయి అరకంగా నాట్యంచేసేవారన్నమాట! ఎన్నెన్ని నాట్యభంగిమలు! దేవాలయంలోంచి కోటలోకి ఒకసొరంగద్వారం ఉందిట! దానిని ఇప్పుడు మూసేసారట! ఆ మార్గం ప్రమాదమని చెప్పినా, కొందరు దుడుకు విద్యార్థినీవిద్యార్థులు అటువెళ్ళటానికి బయలుదేరారు. అక్కడి పెద్దలూ, శాస్త్రిగారూ వాళ్ళని గట్టిగా మందలించాక వెనక్కి తగ్గారు. ఆ తర్వాత కోటకు వెళ్ళారు. శిథిలావస్థలో ఉంది కోట – నాలుగుద్వారాలలో ఆంధ్రుల కళాప్రతిభకు చిహ్నంగా ఒక్కద్వారమే సంపూర్ణ శిల్పసంపదతో నిలిచిఉంది పౌరుషానికి చిహ్నంగా గర్జించే సింహాలూ–ఉదాత్తతకు,దివ్యత్వానికీ సౌభాగ్యానికి చిహ్నంగా స్వర్ణహంసలు–అక్కడే మెటాలిక్ సౌండ్

వచ్చే శిలనుకూడా చూపించారు శాస్త్రిగారు - ఒక చిన్న రాతి ముక్కతో ఆ శిలను మ్రోగించి ఆ ధ్వనిని ఆనందించారు, అందరూ- ఏనుగుపైన అధిరోహించిన సింహాల శిల్పాలబారు ఇంచుమించు అన్ని కుడ్యాలపైనా ఉంది. అది కాకతీయుల జాతీయ చిహ్నం కావచ్చునన్నారు, శాస్త్రిగారు. ఆ చిహ్నానికి అర్థమేమిటో? గజరాజును సింహం అతి సునాయాసంగా అధిగమించినట్లు శత్రురాజులను కాకతీయులు వశపరచుకుంటారనా? లేక ఏనుగు చిహ్నంగాగల రారాజులపైన అయినా కాకతీయులు సాధించిన విజయానికి చిహ్నమా? కోటలో శిల్పాలు చూసి ఆ తర్వాత స్వయంభూ దేవాలయాన్ని దర్శించి, ఏకశిలపైనెక్కి అక్కడినుంచి వరంగల్ నగరాన్ని చూసి ఆ తరువాత ఖుషీమహల్ చేరుకున్నారు. అక్కడ కాకతీయ రాజ్యంలో ప్రముఖుల సమావేశాలూ, విందులూ, వినోదాలూ జరిగేవట! - అక్కడే అందరూ తమ వెంట తెచ్చుకున్న స్వీట్స్, కారప్పూస మొదలైనవి తిని, కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఆ తరువాత భద్రకాళి గుడికి వెళ్ళారు - గుడిపేరు చెప్పగానే మల్లికి ఆనాటి పూజారి ప్రవర్తన గుర్తుకొస్తుంది - గుడి అంటేనే ఒకరకమయిన విరక్తి మల్లి మనసులో.... అందరినీ భద్రకాళి గుడిలోకి వెళ్ళనిచ్చి తానొక్కర్తే గుడిఆవరణలోఉన్న చెరువుగట్టు మీద కూర్చుంది. చాలా ప్రశాంతంగా ఉంది వాతావరణం. అస్తమించబోయే సూర్యభగవానుడు సరసులో కెంపులు వెదజల్లుతున్నాడు - మబ్బులన్నీ చాలా హడావుడిగా ఏ వేడుకకో తయారవుతున్నట్లు వింతవింత అలంకారాలు చేసుకొంటూ రకరకాల హొయలు వొలకబోస్తున్నాయి. చీర కొద్దిగా పైకి తీసుకుని, కాళ్ళు నీళ్ళలో వేలాడేసి, ఆ మబ్బుల్లో జీవితానికి అర్థంవెతుక్కోవాలని ప్రయత్నించసాగింది.

వెనుకనుండి "మల్లికా!" అనే సంబోధన వినిపించి ఉలిక్కిపడి లేచినిలబడింది. అలా కంగారుగా లేవటంలో ముందుకు తూలబోయింది. కొంచెంలో చెరువులోకి తూలేదే! నారాయణ్ మాస్టారు గట్టిగా పట్టుకుని నిలబెట్టారు. "మల్లికా!" అనే ఆ పిలుపు తన చెవులకు చాలా కొత్తగా వినిపిస్తోంది అప్పటివరకూ అందరూ "మల్లీ!" అని పిలిచినవారే! ఆ పిలుపుతోపాటు కళ్ళముందు మరెన్నో కొత్త లోకాలు పురివిప్పి ఆడినట్లయింది. దానితో పాటు భయం-కంగారు-

"సారీ సర్!"

"పరవాలేదు కానీ, గుడికి రాలేదేం? నీకు దేవుడంటే ఇష్టం లేదా?"

"ఇష్టమే సార్! కానీ ఇక్కడ లేడా సార్, దేవుడు?"

నారాయణ ఆ అమ్మాయికేసి కొంచెం ఆశ్చర్యంగా చూసి నవ్వాడు.

"జ్ఞానంలేనిదానిలాగ మాట్లాడేస్తున్నావు. నీకు గుడి అంటే ఇష్టం లేదా?"

"గుడి అంటేనూ, దేవుడంటేనూ కూడా ఇష్టమే సార్! పూజారి అంటేనే ఇష్టంలేదు."

నవ్వాడు నారాయణ్.

"మనం పూజారులతో రాజీపడక తప్పదు. ఒక్క గుళ్ళోనే కాదు-ఈ లోకంలో ఎక్కడపడితే అక్కడే ఉన్నారు పూజారులు."

అర్థంకాక అయోమయంగా చూసింది. ఆ అమాయకత్వానికి నవ్వుకున్నాడు నారాయణ్. ఈలోగా విద్యార్థినీ విద్యార్థులూ, మరో ఇద్దరు లేడీలెక్చరర్లూ ప్రసాదాలతో గుళ్ళోనుంచి బయటికొచ్చారు. ఒక లెక్చరర్ కొంచెం కటువుగా "ఏం మల్లీ! నువ్వు భద్రకాళిని చూడటానికి రాలేదే? ఆవిడ మీ కులదైవం కదా!" అంది. ఒక లెక్చరర్ నోట ఇలాంటి మాటలు మల్లికేగాక, మిగిలిన పిల్లలందరికీ కూడా చాలా కష్టం కలిగించాయి నారాయణ్ నవ్వుతూ "మల్లిక ఇక్కడ ఒంటరిగా సూర్యభగవానుణ్ని ఆరాధి



స్తోంది. శమంతకమణిలాటి మరో మణి కావాలిట, క్లాసు రావటానికి....” అన్నాడు. పిల్లలంతా నవ్వారు. ఆ నవ్వుల మధ్య మనసులను కలచిన కొద్దిపాటి గాలీ ఎగిరిపోయింది. అందరూ తిరిగి గెస్ట్‌హవుస్‌కి వెళ్తున్నప్పుడు మల్లి పక్కన వేదమూర్తి కూచున్నాడు. వేన్‌లో “మల్లీ! నువ్వు రాలేదు కానీ, ఆ భద్రకాళి నీలాగనే ఉంది” అన్నాడు.

“నాలాగనా?”

“అవును. చిరునవ్వు చల్లగా సౌమ్యంగా ఉంది. కళ్ళు మాత్రం తీక్షణంగా గంభీరంగా ఎదుటివారిని అల్లంత దూరాన నిలబెట్టేలా ఉన్నాయి.”

ఆశ్చర్యంగా వింది మల్లి-ఆమె దృష్టిలో వేదమూర్తి ఎప్పటి పసివాడే, అతడు తననింత పరిశీలనగా గమనిస్తాడని ఎప్పుడూ అనుకోలేదు. తన కళ్ళు తీక్షంగా ఉంటాయనీ అవి ఎదుటివాళ్ళని అల్లంత దూరాన నిలబెడతాయని మల్లికే తెలియదు, ఆ సంగతి.

ఆ మరునాడు రామప్ప దేవాలయానికి వెళ్ళారు. రామప్ప చెరువు-బ్రిడ్జి-చెరువుకు కట్టిన అనకట్టచూసి, రామప్పదేవాలయానికి వచ్చారు. రామప్ప దేవాలయంలో మిగిలినశిల్పాలన్నీ ఒక ఎత్తు,-ఆలయ ముఖద్వారంలోనే చూపరులను ఆకట్టుకొనే నాగిని శిల్పం ఒక ఎత్తు-ఆ శిల్పాన్ని చూస్తూ నిలబడిపోయింది. నల్లగా మెరిసిపోతూ నగ్నంగా ఉన్న శిల్పమది. కళ్ళలో అద్భుతమయిన ఆకర్షణ-చిరునవ్వులో కవ్వింపు. అంగాంగంలో యవ్వనశోభ-వీటన్నిటినీ మించిన ఆకర్షణ ఆ శిల్పం భుజాన్నీ, నడుమునీ, కాళ్ళనూ, చుట్టుకుపోయినట్లుగా చెక్కిన సర్పాలు, ఆ సర్పాలకూ ఈ ఆకర్షణకూ అవినాభావసంబంధం అని ధ్వనింపచేసే అపూర్వకళాఖండం.



కాకతీయుల మత సామరస్యానికి చిహ్నంలా విఘ్నేశ్వరుడు, శివుడు, కేశవుడు మొదలైన శిల్పాలలో కలిసిపోయి దిగంబర జైనశిల్పాలు - ఆలయ కుడ్యాలపైన సింహాలతో పోరాడే స్త్రీల శిల్పాలున్నాయి- ఆనాటి స్త్రీలు అంత పరాక్రమవంతులని చెప్పటానికి కాబోలు! ఒక స్త్రీ ఒకేసారిగా రెండు సింహాలతో పోరాడే శిల్పంకూడా ఉంది. ఆనాటి స్త్రీలకు అలాంటి శిక్షణ ఇచ్చేవారా? గజాసురసంహారం, గోపికా వస్త్రాపహరణం, సముద్రమథనం, మొదలయిన పూర్వగాథలన్నీ ఆలయాంతర్భాగాన కుడ్యాల పై భాగాన చెక్కి-ఉన్నాయి-కుడ్యాల క్రిందిభాగాలలో నాట్యభంగిమలు- నాట్యశాస్త్రానికి లక్ష్యాలైన భంగిమలు స్త్రీల శరీరాలపై అపురూపంగా చెక్కిన రకరకాల ఆనాటిఆభరణాలు-రామప్ప దేవాలయంలోని శిల్పవైభవాన్ని చూసి ఆనందించి ఇంకా ఇంకా చూడాలని ఉన్నా, టైమ్‌లేక, అక్కడ ఫలహారాలు తీసుకుని, వరంగల్ తిరిగివచ్చి హోటల్‌లో కాఫీలు త్రాగి పద్మాక్షి దేవాలయానికి బయలుదేరారు - ఆ ప్రయాణమే మల్లి జీవితంలో చిత్రమైనమలుపుకి నాంది అయింది

పద్మాక్షి దేవాలయం మొదట జైనదేవాయలమనీ, శ్రీ రామానుజాచార్యులవారు జైనులను ఓడించి, దానిని పద్మాక్షి ఆలయంగా మార్చారనీ అంటారు. ఇప్పటికీ పద్మాక్షికి పక్కనే దిగంబర జైనశిల్పం ఉంది- పద్మాక్షి ముఖానికి బొట్టుకాటుక ఉన్నా పురుష కవళికలు కన్పిస్తూ ఉంటాయి. ఆ దేవాలయం బాగా ఎత్తైన కొండమీద ఉంది. ఒక గుహలో ఉంటుంది, గర్భగుడి- కొండమీదికి మెట్లు బాగా ఎడంఎడంగా ఉన్నాయి. ఎక్కటం కొంచెం కష్టం. కొండ దిగువన ఒకవైపు చెరువు- మరోవైపున సమాధులు నిండిన శ్మశానవాటిక- విద్యార్థులలో కొందరు ఎలాగో లెక్చరర్సను ఏమార్చి. పేంట్లూ షర్టులూ విప్పి గట్టునపడేసి చెరువులోకి దిగారు, ఈదటానికి- అది చూసిన అమ్మాయిలు లెక్చరర్లకి చెప్పారు- లెక్చరర్లు వాళ్ళని బయటికి రమ్మని పిలిచారు. "మా వంటిమీద బట్టలు లేవు చిన్న అండర్ వేర్లుతప్ప- అమ్మాయిలూ మీరు దూరంగా వెళ్తే మేం బయటికి వస్తాం!" అన్నారు, నీళ్ళలోంచి విద్యార్థులు. ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి- చివరకు నారాయణ మాస్టారు, "నేనిక్కడుండి, వీళ్ళను తీసికొస్తాను- మీరంతా వెళ్ళండి" అన్నారు "అల్లరిమేళం-" అని విసుక్కొంటూ లేడీలెక్చరర్లు విద్యార్థినులను తీసుకుని ప్రయాసపడుతూ మెట్లెక్కసాగారు.

ఇంతలో చెరువులోంచి వేదమూర్తి "మల్లీ!" అని గట్టిగా కేకపెట్టడం- కంగారుగా వెనక్కి తిరిగిచూసిన మల్లి మునిగిపోతున్న వేదమూర్తిని చూసి, కాలుజారి ఎగుడు దిగుడుగా ఉన్న ఆ మెట్లమీదనుండి దొర్లుకుంటూ పడిపోవటం- వేదమూర్తి మునిగిపోవటం- ఒక్కసారిగా జరిగిపోయాయి. ఆ సమయంలో నారాయణ్ మాస్టారు చెరువులో ఉన్న మిగిలిన విద్యార్థులనుద్దేశించి "వేదమూర్తిని బయటికి తీసుకురండి!" అని అరిచి తాను మల్లి దగ్గిరకి పరుగుపెట్టారు- మల్లికి తలమీద పెద్ద దెబ్బ తగిలింది. స్పృహతప్పిపోయింది - - చాలా రక్తం ప్రవహిస్తోంది - మాస్టారు చకచక మల్లి పైటకొంగు చింపి. రక్తం ఆగటానికి కట్టుకట్టారు - కానీ, ఆగలేదు వెంటనే వచ్చిన వేన్‌లో మల్లిని ఆస్పత్రికి తీసికెళ్ళారు. డాక్టర్ మల్లి పరిస్థితిచూసి ఆస్పత్రిలో రెండు మూడు రోజులైనా ఉండవలసి వస్తుందని చెప్పాడు - కుట్లు పదహాయని చెప్పాడు.ఈదగా మిలినవాళ్ళు వేదమూర్తిని గట్టుకుచేర్చారు. కొద్దిగా నీళ్ళుమింగటం తప్ప అతడికి ఏంకాలేదు- "ఈదరాని వాడివి నీళ్ళలో ఎందుకు దిగావని లెక్చరర్లు బాగా చీవాట్లు పెట్టారు. మల్లికి జరిగిన ప్రమాదం తెలిసి ఆస్పత్రిలో మల్లిని చూసి చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. నారాయణ్‌మాస్టారు, భయంలేదని ఓదార్చారు- రెండు మూడు రోజులు మల్లిదగ్గిర ఎవరుంటారనే ప్రశ్నవచ్చింది- నారాయణ్ మాస్టారు తాను ఉంటాననీ, తనతో పాటు లేడీలెక్చరర్లలో ఒకరు ఉంటే బాగుంటుందనీ అన్నాడు.

కానీ వాళ్ళలో ఒకరు "ఒక్కరోజులో వచ్చేస్తానంటేనే మా అత్తగారు అతికష్టమీదం పంపించింది. రెండురోజులిక్కడుండిపోతే, ఆవిడ మళ్ళీ నన్ను ఆ ఇంటి గడప తొక్కనియ్యదు" అంది. మరొకావిడ "మా అబ్బాయికి మూడేళ్ళు- డ్యూటీ కాదనలేక విధిలేక వచ్చానేగానీ, నా ప్రాణాలన్నీ వాడిమీదే ఉన్నాయి. మరో రెండు రోజులు నే నిక్కడుండిపోతే, వాడు నాకోసం బెంగపెట్టుకుంటాడు-" అంది.

ఎంత చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నా, ఆడవాళ్ళు ఆడవాళ్ళే! నారాయణ్ మాస్టారు తానుంటానన్నారు. వేదమూర్తి తను కూడా ఉండిపోతానన్నాడు. ఇంకా కొందరు మొగపిల్లలు ఉంటామన్నా, నారాయణ్ మాస్టారు వాళ్ళనందరినీ పంపేసారు- రెండు రోజుల తర్వాత కళ్ళు తెరిచింది మల్లి- పక్కనే ఉన్న మాస్టారు ఆప్యాయంగా చెయ్యితట్టి "ఎలా ఉంది?" అన్నారు- మల్లికి జరిగిందంతా గుర్తుకొచ్చింది- "వేదమూర్తి ..." అంది భయంతో. బెడ్‌కి అటువైపు స్టూల్‌మీద కూచుని ఉన్న వేదమూర్తి

లేచొచ్చి "నేను బాగానే ఉన్నాను మల్లీ! పాపం! నా మూలంగానే నీకు...." అని ఏడుపుగొంతుకతో ఏదో చెప్ప బోతుంటే మాస్టారు అడ్డుకుని "ఎక్కువ మాట్లాడించకు-" అన్నారు. అతడు బిక్కముఖం వేసుకుని బేలగా చూస్తుంటే మల్లి చిరునవ్వు నవ్వింది - ఆ తర్వాత మరో రెండు రోజులకిగాని, మల్లి ప్రయాణంచేసే దశకి రాలేదు-ఆ రెండు రోజులూ మాస్టారు, వేదమూర్తీ మల్లిని కనిపెట్టుకుని ఉన్నారు.

## 4

"బాబుగారూ! నేను కూలికెళ్లాలి!" చేతులు నలుపు కొంటూ బిక్కముఖంతో అన్నాడు యాదయ్య.

ఉలిక్కిపడి గడియారం చూసుకున్నాడు తిలక్. పద కొండు దాటుతోంది. అతడు కూలికెళ్ళవలసిన సమయం ఎప్పుడో మించిపోయింది. ఇప్పటివరకూ ఆ మాట తనతో చెప్పలేక భయంతో అలాగే కూచుని మాట్లాడుకుంటూ పోయాడు- ఈ భయమూ, ఈ బెదురూ, వీటికి తోడు అమాయకత్వమూ, మూర్ఖత్వమూ వీళ్ళని మరింత దరిద్రం లోకి ఈడుస్తున్నాయి.

"ఏమనుకోకు యాదయ్యా? నీకు ఒక పూట కూలి పోయింది. ఇంద! ఇది తీసుకో!" అని జేబులోంచి పది రూపాయలు తీసి ఇయ్యబోయాడు- యాదయ్య తీసుకోలేదు.

"వద్దులెండి బాబయ్యా! మా మల్లిని సంపినోళ్లకి తగిన సిచ్చపడేలా సూడండి. నేయం సెయ్యండి- అంతే సాలు నాకు!" అని గుంటలుపడ్డ కళ్ళలో ఎప్పటికీ ఆరని కన్నీటిని తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు - జగన్‌బాబుని కలుసుకుంటే మరికొన్ని విషయాలు తెలుసుకోవచ్చునని పించింది. వాళ్ళనీ వీళ్ళనీ అడిగి అతడి ఆచూకీ తెలుసుకుని వెళ్ళాడు. రావిచెట్టు క్రింద మరో ముగ్గురితో చీట్లపేక ఆడు తున్నాడు, జగన్. తిలక్ అతడి దగ్గరగా వెళ్ళి "మీరు కొంచెం ఇలా వస్తారా? మీతో మాట్లాడాలి!" అన్నాడు-- అక్కడ జగన్‌ని "మీరు" అని మన్నించేవాళ్ళెవరూ లేరు. అందుచేత జగన్ తిలక్‌ని వింతగా చూసి "ఏం కావాలి? ఎవరు మీరు?" అన్నాడు - అతడి కంఠం బొంగురుగా అతడిలాగే బాగా రఫ్‌గా ఉంది. తిలక్ ఆలోచించాడు. అత నెవరో తను విన్నదాన్నిబట్టి తానెవరో అతడికి తెలిస్తే అతడు తనతో మాట్లాడడు- అంచేత ఇలా చెప్పాడు "నేనొక రచయితని. రాణి విషయం కథగా వ్రాయాలనుకొంటున్నాను. నీకు తెలిసిన సమాచారం చెపుతావేమోనని...."

జగన్ వెంటనే పేకముక్కలు కిందపడేసి లేచొచ్చాడు-

"ఎక్కడ కూచుందాం బాబూ! గుళ్ళో కూచుందామా?" అన్నాడు.

"పద."

ఇద్దరూ గుడికి వెళ్ళి మండపంలో స్తంభాల నానుకుని కూచున్నారు- అక్కడ ఎవరూ లేరు....

"ఇదేం గుడి ఇలా పాడుబడి ఉంది?" ఆశ్చర్యంగా అడిగాడు తిలక్....

"నెల కిందట పూజారి గుళ్ళోనే ఉరేసుకు చచ్చాడు బాబూ? ఆడు దెయ్యమై ఇక్కడ తిరుగుతున్నాడని ఊళ్ళో ఎవ్వరూ రాటంలేదు- ఆడు దెయ్యమై ఎట్టా ఉంటాడో సూడా లని నేనుమాత్రం రోజూ వస్తా! ఆడు నాకేనాడూ కనపడ్డు. చిత్రంగదు బాబూ? దేవుడూ దయ్యాలూ ఓ సోటే ఉంటం- సిత్రం ఏవుంది లెండి- దేవుళ్ళు దయ్యాలూ ఎప్పుడూ సెట్టాపట్టాలేసుకునే తిరుగుతయ్!"

చిత్రంగా ఉన్నాయి అతడి మాటలు- చదువుకోక పోయినా తెలివిగలవాడిలాగానే ఉన్నాడు-

"పూజారి ఎందుకు ఉరిపోసుకున్నాడు?"

"అందుకు ఒక రకంగా రాణి కారణం లెండి. కొంత ఆడి పాపం కారణం- ఆడి పాపమే ఆడిని కొట్టింది- బాబు గారు! తవరు రాణి కత రాయండి- అట్టాగయినా లోకానికి మంచి చెడ్డలు తెలుస్తయ్- ఈ నాయాలూ, సట్టాలూ, కోర్టులూ ఇయ్యన్నీ ఏంసెయ్యవు...."

అతడు బాగా బాధపడుతున్నాడు- రాణిని నిజంగా అభి మానించిన వాడివ్వాలి- అతడి వృత్తిలో ఉన్నవాళ్ళకి అలాంటి అభిమానాలుంటాయా లేక ఇదంతా రాణి గొప్ప తనమా?

"నీకు తెలిసినదంతా చెప్పు" అన్నాడు తిలక్. జగన్ చెప్పటం మొదలు పెట్టాడు- అతడి దృష్టిలో మల్లి రాణి మాత్రమే!

* * *

చేతిలో పుస్తకాలు పట్టుకుని కాలేజికి వెళ్తోంది రాణి. జగన్ నెమ్మదిగా ఆమెను సమీపించాడు-

"బుల్లెమ్మా! మాట!" అన్నాడు. రాణి ఆగిపోయింది. భయంగా చూసింది-

"మనూరికి ఓ రాజకీయ నాయకుడొచ్చాడు తెలుసా?"

తెలుసన్నట్టు తలాడించింది- అప్పటికి వారంరోజుల్నించీ ఊళ్లోరాజకీయ నాయకుడొస్తున్నాడని తెగ హడావుడిగా ఉంది. రోడ్లు ఊడిపించారు, తోరణాలు కట్టించారు- ఇంటింటికీ తిరిగి కోళ్ళు వగైరాలు సిద్ధంచేశారు. సభావేదికలు ఏర్పాటు చేసి పైన పందిళ్ళు వేసారు. ఆ క్రిందటి రోజు సాయం

త్రమే నాయకుడుగారు వచ్చి ఊరికి కొంచెం దూరంలో ఉన్న గెస్టుహవుస్‌లో వేంచేసి ఉన్నారు. ఆ సాయంత్రం కారులో వస్తున్నప్పుడే ఘనతవహించిన శ్రీవారి కన్ను కాలేజి నుంచి ఇంటికొస్తున్న రాణిమీద పడింది. ఎవరూ? ఏమిటి? అవి క్షణాలమీద వాకబు చేసారు. హరిజనుల పిల్ల అనీ, గుడిసెలలో ఉంటోందనీ తెలిసాక వారికెక్కడ లేని ఉత్సాహమూ వచ్చింది. తాము అహ్వానించటమే ఆలస్యం. ఎగిరి గంతేసి నేరుగా వచ్చి తమవళ్ళో వాలుతుందనుకున్నారు. తమ ప్రియ అనుచరులచేత జగన్ చెప్పించారు.

"బుల్లీ! రాత్రికి అయ్యగారి గెస్టువుస్ కాడికొస్తావా? బాగానే గిట్టు బాటవుద్దిలే?" డైరెక్టుగా అడిగాడు. రాణి కాదంటుందేమోననే అనుమానమయినా లేదు అతనికి. బిత్తరపోయింది రాణి. రెండుచేతులూ జోడించి ఏడుపుగొంతుతో "నేవలాంటిదాన్ని కాదన్నా! నాతో అలా మాట్లాడకు" అంది.

ఈసారి జగన్ తెల్లబోయాడు. తనమాటలకు రాణి లొంగిపోతుందనుకున్నాడు కానీ, ఇలా మాట్లాడుతుందనుకోలేదు. అతడు తన అనుభవంలో రాణికంటె పైస్థాయిలో ఉన్న వాళ్ళు-అంతకంటె బాగా చదువుకున్నవాళ్ళు ఏవో ఏవో ప్రయోజనాల నాశించి పైఅధికారుల దగ్గరకి వెళ్ళటం చూసాడు. అతడు తార్పుడుగాడయినా నీతినియమాలున్న వాడు. ఒప్పుకున్న ఆడవాళ్ళను తీసికెళ్తాడు కానీ, ఒప్పుకోని వాళ్ళని బలవంతం చెయ్యడు.

"ఏవమకో బోక బుల్లెమ్మా! ఊళ్ళో అంతా నీ గురించి పదిరకాలుగా అనుకొంటాఉంటే" రాణి .... నవ్వుకుంది. ఊళ్ళో తనను రకరకాలుగా ఆడిపోసుకొంటున్నారన్నమాట నిజమే. కానీ, దుర్మార్గులు చెడుచెయ్యాలనుకున్నా, అది తనకు మంచిగానే పరిణమించింది. ఆ రోజు తను ఎంత వద్దంటున్నా నారాయణ్ మాస్టారు తనని ఇంటిదాకా దింపి వెళ్ళారు. ఆ పరిసరాల్లోకివచ్చాక రాణి తనను ఎందుకు రావద్దందో అర్థమయింది మాస్టారికి. ఒకసారి సానుభూతిగా చూసి "మరి రెండు రోజులు ఆస్పత్రిలోనే ఉండవలసింది." అనేసి వెళ్ళిపోయారు. ఆయన ఆ మాట ఎందుకన్నారో, ఊహించుకోగలిగిన రాణి లోలోపల చాలా సిగ్గుపడింది. తమ జీవితాలు ఎందుకింత వికృష్టంగా ఉండాలి? అనే మధన ఆమె మనసులో మరింత ఎక్కువయింది. రాణి తలకి కట్టు ఉన్నా, వంట్లో ఆరోగ్యం లేనట్లు స్పష్టంగా తెలుస్తున్నా- ఎవరు వ్యాపింపచేసారో, ఎలా వ్యాపించాయో, రాణి మిగిలిన పిల్లలందరితో కలిసి గ్రామానికి రాకుండా నారాయణ్ మాస్టారితో వరంగల్‌లోనే గడిపిందన్న వార్తలు వ్యాపిం


*With Best Compliments from*

# GOLI ESWARIAH

Dealers in

**Papers, Boards and Printing Materials**

**General Bazar, SECUNDERABAD - A. P.**

Phone : 74386
Resi : 74383

Grams : **'FANCY PAPER'**
Secunderabad

గెలవండి!

అనిర్వచనీయమైన అదృష్టం

రూ. 5,00,000

ప్రత్యేక బంపర్ బహుమతి

అన్ని సిరీస్‌లకు ఒకటి

దసరా-దీపావళి-పండుగల

ప్రత్యేక బంపర్ డ్రా

భాగ్యలక్ష్మి
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర లాటరీ



5 సిరీస్‌లకు

| | | | |
|---|---|---|---|
| 5 మొదటి బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 1,00,000/- |
| 5 రెండవ బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 10,000/- |
| 10 మూడవ బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 5,000/- |
| 40 నాల్గవ బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 1,000/- |
| 40 ఐదవ బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 500/- |
| 400 ఆరవ బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 100/- |
| 400 ఏడవ బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 50/- |
| 4000 ఎనిమిదవ బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 10/- |
| 80,000 తొమ్మిదవ బహుమతులు : | ఒక్కొక్కటి | రూ. | 5/- |

మొత్తం బహుమతుల రొక్కం: రూ. 16,60,000/-
మొత్తం బహుమతుల సంఖ్య. 84,901

ఈరోజే మీటికెట్ కొనండి!

టిక్కెట్ ఖరీదు : రూ. 1/-

ఎం.వి.ఎస్. ప్రసాదరావు, ఐ. ఎ. ఎస్.,
డైరెక్టర్ ఆఫ్ స్మాల్ సేవింగ్స్
అండ్ స్టేట్ లాటరీస్,
ఎ. పి. గార్డ్స్., హైదరాబాద్ - 500 004.

డ్రా తేదీ: 9-11-1981

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర లాటరీలు

Associated/T


వాయి. ఆ వార్తలకు చిలవలు పలవలు తోడయ్యాయి. ఫలానా హోటల్‌లో గడిపిందని, ఒకరు కాదు ఇద్దరూ కలిసిమరేదో ఊరు వెళ్ళారని మరొకరూ ఇలా ఎవరికి తోచిన కథలు వాళ్ళు చెప్పుకోసాగారు. మానవ ప్రవృత్తి ఎలాంటిదో కానీ, ఏదైనా చిన్న విషయం ప్రారంభమవ్వాలే కాని అది అద్భుతంగా పెరిగిపోతుంది. అందులోనూ ఇలాంటి సెక్స్ స్కాండల్స్‌లో మరీ అద్భుతంగా పెరిగిపోతాయి. ఎవరి సృజనాత్మక ప్రతిభ ననుసరించి వాళ్ళు నగిషీలు చెక్కుతూనే ఉంటారు. మరిన్ని వన్నెచిన్నెలు పెరుగుతూనే ఉంటాయి. కొందరు "ఇది మొదటసారి కాదు. ఇదివరలో కూడా ఎన్నోసార్లు కలుసుకున్నారు" అంటే, మరి కొందరు "అయ్యో! మీకు తెలీదా! మల్లికి మూడో నెలో, నాలుగో నెలో నట!" అంటే ఇంకా కొందరు "అదికాదు. కడుపు అంతకుముందే ఉంది. అది తీయించుకోటానికే ఈ వంకన అక్కడుండిపోయింది" అన్నారు. ఇలా ఎన్నెన్నో వార్తలు. ఊళ్ళో ఎవరినోటవిన్నా ఈ కబుర్లే! రాణి రోడ్డంట వెళ్తుంటే చాలు, అందరూ గుసగుసలు చెప్పుకొనేవారు. కొందరు వెనుకనుంచి గుసగుసలాడ్తుంటే కొందరు ముఖం మీదే "ఏమ్మా! ఇప్పుడు నీకు ఆరోగ్యం ఎలా ఉందీ?" అని అడిగేవారు, వ్యంగ్యం ఉట్టిపడేలా ........ ఇలాంటి పుకార్లు వ్యాపించటానికి ప్రధాన కారణం వెంకట్రావు బృందం అని రాణికి తెలుసు. కానీ, ఏం చెయ్యగలదు? ఊళ్ళో వ్యాపించిన కార్చిచ్చు నెమ్మదిగా కాలేజిదాకా పాకింది. కాలేజిలో చాలామందికి నిజంగా జరిగిందేమిటో తెలుసు. అయినా అల్లరికి అర్థం ఉండదు. రౌడీలు ఒకరిద్దరున్నా చాలు, మొత్తం వాతావరణమంతా పాడుచెయ్యగలరు. కాలేజి గోడలన్నింటిమీదా, ఇంకా టౌన్‌లో కొందరి ఇళ్ళ గోడలమీదా, రకారకాల వ్రాతలు—రాణివి, నారాయణ్ మాస్టారివి బొమ్మలు. రాణితల్లి మెటికలువిరుస్తూ "అల్లనోట్లో దుమ్ముపడ! అల్ల చేతులిరగ!...." అని తిట్టిపోస్తే తండ్రి తాగిన మైకంలో "యెదవ సదువు. వొద్దంటే, యిన్నా?...." అని సాగదీస్తూ అరిచేవాడు.

ఈ గోలతో అల్లర్లతో రాణికి నిజంగా పిచ్చెక్కినట్లయిపోయింది. కాలేజి మానేసి ఇల్లుకదలకుండా గుడిసెలో ఉండిపోయింది ఏడుస్తూ. అలా రెండురోజులు గడిచిపోయాయి. మూడోరోజు గుడిసె బయటినుంచి "మల్లికా!" అనే పిలుపు వినిపించింది. అలా తనను పిలిచేదీ, అంత తీయగా పిలిచేదీ ఒక్కరే! ఒక్క గెంతుతో గుడిసె బయటకొచ్చి అలవాటుగా "నమస్కారం మాస్టారూ!" అంది. నారాయణ్ మాస్టారు ఆశ్చర్యంగా రాణిని చూస్తూ నిలబడిపోయారు.

అప్పుడు గుర్తొచ్చింది రాణికి, రెండురోజులుగా ఏడుస్తూ పడుకున్నట్లు- "ఇప్పుడే వస్తాను." అని లోపలికి వెళ్ళబోయింది. మాస్టారు చటుక్కున చెయ్యి పట్టుకుని ఆపు చేసారు. "నిన్ను ఇలా చూడటమే బాగుంది. కాలేజికి ఎందుకు రావటంలేదూ?" అన్నారు. రాణి తలదించుకుంది. కళ్ళు రెండూ నీళ్ళతో నిండిపోయాయి మళ్ళీ.

"ఈపుకార్లకీ, ఈ అల్లరకీ మనం భయపడక్కర్లేదు. నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను - నీకు అభ్యంతరం లేకపోతే........"

రాణి తడికళ్ళు మిలమిల మెరిసాయి. వంగి అతడి పాదలకు నమస్కరించబోయింది. రాణి పూర్తిగా వంగకుండానే అతడు లేవనెత్తి "డోంట్ బి సిల్లీ!" అన్నాడు.

మాస్టారే ధైర్యంచెప్పాక రాణి మళ్ళీ సగర్వంగా కాలేజికి బయలుదేరింది.

తను మాస్టారిని పెళ్ళిచేసుకోబోతున్న వార్త జగన్‌కి చెప్పి "ఇంట్లాంటి ఛండాలపు మాటలు నా దగ్గరనకన్నా! పరువుగా బతకాలనుకొంటున్నా!" అంది.

జగన్ నిండుమనసుతో ఆశీర్వదిస్తున్నట్లు చేయెత్తి "ఏమనుకోకు బుల్లీ! ఊరంతా ఏటేటో అంటాఉంటే నిజమనుకున్నా! బతికి పో! నేను యేరే సుత్తాలే, ఆ నాయకుడుగారికి........" అని వెళ్ళిపోయాడు.

ఈ నాయకుడు, చూడటాలూ.... ఏమిటో ఈవ్యవహారాలను కొని లోలోపల ఎంతో ఆశ్చర్యపోయింది. అప్పటికింకా లోకం తెలియని రాణి.

జగన్ నాయకుడుతో చెప్పాడు. "మీరు చూసుకున్న పిల్లకి పెళ్ళి కుదిరిపోయిందండీ, మరో పిల్లని చూసుకోవాలి. చూసి తెస్తాలెండి రాత్రికి........" అని. నాయకుడు మండిపోయాడు. తన కన్నుపడ్డ పిల్లకి పెళ్ళికుదరటమా? ఆ పిల్ల కన్యాత్వపు అందాలను తను కాక మరొకరు అనుభవించటమా? "అదేం కుదర్దు-దాన్నే ఈడ్చుకురా!" అన్నాడు అహంకారంతో........

జగన్ కళ్ళు ఎఱ్ఱబడ్డాయి.

"మా ఊళ్ళో అట్టాంటియి సాగవండి. అయినా తమరికిదేం బుద్దండీ, పెళ్ళిసుకోబోయే అమ్మాయిని పాడు చేస్తానంటారు? మీకు తగిన మరోదాన్ని సుత్తాలెండి!"

ఆ చివరి మాటల్లో వెటకారం నాయకుడుగారి గుండెను తాకింది. అయినా జగన్ కళ్ళలో ఎఱుపు ఆ దొరగారిని భయపెట్టింది. ఆయనకి అహంకారమెంతో భయం అంతకు రెండురెట్లు-అంచేత తనలో తనే ఏదో ఆలోచించుకుని పైకి సౌమ్యంగా "ఈ రోజు కాదులే! మూడ్ పోయింది. తరువాత


*" With Best Compliments*

*From*

**E. I. D-PARRY (INDIA) LTD.,**

" DARE HOUSE "

MADRAS - 600 001.

BOMBAY :: CALCUTTA :: NEW DELHI. "

చూద్దాం !" అని పంపేసారు.

ఆ ఊళ్ళో జగన్ పలుకుబడి నాయకుడికి తెలుసు. అందుకే బాహాటంగా అతడిని ఎదిరించదలచుకోలేదు.

ఆ రాత్రి–అర్ధరాత్రి కూడా కాదు – తొమ్మిదీ, పది ప్రాంతాల్లో – రాణిఇంటిమీదకి అయిదారుగురు గూండాలు బాగా కర్రలతో వచ్చిపడ్డారు. అడ్డుపడ్డ యాదయ్యనీ అతడి భార్యనీ చావబాది ఆ తల్లిదండ్రుల కళ్ళముందే రాణినోట్లో గుడ్డలు కుక్కి ఎత్తుకుపోయారు. అరవటానికి కూడా శక్తి లేకపోయింది ఆ భార్యాభర్తలకి.

తెల్లవారింది. నిప్పులు కక్కుతూ అవతరించాడు సూర్యభగవానుడు. కాకులు "కా, కా" అని అరుస్తూ, ఊరిని జాగృతం చేయాలని వ్యర్థప్రయత్నాలు చేస్తున్నాయి. ఏ కేకలూ, ఏ ఆర్తనాదాలూ ఎవరికీ వినపడకుండా, గుళ్ళో గంటలు ఘల్లున మోగుతున్నాయి. ఆ సమయాన తెగిన చెప్పుని విసిరేసినట్టు రాణిని తన గదిలోంచి తోసేసాడు నాయకుడు. అక్కడ ఎప్పటినుంచో కాచుకునికూచున్న ఇద్దరు 'ద్వారపాలకులు రాణిని చెరోరెక్క పట్టుకుని ఈడ్చుకొచ్చి గెస్ట్‌హవుస్‌కి దూరంగా నడిరోడ్డుమీద వదిలేసారు. రాణి పిచ్చిదానిలా నడవసాగింది. విడిపోయినజుట్టు ముడేసుకోలేదు. అస్తవ్యస్తంగా ఉన్న చీర సర్దుకోలేదు. అలా నడుస్తూనేఉంది. తిన్నగా జగన్‌ముందు నిలిచింది.

"ఒరేయ్ జగ్గా! దుర్మార్గుడా! డబ్బుకోసం ఇంత గడ్డితింటావా? నీ ఊరి ఆడబడుచుని ఆ కుక్కకి ఎర వేస్తావా? థూ!"

ఆ గర్జనకి మత్తుగా తాగిపడున్న జగన్ కళ్ళు తెరిచాడు. ఎదురుగా మహిషాసురమర్దనిలాఉంది రాణి–విరబోసుకున్న జుట్టు–చెదరిన కుంకుమ– ముఖంనిండా గోళ్ళరక్కులు–పంటిగాట్లు–ఎఱ్ఱగా అగ్నిగోళాల్లా మండుతున్న కళ్ళు.

"ఏంటి? ఏంటి?" అని లేచిన జగన్‌కి క్షణంలో అంతా అర్థమయిపోయింది.

"ఏంటా? ఆ దొంగ........కొడుకు నిన్ను ఎత్తుకెళ్ళాడా? వాడి అంతుచూస్తాను. ఒరేయ్ పోలాయ్! పల్లిగా రండిరా ........" అంటూ తన బలగాన్నంతా పోగేసి 'అందరూ కర్రలతో గెస్ట్‌హవుస్‌మీద పడ్డారు. అయితే అక్కడ వీళ్ళను చూసి గడగడ వణికిపోతున్న వాచ్‌మన్ తప్ప ఎవరూలేరు. నాయకుడుగారు అంతకు ముందే తమ వాహనంలో వెళ్ళిపోయారని తెలిసింది. ఆ అనుచరులేమయ్యారో ఎవరికీ తెలీదు....ఉసూరుమంటూ వాళ్ళంతా తిరిగొచ్చేసరికి అప్పటివరకూ నిలబడే ఉన్న రాణి ఆత్రంగా "చంపేసారా?" అని అడిగింది. "దొంగనాయాలు! పారి


*DEEPAVALI GREETINGS*

**ROHINI ENTERPRISES**

**Printers' Providers, Stationers and General Suppliers**

**2-1-340/6, NALLAKUNTA, HYDERABAD-500 004.**

**Distributors For**
**"COATES PRINTING INKS"**

**Stockists For**
**"TAKO" CELLULOSE TAPES**

పోయాడు" అన్నాడు జగన్ కచ్చగా. అప్పుడు కూలబడి పోయింది రాణి.

## 5

చుట్టూ తాగుబోతు రౌడీలు!– వాళ్ళ మధ్య రాణి– చెరిగిన జుట్టుతో– చెదిరిన చీరతో. కానీ రాణికి ఏదీ తెలియటం లేదు–దేనినీ లక్ష్యపెట్టటంలేదు. మండుతున్న కళ్ళతో– మొద్దుబారిన మనసుతో అలానే కూచుంది–

"ఇంటికెళ్ళు బుల్లెమ్మా!" జాలిగా అన్నాడు జగన్....
ఇల్లు– గానుగెద్దులా చాకిరీచేసే తల్లి– తప్పతాగి నోటికొచ్చినట్టు వాగే తండ్రి– చింకి లాగులతో– చింపిరి జుట్లతో తిండికి కరువాచిపోయినట్లుగా ఉండే తమ్ముళ్ళు– ముద్దుగా ఆరోగ్యంగా కళకళలాడే షహతి–

ఆ ఇంటికి తను మళ్ళీ వెళ్ళగలదా? వెళ్ళి ఏం చేయాలి? ఇల్లు– గుడి– పూజారి– ఊరు– వెంకట్రావు– నాయకుడు.

తల గిర్రున తిరుగుతోంది రాణికి.

"నేను వెళ్ళను–" అంది. ఆ గొంతులో మంట ఉంది. బాధ ఉంది– మొండితనం ఉంది. కసి ఉంది. జగన్‌కి ఏం చేయాలో తోచలేదు– అతడు మంచివాడే! ఏదైనా అవసరమయితే సహాయం చెయ్యగలడు. కానీ, ఇలా మొండికేసి తన పక్కన కూచున్న అమ్మాయిని ఎలా భరించగలడు? కొంచెం చికాకనిపించినా, ఆ స్థితిలో ఉన్న ఆడపిల్లతో కఠినంగా ప్రవర్తించలేకపోతున్నాడు.

"పోనీ, నిన్ను పెళ్ళాడతానన్న ఆ మాస్టారి దగ్గరికే వెళ్ళు. ఆయన మంచోడంటున్నావు. నీ తప్పేం లేదుగా! నిన్ను ఏమీ అనడు. జరిగింది మరిచిపోయి సుఖంగా బతుకు...."

ఎలాగైనా రాణికి నచ్చజెప్పాలని చూస్తున్నాడు జగన్.

అవును మాస్టారు మంచివారు. జరిగింది చెప్తే తన తప్పు లేదని అర్థంచేసుకుని తనను క్షమిస్తాడేమో! పెళ్ళి చేసుకుంటాడేమో! కానీ, ఈ దుర్మార్గుడు– ఇంత చేసిన దుర్మార్గుడు– ఇలా తప్పించుకుపోవలసిందేనా? ఇలా దర్జాగా సంఘంలో తిరుగుతూ మరెందరో ఆడపిల్లల్ని నాశనం చెయ్యవలసిందేనా? అలా జరగకూడదు– వీడికి బుద్ధి చెప్పాలి– తగిన శాస్తి చెయ్యాలి–

"జగ్గన్నా! మనం వీడిమీద కేసుపెట్టలేమా? వీడికి ఉరిశిక్ష వెయ్యలేమా? కనీసం జైలులోకి పంపలేమా?"

ఆక్రోశం గుండెల్లోంచి– ఏదో– ఏదో చేసెయ్యాలి.

"అయ్యో! పిచ్చితల్లీ!" జాలిగా చూశాడు జగన్.

"ఇదివరలో ఇలా నీలాంటి పిచ్చి మాలోకమే కేసెట్టింది– ఏమయిందో ఎరుగుదువా? కోర్టులో నానా గోల

For all your requirements of Paper Bags, Polythene Bags, Butter Paper Bags & Envelopes

**Andhra Paper Bag Company**

**General Bazaar, Secunderabad - 500 003; Tel. : 72749**

*Seasons Greetings & Best wishes from :*

**Mysore Paper Corporation**

General Bazar, Secunderabad - 500 003; Tel : 72749

Agents for :

Sun Paper Company — Mfrs. of 'Lustre Cote' Art Paper, Art Card and Chromo paper. Rohit Pulp and Paper Mills Ltd., — Mfrs. 'Peal Glow' Art Paper, Art Card, Chromo Paper, Bankers Ledger and White Maplitho, Mysore Paper Mills Ltd., — Mfrs. of 'Bison' brand White and Kraft Paper.

అయింది. ఆ ఎత్తుకెళ్ళిన మనుషులు అదిమనుషులేనని రుజువేంటి?- అన్నారు. చెడగొట్టింది ఆడేనని రుజువేంటి?- అన్నారు. అసలది మంచి మనిషని రుజువేంటి?- అన్నారు. రుజువూ- రుజువూ- రుజువూ- అని నిగ్గదీసారు. ఈ ఎర్రి కూతురి దగ్గిర ఏం రుజువుంటుంది, కడివెడు కన్నీళ్ళు తప్ప- చివరకు ఆడు చెక్కుచెదరలేదు కానీ, ఈ అడ కూతురు నానా అల్లరీ అయింది. ఆ అవమానం పడ్లేక పాడు చెరువులో దూకి నిండు ప్రాణం విలువునా తీసుకుంది. అంతే తల్లీ, ఈ కోర్టులు, ఈ కేసులు?....”

రాణి వింది- ఆ మనసు చల్లబడలేదు. మరి కాస్త రగిలింది. పట్టుదల సడలలేదు- రెట్టింపయింది.

“జగ్గన్నా! ఏదయినా చెయ్యాలి. ఎలా అయినా చెయ్యాలి- వాడినిలా వదల కూడదు- వాడి అంతు చూడాలి- చెప్పు జగ్గన్నా! ఏదో ఒక ఉపాయం చెప్పు”.

జగన్ ఆలోచించాడు- అతడికి తెలిసింది ఒక్కటే-అతడి వృత్తి- అందులో తరతమాలు.

“అడి కంటె పైవోణ్ని వలలో యేసుకోగలిగితే- అడి చేత ఊడిని తిప్పలు పెట్టించొచ్చు- అయితే నీ బతుకంతా బుగ్గయిపోతాది- వద్దమ్మా! మాస్టారికాడికి పోయి సుకంగా బతుకు-”

“జగ్గన్నా! వాడిఅంతు చూస్తేనేకాని నాకు ఈ జీవితంలో సుఖం లేదు- శాంతి లేదు- నాకు కావలసింది అదొక్కటే! వాడిమీద పగ తీర్చుకోవటం- అందుకు మార్గం చూపించు- జన్మజన్మలకూ నీకు ఋణపడి ఉంటాను.”

“యెర్రిబాగులదానా? ఇట్టాంటి గొడవల్లో ఒకరి నొకరు రుణపడేదేంటే! మరోసారి ఆలోచించుకో! నా చెల్లెలాంటి దానివి- నా మాటివి ఆ మాస్టారికాడికిపో! చివరి మాట సెప్తున్నా!”

మరొకసారి చెప్పి చూసాడు జగన్. రాణి ఏదీ వినిపించుకొనే స్థితిలో లేదు- దుశ్శాసనుడి రక్తంతో తడిపి కాని జుట్టు ముడివేసుకోనని శపథంచేసిన ద్రౌపదిలా ఉంది. బలికోరి భీకరంగా గర్జించే భద్రకాళిలాగ ఉంది.

“అట్లయితే నాతోరా?” అన్నాడు విధిలేక జగన్- విడిపోయిన జుట్టు పిచ్చిగా ముడేసుకుని, చీర సర్దుకుని ఉన్నది ఉన్నట్లుగా జగన్‌వెంట బయలుదేరింది రాణి.

ఆ రోజే రాణిని హైదరాబాదుకి తీసికెళ్ళాడు తనతో జగన్- తిన్నగా ఒక ఇంటిముందు ఆటో తిగి కాలింగ్ బెల్ నొక్కాడు- తలుపు తెరుచుకుంది. తెరిచింది యాభై ఏళ్ళ వయసున్న ఒక పనిమనిషి- జగన్‌ని చూసి లోపలికి రానిచ్చింది- మళ్ళీ తలుపు వేసింది.

*With Best compliments from :-*

INDIA BLOCK MAKERS

**VIJAYAWADA — 520 003**

**Phone : 72275**




ఆ ఇల్లు గొప్పవాళ్ళ ఇల్లులాగ చాలా దర్జాగా ఉంది. ఖరీదైన సోఫాసెట్- గది మధ్యగా మెత్తని కార్పెట్ చక్కగా ఆర్టిస్టిక్‌గా సర్దిన బొమ్మలున్న షోకేసు.... రాణి చుట్టూ చూస్తూ నిలబడింది. మనసు బండబారిపోయింది. ఏదీ చప్పున గ్రహించటంలేదు. ఈలోగా లోపల్నించి ఒకావిడ వచ్చింది. సన్నగా, నాజూగ్గా ఉంది. జడ అల్లుకో లేదు కానీ, జుట్టు విరబోసుకున్నట్లుగా ఉంది. ఏవో క్లిప్స్ పెట్టి లూజుగా వదిలేసింది. జుట్టు యూనిఫాంగా కత్తిరించి ఉంది. దగ్గిరగా వస్తేకాని నలభైకి పైగా వయసుంటుందని ఎవరూ గుర్తించలేరు.

"ఏం జగన్నా!" అంటూనే రాణివైపు ఒక చూపు విసిరింది పరిశీలనగా. ఆవిడ తెలుగులో మాట్లాడేవరకు తెలుగు మనిషి అనుకోలేదు రాణి- అచ్చు పంజాబీలా ఉంది.

"నమస్తే మేడమ్!" అతి వినయంగా మాట్లాడుతున్నాడు జగన్.

"హైక్లాసు మనిషి మేడమ్? ఇక్కడకు రావలసింది కాదు-"

"ఈ అమ్మాయా?"

అప్పటి రాణి ఉన్న పరిస్థితినిబట్టి నిరసనగా అంది. రాణి వెంటనే ఉద్రేకంగా తనకు జరిగిన అవమానమూ, అందుకు ప్రతీకారం తీర్చుకోవాలనుకోవటమూ- ఆ ఉద్దేశంతోనే ఇక్కడకు రావటమూ- ఇంగ్లీష్‌లో చెప్పింది గబగబ.

ఆవిడ ఆశ్చర్యంగా వింది- కళ్ళలో సానుభూతి కదిలింది. చిన్నగా నిట్టూర్పుకూడా వదిలింది.

"నాయకుడిమీద ప్రతీకారమా? కొంచెం కష్టమే! చూద్దాం! కానీ ఇది క్షణాలలో జరగదు- నెమ్మదిగా ప్లాన్డ్‌గా జరగాలి- ఈలోగా నువ్వు ఈ పద్ధతులకు బాగా అలవాటుపడాలి!"

"ఏమైనా చేస్తాను-" అదే కసి రాణిగొంతులో.

ఆవిడ నవ్వింది.

"ఇక్కడి జీవితం అంటే నీకు సరిగా తెలిసినట్లు లేదు. సినిమాలలో వేశ్యలను చూపిస్తారు, చూడూ- ఏడుస్తూ, మధనపడుతూ విటులదగ్గర కెళ్ళినట్లు.... అలా అనుకొంటే నీ అంత మూర్ఖులుండరు. సినిమాలలో ఆ వేశ్యపాత్రమీద సానుభూతి కలగాలని ఏడుస్తూ వెళ్ళినట్టు చూపిస్తారు కాని, నిజజీవితంలో ఏ వేశ్యా అలా వెళ్ళదు. అలా వెళ్తే ఆ వేశ్యలంత అందంగా ఉన్నా ఏ రసికుడూ కోరుకోడు- కథల్లో చెప్పేదానికీ, సినిమాలలో చూపించేదానికీ- నిజజీవితానికీ బోలెడు తేడా ఉంది. ఇదంతా ఒక కళ- ఎవరి ప్రతిభనుబట్టి వారు పైపైకిపోతారు-"

రాణికి ఏమీ అర్థంకాలేదు. అర్థంచేసుకొనే స్థితిలోలేదు. ఆ పిల్ల మనసు- పాతికేళ్ళయినా నిండకుండానే ఆ జీవితం ఇంత విచిత్రంగా మారిపోయింది.

ఆవిడ- ఆవిడపేరు- కాదు- పేర్లు- చాలా ఉన్నాయి. ఒక్కో సందర్భంలో ఒక్కో పేరు ఉపయోగించుకొంటుంది. ప్రస్తుతం ఆ ఇంట్లో ఆవిడపేరు రేఖాముఖర్జీ. ఆవిడ రాణిని తనతో లోపలికి తీసికెళ్తూ "జగన్! నీ కమీషన్ తర్వాత ఇస్తాను, రాబడిబట్టి- ఈ పిల్ల చాకచక్యంబట్టి...." అంది. జగన్ చేతులు జోడించి "ఈ ఒక్కసారి నేను కమీషన్ కోసం ఆశపడటంలేదమ్మా! అమ్మాయిని కాస్త కనిపెట్టి ఉండండి- అది చాలు!" అన్నాడు- మిసెస్ ముఖర్జీ ఆశ్చర్యంగా చూసి నవ్వి, "నువ్వు చాలా మంచివాడివి జగన్! కానీ, నేను ఇంతవరకు ఏ అమ్మాయినయినా ఇబ్బందిపెట్టినట్లుగా విన్నావా?" అంది.

"లేదమ్మా! ఎందరికో ఆశ్రయం కల్పించి ఒక దారి చూపించారు. అందుకే ఈ అమ్మాయిని ఇంత భరోసాతో ఇక్కడికి తీసుకొచ్చాను...." అని రెండుచేతులూ జోడించి, "వెళ్ళొస్తాను- అప్పుడప్పుడు కనపడతాను-" అని వెళ్ళిపోయాడు.

రేఖాముఖర్జీ ఇద్దరమ్మాయిలకు సైగచేసింది. వాళ్ళిద్దరూ రాణిని లోపలి గదిలోకి తీసికెళ్ళారు- ఏదో తైలం ఉపయోగించి, శరీరమంతా మాలీష్‌చేసి తలంటుపోసారు. చక్కని ఎంబ్రాయిడరీ పూలున్న పంజాబీడ్రెస్ కట్టుకోమన్నారు. జుట్టు సగానికి కత్తిరించేసి, రేఖాముఖర్జీలాగే జుట్టు క్లిప్స్‌తో అలా వదిలేసి హెయిర్‌స్టయిల్ నేర్పారు. ఆ తర్వాత పౌడర్‌బేస్‌గా క్రీమ్స్ ఎలా ఉపయోగించాలో- వేసుకున్న బట్టలనుబట్టి ఆ సందర్భాలనుబట్టి "ఐషేడ్స్" ఎలా ఉపయోగించాలో నేర్పారు. అలా అలంకరించుకొని అద్దంలో తనను తను చూసుకొని రాణి ఆశ్చర్యపోయింది. ఆ ప్రతిబింబం తనేనా అని- ముఖాన బొట్టులేకపోవటం అలవాటుకొద్దీ ఒక లోపంగా తోచింది కానీ, కొంచెం ఆలోచించాక, బొట్టు లేకపోవటమే న్యాయమనిపించింది. అలా తయారయి వచ్చిన రాణిని చూసి రేఖాముఖర్జీ ముగ్ధురాలయింది "యు ఆర్ స్వీట్!" అంది.

"థాంక్యూ!"

నవ్వింది మిసెస్ ముఖర్జీ.

"నీ పేరు?"

"మల్లి.... మల్లిక...."

"ఇక ఆ పేరు వద్దు- ఇవాళనుంచీ నీ పేరు రాణి-"

"ఓ.కె. నా పేరు రాణి-"

రాణి గొంతులో, ముఖంలో విషాదం పూర్తిగా పోలేదు. కానీ కొంచెం ఉత్సాహం వచ్చింది. పట్టుదల- కసి ఎప్పటికప్పుడు కొత్తవూపిరి పోస్తున్నాయి.



ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు

ఆధారపడునవి

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో

లోధ్ర

*

గర్భపోషణకు, సుఖ ప్రసవమునకు

గర్భ రక్షక

*

వేవిళ్ళకు, మలబద్ధకమునకు

మాదీఫలరసాయనం

*

ప్రసవానంతర బలమునకు, క్షీరవృద్ధికి

సౌభాగ్య శొంఠి

*

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

మద్రాసు - 600 014.

ఏజెంట్లు:

సీతారామ జనరల్ స్టోర్స్ (ఏజన్సీస్)

విజయవాడ - సికిందరాబాద్

"వెళ్ళి భోజనంచేసి ఇవాళ్టికి విశ్రాంతి తీసుకో! తరువాత ఏంచేయాలో ఆలోచిద్దాం!"

"మేడమ్! నాకు డబ్బు అక్కర్లేదు- సుఖాలక్కర్లేదు. భోగాలక్కర్లేదు- ఆ నాయకుని-"

పళ్ళు పటపట లాడించింది రాణి.

రేఖాముఖర్జీ కొద్దిగా కనుబొమలు చిట్లించి "నువ్విలా ఆవేశపడిపోతే ఏమీ సాధించలేవు- నీ ఆశయం నాకు తెలిసిందిగాని, దానికి తగిన ప్లాన్ ఆలోచిస్తాను. ఇవన్నీ చాలా నెమ్మదిగా జరగవలసిన పనులు. రెండు మూడేళ్ళలో జరిగినా, ఈ రోజు జరిగినట్లే!"

"రెండుమూడేళ్ళా .... ?" నీరసపడిపోసాగింది రాణి.

"లేకపోతే రేపే వెళ్ళి వాడిని కత్తితో పొడిచి వస్తావా? నువ్వందుకు తెగించినా, అది నీకు సాధ్యం కాదు. వాడికి బాడీగార్డ్స్ ఉంటారు- అసలు నువ్వు వాడిని సమీపించలేవు- చావుకంటె దారుణంగా వాడిని శిక్షించొచ్చు- ఈ సమాజానికి దాని భాషలోనే దానికి పాఠాలు నేర్పించొచ్చు. నీకు సహనం కావాలి. నీకు మొదటనే చెప్పినట్లు ఇదంతా ఆర్ట్- ఆర్ట్‌కి ఏ రంగంలోనయినా సరే ప్రధానంగా కావలసింది టేలెంట్- అది మూడొంతులు సహజంగా రావలసిందే! నాలుగోవంతు మాత్రమే నేర్చుకొనేది. సముద్రంలో పడితే ఈత అదే వస్తుంది. అన్నీ నీకే తెలుస్తాయి-ముందు భోజనం చేసి విశ్రాంతి తీసుకో?"

రాణి ఆలోచిస్తూ డైనింగ్‌హాల్‌లోకి వెళ్ళింది. అక్కడ రకరకాల వయసులలో- రకరకాల అలంకరణలలో చాలామంది ఆడవాళ్ళున్నారు. భోజనం చాలా రుచిగా ఉంది. నిజానికి రాణి అలాంటి ఆహారం అంతకు ముందెప్పుడూ తినలేదు. ఆడపిల్లలంతా ఏవేవో జోక్స్ వేసుకొంటూ రకరకాల కబుర్లుచెప్పుకొంటూ నవ్వుకుంటున్నారు. కథల్లో లాగ అక్కడికి ఆడవాళ్ళెవరూ బలవంతాన తీసుకురాబడలేదు. వాళ్ళు పారిపోకుండా ఘూర్ఖాలు కానీ, వాళ్ళను చావబాది లొంగదీసుకునే గూండాలు కానీ ఎవరూ లేరు. కేవలం ఇంటికి రక్షణగా గేటుముందు ఒక ఘూర్ఖా ఉన్నాడంతే. అక్కడి ఆడవాళ్ళంతా జీవితంలో రకరకాలుగా దెబ్బలుతిని తమంత తాము అక్కడికి వచ్చినవాళ్ళు- పెళ్ళికానివాళ్ళూ ఉద్యోగం దొరకనివాళ్ళూ- మొగుడు వదిలేసినవాళ్ళూ-ఇంట్లో దారుణంగా బాధలు పెడ్తుంటే అవి భరించలేక పారిపోయిన వాళ్ళు-ఇలా రకరకలుగా ఉన్నారు. వాళ్ళంతా వ్యభిచార వృత్తిలో ఉన్నవాళ్ళు కారు- రేఖాముఖర్జీ ఎవర్నీ దేనికీ నిర్బంధించదు. ఆవిడ ఒక బ్యూటీ క్లినిక్, ఒక మహిళా సేవా సంస్థ, ఒక అనాధ శరణాలయం నడుపుతోంది. అక్కడి ఆడవాళ్ళని వాళ్ళ వయసులను బట్టి- వాళ్ళ అందాలను బట్టి- వాళ్ళ స్వభావాలను బట్టి- తదానుకూలంగా వినియోగించుకుంటుంది. వాళ్ళు ఎప్పుడు వెళ్ళిపోవాలనుకున్నా వెళ్ళిపోవచ్చు- కానీ వాళ్ళలో ఎవరూ వెళ్ళిపోవటానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు.

భోజనాలయ్యాక అందరూ నైట్‌గౌన్లు తొడుక్కొని నిద్రపోయారు- ఎవరి మంచాలు వాళ్ళకున్నాయి- కానీ అందరికీ ఒకటే విశాలమైన హాలు. మంచంమీద పడుకున్నాక అప్పుడు నారాయణ్ మాస్టారు గుర్తొచ్చారు రాణికి- ఒక్క కన్నీటి బొట్టు జారి దిండును తడిపింది. అంతే! మనసు ఎంత సున్నితమయినదయినా యంత్రంలాంటి శరీరం మనసుని అవలీలగా జయిస్తుంది. విపరీతంగా అలిసిపోయిన శరీరం నిద్రలోకి జారిపోయింది.

## 6

రాణి బ్యూటీక్లినిక్‌లో ఫేషియల్స్ చెయ్యటంలో ట్రెయినింగ్ అయింది. "ఫేషియల్స్" ఎలా చెయ్యాలో రేఖాముఖర్జీ రాణికి ట్రెయినింగ్ ఇస్తున్నప్పుడు రాణి కొంత అసహనంగా "మేడమ్, నాకు...." అని ఏదో అనబోతుంటే రేఖాముఖర్జీ చాలా తీవ్రంగా అడ్డుతగిలింది.

"నిన్ను తొందరపడొద్దన్నాను- మళ్ళీ మళ్ళీ హెచ్చరిస్తున్నాను. తొందర ఎంతమాత్రం పనికి రాదు. నిన్నిక్కడ ఉంచేది ఎందుకనుకున్నావ్? ఇక్కడికి వచ్చేవాళ్ళంతా రాజకీయాల్లో తిరిగేవాళ్ళే! వాళ్ళతో పరిచయాలు పెంచుకో! వాళ్ళని మాటల్లో దింపు- వాళ్ళు ఎలా మాట్లాడుతారో గమనించు. ముందు ఇవన్నీ తెలుసుకోవాలి నువ్వు...."

రాణి మళ్ళీ మాట్లాడలేదు- రాజకీయాల్లో తిరిగే ఆడవాళ్ళు ఫేషియల్స్‌కి ఎందుకొస్తారో అప్పట్లో రాణికి అర్థం కాకపోయినా, అతి త్వరలో అర్థమయిపోయింది. రేఖా ముఖర్జీ చెప్పినట్లు జీవితంలో ప్రతీది ఒక ఆర్ట్- ఫేషియల్స్ చెయ్యటం కూడా ఆర్టే! ఫేషియల్స్‌కి సాధారణంగా నలభై-యాభై మధ్యవయసుల్లో వాళ్ళు వస్తారు. కొన్నిసార్లు యాభై పైబడిన వాళ్ళూ వస్తారు.

ఎవరితోనయినా అలవాటుగా మాట్లాడే మాటలు- మాట్లాడవలసిన మాటలు రాణికి బాగా వచ్చాయి.

"అరె! మీ వయసు నలభై అయిదా? ఐ కాంట్ బిలీవ్ ఇట్! మీరు ముప్ఫైలా కనిపిస్తున్నారు!"

"థాంక్యూ!" మురిపం కనిపిస్తుంది అవతలివాళ్ళ ముఖంలో- రాణి లోలోపల నవ్వుకొంటూ ఉంటుంది.

'నలభై అయిదు కాదు- యాభై అయిదులా కనిపిస్తున్నావు నువ్వు-' అని లోలోపల అనుకుంటుంది.

నా ముఖంలో- మెడలదగ్గిరా మరీ ముడతలు కనిపిస్తున్నాయా?" ఆవిడ అద్దంముందు నిలబడి అటూ ఇటూ తిరిగి అన్ని కోణాలలోంచీ తనను తను చూచుకొంటూ అడుగుతుంది-

"ఛ! ముడతలా? ఎక్కడున్నాయి? అసలు ముడతలే లేవు. కానీ, ఈ వయసులో ఫేషియల్స్ చేయించుకొంటేనే మంచిది. ముందు ముందు ముడతలు రాకుండా ఉంటాయి."

"థేంక్యూ!"

ఈ సంభాషణ ఇంచుమించు అందరితోనూ, ఇలాగే జరుగుతుంది. ఈ నాటకం రాణికి బాగా అలవాటయిపోయిందికూడా- ఫేషియల్స్‌వల్ల ముడతలు పోయినా పోకపోయినా, ఒకవిధమయిన నేక్‌తో ముఖాన్ని మర్దనచేస్తోంటే, కస్టమర్స్‌కి హాయిని కలిగించొచ్చు.... అది ఎలా కలిగించాలో చాలా జాగ్రత్తగా నేర్పిస్తుంది రేఖాముఖర్జీ.... చాలామంది ఆ కొంతసేపూ ఆ హాయిని పొందటానికే వస్తారు. నిజానికి ఫేషియల్స్‌వల్ల తాత్కాలికంగా కొంత నునుపు వచ్చిన ముడతలు పూర్తిగా పోవటం అసంభవం-అంతేకాక, ఇలాంటి కృత్రిమమయిన విధానాలకు ఒకసారి అలవాటుపడితే ఎప్పుడూ అవి వాడుతూ ఉండవలసిందే! లేకపోతే మొదట్లోనే ఉన్నప్పటికంటె భయంకరంగా ఉంటారు.

అయితే ఇలాంటి బ్యూటీక్లినిక్స్‌కి వచ్చేవాళ్ళు సాధారణంగా బాగా డబ్బున్నవాళ్ళయి ఉంటారు- రేఖాముఖర్జీ చెప్పినట్లు రాజకీయాలలో తిరిగే ఆడవాళ్ళే ఎక్కువగా వస్తారు. వాళ్ళు సాయంత్రం మీటింగ్ ఉందనగా మధ్యాహ్నంనుంచీ తయారవుతారు- ముఖంతో మొదలుపెట్టి, పాదాలూ, చేతులూ, చేతులమీద వెంట్రుకలు, చేతిగోళ్ళూ, కాలిగోళ్ళూ- అన్నీ ఒక్కొక్కటీ ప్రత్యేకించి అలంకరించుకొంటారు. అన్నింటికీ వేరు వేరు ఛార్జీలుంటాయి- డబ్బు తీసుకున్నా- హుషారుగా కబుర్లుచెప్తూ- నవ్వుతూ నవ్విస్తూ- వాళ్ళ అందాన్ని పొగుడుతూ ఆలంకరణ తతంగం పూర్తిచేస్తారు- అప్పుడా అలంకరణ చెక్కుచెదరకుండా కారుల్లో కూర్చుని వెళ్ళిపోతారు- ఒకసారి నడివయసు మనిషి, అలంకరణ చేయించుకొంటూ "కమలాక్షి కూడా ఇక్కడికొచ్చిందా?" అని అడిగింది. ఆ ప్రశ్నలో బోలెడు అసహనం ఉంది. రాణి సమాధానం చెప్పబోయేటంతలో అక్కడ శరీరానికంతకూ మాసేజ్‌చేసే రమణి కల్పించుకుని "లేదండీ! రాలేదు-" అంది. ఆవిడ వెళ్ళిపోయాక రాణి ఆశ్చర్యంగా రమణిని "అలా అబద్ధం ఎందుకు చెప్పావ్? కమలాక్షి వచ్చింది కదా?" అంది. రమణి నవ్వి "నీకింకా ఈ లోకంలో సంగతులు వంటబట్టినట్లులేదు- ఇప్పుడొచ్చినావిడ ఏదో

*With Best Compliments from*

**UNI-SANKYO LIMITED**

**Manufacturers of Quality Bulk Drugs**

*in Collaboration with*

**SANKYO COMPANY LIMITED, JAPAN**

*Factory :* Gaganpahad, Hyderabad-West. Andhra Pradesh

*Office :* 5-9-24/81, Shapurwadi, Hyderabad - 500 483 A.P.

సంస్థకి ఛైర్మన్- ఆ కమలాక్షి మరో దానికి డైరెక్టర్. వాళ్ళిద్దరూ ప్రస్తుతం నాయకుడిగారి కటాక్షవీక్షణాలకోసం ఒకరితో ఒకరు పోటీపడుతున్నారు. ఆవిడొచ్చినట్లు తెలిస్తే ఈవిడ ఏడుస్తుంది. ఇద్దరూ వస్తారని ఇద్దరికీ తెలుసు- ఇద్దరికిద్దరూ "బ్యూటీ క్లినిక్" పేరే విననట్లు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటారు- అదంతా తమ సహజ సౌందర్యమయినట్లు పోజు పెట్టుకుంటారు, ఒకరిముందొకరు. ఇంతకూ నాయకుడుగారి శృంగార వీక్షణం ఈ వృద్ధ విలాసినులలో ఎవరు గెల్చుకుంటారో చూడాలి!" అంది.

నిర్ఘాంతపోయిన రాణి అంతలో తేరుకుని పకపక నవ్వింది. ఆపుకోలేకుండా నవ్వింది. రమణి "ఏయ్! ఏయ్! ఏమిటా నవ్వు? ఎవరైనా వింటారు-" అని వారిస్తున్నా ఆపుకోలేకపోయింది. రమణి వారిని "వృద్ధ విలాసినులు" అనే పదమే రాణికి చాలా గమ్మత్తుగా- సరదాగా ఉంది. ఎంతోసేపటికి నవ్వు ఆపుకుని "ఆ నాయకుడిగారి శృంగార వీక్షణంకోసం వీళ్ళెందుకింత తాపత్రయపడటం?" అంది.

"ఏవో బోలెడన్ని రాజకీయాలు! ఇంకా పైపదవుల కోసమో మరి దేనికో, ఆ వివరాలన్నీ నాకు తెలీవు."

రాణి ఆలోచిస్తూ కూచుండిపోయింది. ఇదా సమాజం! ఈ సమాజం ఇలాంటిదనీ, దానిలో ఇలాంటివి జరుగుతున్నాయనీ అందరికీ తెలుసు! కానీ, సమాజం వీళ్ళనేమీ అనదు. వీళ్ళంతా ఏంచేసినా, మాయజలతారు మేలిముసుగులు వేసుకున్నంతవరకూ సమాజం వీళ్ళజోలికిపోదు. మాయ జలతారు తళతళలు చూసి నోరుమూసుకుంటుంది. నోరు మూసుకోవటమేకాదు- మెప్పుదలగా తలలాడిస్తుంది. అయ్యో! సమాజం నిజస్వరూపం ఇలా పురుగులతో లుకలుకలాడిపోతూ ఉంటే, కథలలోనూ, సినిమాలలోనూ దాన్ని పూర్తిగా మరోరకంగా చూపిస్తారే? ఆడది విధిలేక వేశ్య అయినట్లు- తన పరిస్థితికి కుమిలిపోతూ కన్నీళ్ళు కారుస్తూ విటులదగ్గరికి వెళ్ళినట్లు- సమాజం వీళ్ళని చాలా అవమానకరంగా చూస్తున్నట్లూ ...

అవును! అది అబద్ధం కాదు- సమాజం అవమానకరంగానే చూస్తుంది! ఎవరినీ? తనలాంటివాళ్ళని! అంతే, రాణిలాంటి వాళ్ళని కాదు! మల్లిలాంటి వాళ్ళని!

ఈ కమలాక్షులూ, వామాక్షులూ డబ్బులేక- డబ్బుకోసం వ్యభిచరించటంలేదు- వాళ్ళకు పదవులున్నాయి. ఆస్తులున్నాయి. కారులున్నాయి. పోనీ, ప్రేమించి అసలుకాదు- ఆ నాయకుడి ఆకారాన్ని చూసి.... ఆయనను ఎవరైనా ప్రేమించగలరని అనుమానించటానికి కూడా ఆస్కారం లేదు. వీళ్ళలో ఎవరూ తప్పుచేసామని కుమిలిపోవటంలేదు-

*With Best compliments from :*

**BATCHU LINGIAH & SONS**

**PAPER MERCHANTS**

GENERAL BAZAR, SECUNDERABAD - 500 003.

Grams : "NEWSPRINT"    Phone : 72997

ఎదురు తామేదో మిగిలినవాళ్ళకంటే అధికులైనట్లు సగర్వంగా తిరుగుతున్నారు. సమాజం వీళ్ళను చిన్నబుచ్చటంలేదు.... అవమానించటంలేదు- పూలమాలలు వేస్తోంది- సన్మాన పత్రాలు చదువుతోంది- సత్కారాలు చేస్తోంది. ఈ సమాజాన్ని- దీని నిజస్వరూపాన్ని నగ్నంగా ఎవరూ బయట పెట్టలేరు భయమేసా ?, ఆ చేదునిజాలు భరించలేకా ? అందరికీ, అతి స్పష్టంగా తెలిసిన ఈ నిజాలన్నీ గొంతుకడ్డు పడుతున్నా- వాటిని బలవంతాన మింగి అర్థంపర్థంలేని శీలం-పాతివ్రత్యం మొదలైన కాల్పనిక సెంటిమెంట్లతో కృత్రిమ లోకాలు సృష్టించుకొంటున్నారా ? అసలే మండుతున్న రాణి మనసు ఈ లోకాన్ని చూస్తున్నకొద్దీ, మరింత రగిలిపో సాగింది.

ఏలా అయితేనేం, రాణి ఎదురుచూస్తున్న అవకాశం వచ్చింది. రేఖాముఖర్జీ రాణి ఎలా ప్రవర్తించాలో అంతా బోధపరిచింది. ఆరోజు మహిళా సేవాసంస్థ వార్షికోత్సవం- అక్కడ రేఖాముఖర్జీసావిత్రమ్మగా అవతారమెత్తింది. చక్కని కంచిపట్టుచీర-అందంగా వేసుకున్న ముడి-ఇంత మాత్రమే అలంకరణలో మార్పు- మనిషి మాత్రం ఎప్పటిలాగే నాజూగ్గా చూడటానికి ముప్పైయి యేళ్ళ దానిలా చకచక తిరుగుతూ అన్ని పనులూ చూస్తోంది- ఆ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా జగన్నాధాన్ని ఆహ్వానించింది జగన్నాధం మంత్రి కాదు-కానీ, ప్రముఖ వ్యాపారస్థుడు- అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రంలోను అధికార అనధికార్లందరిలోను పలుకుబడి ఉంది-అతడికి స్మగుల్డ్ వ్యాపారం ఉందనీ, అతడు నడుపుతున్న తివాసీ పరిశ్రమ అతడి స్మగుల్డ్ వ్యాపారానికి కవర్ మాత్రమేనని రూమర్స్ ఉన్నాయి. ఏది ఏమయినా అతడినందరూ గౌరవిస్తారు-కవులు పోటీలుపడుతూ అతడిపైన గేయాలువ్రాస్తారు - ప్రతి ఫంక్షన్‌కి అతడిని ముఖ్య అతిథిగా పిలవాలని అతడి ఇంటి ముందు పడిగాపులు పడతారు. అతడు మాట్లాడేది ఏదీ లేక పోయినా రాణి ఏంచేయాలో ఎలా నడుచుకోవాలో బోధించి, ఆ ఫంక్షన్‌లో జగన్నాధానికి రాణిచేతే మెడలో మాల వేయించింది-జనం చప్పట్లు కొట్టారు-జగన్నాధం పరవశించాడు. ఫంక్షన్‌లో రాణి ఇంగ్లీష్‌లో మాట్లాడింది. రాణికి తెలుగురాదని చెప్పింది సావిత్రమ్మ-"అవసరమయితే కొత్త. కొత్త తడుముకుంటూ మాట్లాడుతుంది" అనికూడా చెప్పింది. ఫంక్షన్ అయ్యాక రాణిని పరిచయం చేసింది.

"ఈ అమ్మాయి మిస్ రాణీ సన్యాల్- వాళ్ళ నాన్నగారు బెంగుళూర్‌లో డాక్టర్-తల్లి ఇటీవలే లండన్ వెళ్లారు, సైన్స్ అసోసియేషన్ ఆహ్వానంమీద-ఈ అమ్మాయి హాస్టల్‌లో

*Deepavali Greetings*
*to our*
*Valued Clients & Well Wishers*

**GOLDEN PRESS**
**Gowliguda, Hyderabad. Phone : 52521**

*Specialists in*
Carton Printing, Box Making, Varnishing and
Quality Letter Press & Offset Printers.

ఉండి వుమెన్స్ కాలేజీలో బి.ఎస్‌సి. చదువుతోంది-వాలంటరీగా వచ్చి మా సంస్థలో పనిచేస్తూ ఉంటుంది. ఈ అమ్మాయికి సంఘసేవ అంటే ఇష్టం-"

"వెరీగుడ్! ఇలాంటి యువతీ లోకమంతా ఇలా సంఘసేవకు పూనుకొంటే మహిళలకు సమస్యలనేవే ఉండవు-" ఉపన్యాసం ఇస్తున్న ధోరణిలో అన్నాడు జగన్నాధం.

స్టయిల్‌గా తల ఒక పక్కకువంచి, గొంతు ప్రత్యేకించి మరికాస్త సన్నగా చేసి "థాంక్యూ సర్!" అంది రాణి. జగన్నాధం కళ్ళముందు కోటిమెరుపులు ఒక్కసారిగా మెరిసాయి. ఒక్క గుటక మింగాడు-

ఆ మరునాడే రాణి జగన్నాధం ఇంటికి వెళ్ళింది, రేఖా ముఖర్జీ కారులో-అతడి ఇంటికి బస్సులో కానీ, ఆటోలో కానీ వెళ్ళకూడదని మరీ మరీ చెప్పింది, రేఖాముఖర్జీ. ఆఫీస్ రూంలో ఉన్నాడు జగన్నాధం. గుమ్మం దగ్గిర నిలబడ్డ ప్యూనికి తనపేరు కాగితంమీద వ్రాసి పంపించింది-జగన్నాధం వెంటనే బయటకొచ్చి "ఓ! మీరా? రండి! రండి!" అని గంపంత ముఖంతో రాణిని ప్రత్యేకించి తన ప్రైవేట్ రూంలోకి తీసికెళ్ళాడు.

"సారీ సర్! నేను....వచ్చి మీ వర్క్ అంతా పాడు పాడు ఓ సారీ!...." తెలుగు వచ్చీరానట్లు తడుముకుంటూ చాలా ముద్దుముద్దుగా అంది.

"ఏం ఫరవాలేదు రండి! కూచోండి! వాళ్ళు వెయిట్ చేస్తారులెండి. ఏం తీసుకుంటారు? కాఫీయా? టీయా? ఓవల్టీనా?"

"మా మమ్మీ ఆల్‌వేస్ ఓవల్టీన్ తాగమని ఫోర్స్‌చేస్తుంది. నాకు బోర్. నాకు కాఫీ ఇష్టం"

నౌకరుతో రెండు కాఫీలు తెప్పించి, ఒక కప్పు తనే స్వయంగా రాణికి అందించాడు. అలా అందిస్తున్నప్పుడు కావాలని చేతులు తగిలేలాగ అందుకుంది రాణి.

"సార్! మా సంస్థకి మీరు డొనేట్ చెయ్యాలి సార్. అందుకే వచ్చాను"

జగన్నాధం ముఖం కొద్దిగా ముడుచుకొంది కానీ బీరువాలోంచి చెక్‌బుక్ తెచ్చాడు.

"సార్! మరీ ఎక్కువ అమౌంట్ వేయకండి. మీకు చాలా ఆబ్లిగేషన్స్ ఉంటాయి. అయ్ నో దట్. జస్ట్ త్రీథౌజండ్ వేయండి చాలు. మా డాడీ ఫోర్ వేశారు. మీరు అంతే వేస్తారా? పోనీ మీయిష్టం. ఇటీజ్ లెఫ్ట్ టుయు సర్."

నాలుగువేలు! జగన్నాధానికి కలం కదలడంలేదు. గమనించింది రాణి-


Our Deepavali Greetings to you all

for Processing of Your Newsprint Allocations
Highseas / Buffer Stocks

***Contact :***

**SRI SRINIVASA PAPER CONVERTERS**

**Paper Converters & Authorised Agents by :**
**R.N.I., New Delhi**

6, Murugesa Mudali Street, Madras-600001 Phone : 21520

PROMPT & EFFICIENT SERVICES OFFERED

"సార్! మీ నేం ఆ బిల్డింగ్ వాల్‌మీద చెక్కిస్తారు- మనీ ఎలా అయినా స్పెండ్ చేస్తాం-మీ నేమ్ అలా ఉండి పోతుంది. ఫర్ యెవర్....మనం ఊటీ ట్రావెల్ చేస్తే ఆ మాత్రం ఖర్చుకాదా సర్!"

"మనం ఊటీ" .... ఆ మాటలు గంధర్వగానంలా సోకాయి జగన్నాధం చెవులకి

"మనం ఊటీ వెళ్దామా! అక్కడ నాకొక కాటేజ్ ఉంది. ఆఫ్‌కోర్స్, నీకు ఊటీ చూడాలని ఉంటేనే...." కాస్త భయపడుతూ అన్నాడు.

"ఓ! అయ్ లవిట్ సర్! బట్ డాడీ ఈ సెలవుల్లో బెంగుళూర్ రమ్మని రాసారే!"

"అయితే రాలేవా?

"నోసర్! ఈ ఛాన్స్ మిస్‌చెయ్యలేను. ఒకపని చేద్దాం సర్. హాలీడేస్‌కి ముందే కాలేజీ డుమ్మాకొట్టి పోదాం! హాలీడేస్‌లో డాడీ దగ్గరకి పోతాను- లేకపోతే డాడీ నన్ను మిస్ చేస్తాడు." గారాలుపోతూ అంది. మతిపోయింది జగన్నాధానికి.

"ఓయస్ టికట్స్ ఎప్పటికి రిజర్వు చేయించను?

"మీయిష్టం సర్! ఈ మన్తెండ్‌లోగా ఎప్పుడైనా సరే సర్! అరేంజ్‌మెంట్స్ చేశాక సావిత్రమ్మకి ఫోన్ చేసి చెప్పండి సార్. ఆవిడ కైండ్ లేడీ! మావార్డెన్ ఒక డెవిల్-మా డాడీకి రిపోర్ట్ చేసిందంటే...."

"ఆల్‌రైట్! ఆల్‌రైట్ రేపే సావిత్రమ్మకు ఫోన్ చేస్తాను నువ్వు అక్కడికి వస్తావుగా!"

రోజూ వస్తానుసార్! సోషల్ సర్వీస్ లేకుండా నాకు తోచదు-"

నవ్వాడు జగన్నాథం. నాయకులు ప్రజాసేవ గుర్తొచ్చింది. తోలు-

"నేను వెళ్తాను సార్! బై!"

"బై! బై!"

సంతోషంతో గాలిలో తేలిపోతూ కారులో కూచుంది రాణి. తన ధ్యేయం త్వరలో నెరవేరబోతోంది. తనలాంటి పెద్దింటి పిల్ల ఇలా ఊటీ రావటానికి ఒప్పుకోవటంలో జగన్నాధానికి ఏదైనా సందేహం రావచ్చేమో అనుకొంది. మొదట ఆమాట రేఖాముఖర్జీకి చెపితే "పిచ్చి పిల్లా! మన బ్యూటీక్లినిక్‌కు వచ్చే పెద్దింటి పెద్ద పెద్ద ఆడవాళ్ళను చూసినా ఇంకా నీకిలాంటి సందేహాలు వస్తున్నాయా" అని నవ్వేసరికి ఆ సందేహం తీరిపోయింది. "పెద్దింటివాళ్ళకే ఇలా అవకాశాలుంటాయి" అని ఆవిడ మళ్ళీ నవ్వింది

నాలుగువేలు డొనేషన్ సంపాదించినందుకు ఆవిడ


— OUR TOWNS BEST SCHOOL'S —

విద్యా సాంస్కృతిక, సాహిత్య కళారంగములలో ఘనవిజయం సాధించి యావదాంధ్ర ఖ్యాతి గాంచి 2000 మంది గొప్ప క్రమశిక్షణతో మాజీ సైనికోద్యోగులచే నడుపబడుచున్న ఏకైక విద్యా సంస్థ

**Estd. 1963**

## టాగూరు కాన్వెంటు హైస్కూలు

గాంధీనగరం - కాకినాడ

(ప్రభుత్వము వారిచే ఆమోదింపబడినది)

**తెలుగుమీడియం నర్సరీ 1 నుండి 10 వ తరగతి వరకు**

## టాగూరు కాన్వెంటు ఇంగ్లీషు హైస్కూలు

గాంధీనగరం - కాకినాడ

**నర్సరీ 1 నుండి 10 వ తరగతి వరకు**

మీ పిల్లల విద్య నిమిత్తమై పనిచేయు ఉపాధ్యాయ బృందంకాక అదనపు ఉద్యోగస్తులు మీ పిల్లల క్రమశిక్షణ ఆరోగ్య రక్షణ నిమిత్తం మాజీ పోలీసు రెవిన్యూ, విద్య, ఆరోగ్య శాఖలకు చెందినవారు పనిచేయుచున్నారు. బాలబాలికలకు మంచి హాస్టలు వసతులు గలవు.

*'Only one of its kind in this town' 'Mile stones of Progress'*

Published by : TAGORE EDUCATIONAL SOCIETY (Regd.)

రాణిని చాలా మెచ్చుకొంది. నాలుగొందలు రాణికి కమిషన్‌గా ఇచ్చింది. ఇలాంటి డొనేషన్లు ఇంతకు ముందుకూడా అవిడికి చాలా సంపాదించి పెట్టింది. అయితే యింత పెద్ద మొత్తం సంపాదించడం అదే మొదటిసారి."

జగన్నాధం ఆ పైవారంలోనే సావిత్రమ్మకి ఫోన్‌చేసి ఊటీకి టికెట్స్ రెడీఅయ్యాయని చెప్పాడు. అతడు ఫ్లైట్ లోనే రిజర్వుచేయించాడు.

రేఖాముఖర్జీ మళ్ళీ ఒకసారి రాణికి అన్నీ బోధించింది. విమానం ఎక్కటం అదే మొదటిసారి అన్నట్లు ప్రవర్తించవద్దని మరీ మరీ చెప్పింది. రాణీ అన్నీ అర్థంచేసుకొంది. ఊటీ బయలుదేరే ముందురోజు మరొక్కసారి ఏడ్చింది రాణి. అన్నీ మరిచిపోయి నారాయణ్ మాస్టారి దగ్గరికి వెళ్ళిపోదామా అని కూడా అనుకొంది- కానీ, అలా చేస్తే ఆ దుర్మార్గుడి అంతు చూసే దెలా ?

కారులో మహిళా సేవాసంస్థ దగ్గరకి వచ్చాడు జగన్నాధం- వి. ఐ. పి. బ్రీఫ్‌కేస్‌తో రెడీగా వుంది రాణి. దర్జాగా వచ్చి కారులో కూచుంది. "థేంక్యూ !" అన్నాడు అప్పటివరకూ వస్తుందో, రాదో అని అనుమానిస్తున్న జగన్నాధం.

ఊటీనుంచి తిరిగొచ్చేసరికి రాణికి తనమీద ఉన్న ప్రేమ లోకంలో ఏ ఆడపిల్లకీ, ఏ మగవాడిమీదా వుండదన్న నమ్మకం ఏర్పడిపోయింది జగన్నాధానికి- రేఖాముఖర్జీ శిక్షణతో తనకు సహజమయిన చాకచక్యంతో, జగన్నాధం మనసులోనే ఒక ప్రత్యేక స్థానాన్ని పొందగలిగింది రాణి. కారులో రాణిని మహిళా సేవాసంస్థ దగ్గిర దింపి "బి కేర్‌ఫుల్ ! మీ నాన్నగారికి ఇవన్నీ తెలియనియ్యకు-" అని హెచ్చరించాడు జగన్నాధం-

రాణి గుండెలమీద చెయ్యివేసుకుని "హమ్మో !" అని భయపడి అంతలో జగన్నాధం చెయ్యి ముద్దుపెట్టుకుని "మీరు మాత్రం నన్ను మరిచిపోకండి-" అంది.

"ఎలా మరిచిపోగలను ?" అన్నాడు జగన్నాధం- అతడు అవలీలగా అబద్ధాలాడతాడు. జీవితంలో తెల్లవారింది మొదలు అబద్ధాలాడకుండా అతనికి గడవదు. ఒక్కొక్కసారి ఏది అబద్ధమో, ఏది నిజమో, అతడే మరచిపోతుంటాడు- కానీ, ఆ పై మాటలు మాత్రం నిజంగా- మనసారా అన్నాడు.

"మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటాం మనం ?" చాలా జాలిగా అడిగింది రాణి.

సంతోషంతో ఉబ్బితబ్బిబైపోయాడు జగన్నాధం- అప్పటివరకూ తనికి అడబ్బిచ్చి ఆడవాళ్ళను కొనుక్కోవటం తెలుసు- ఏవేవో అవసరాలకోసం తనదగ్గరకువచ్చిన


Grams : GUARANTEE




నిగనిగలాడే మీ కేశ సంపదకు

''బాబుబ్రాండ్'' కొబ్బరినూనె వాడండి.

రుచికరమైన పచ్చళ్ళకు

బాబుబ్రాండ్ అగ్‌మార్క్ నువ్వులనూనె వాడండి.

బాబు ఆయిల్ ట్రేడర్స్

తెనాల్ రోడ్డు - విజయవాడ - 1

PHONE No. 77771

ఆడవాళ్ళను వాడుకోవటం తెలుసు- అంతేకాని, ఇలా అందమైన వయసులో ఉన్న ఆడపిల్ల ఇంత అమాయకంగా, బేలగా తనకోసం ఆరాటపడటం తెలియదు. అతనికి ఎంతో గర్వంగా వుంది. అంతకు పదిరెట్లు ఆనందంగా వుంది.

"మళ్ళీ ఎప్పుడు రాగలవు నువ్వు?"

"శని ఆదివారాలలో ఎప్పుడైనా...."

"సరే! పై ఆదివారం సాయంత్రం తీసికెళ్తాను-"

"థేంక్స్!"

"పిచ్చిపిల్లా! నే ననవలసిన మాట అది!"

రాణి బుగ్గమీద చిన్నగా దెబ్బవేసాడు- రెండు బుగ్గలూ ఎఱ్ఱబడగా లోపలికి వచ్చేసింది రాణి.

రేఖాముఖర్జీ ఎదురుచూస్తోంది. ఆవిడ చూడగానే రెక్కలు తెగిన పక్షిలా ఆవిడ వళ్లో వాలి ఏడ్చింది-

"ఏమిటిది! ఏమయింది? అతడికి నీమీద కోపం వచ్చిందా?" ఆదుర్దాగా అడిగింది ఆవిడ.

రాణి కళ్ళు తుడుచుకుని నవ్వుతూ "లేదు! లేదు! వచ్చే ఆదివారం వస్తానన్నాడు, ఇక్కడికి నన్ను తీసికెళ్ళటానికి. నన్ను మరిచిపోలేనన్నాడు. సిన్సియర్‌గానే అన్నట్లున్నాడు-" అంది.

"గుడ్ మరి ఏడుస్తున్నావ్ దేనికి?"

"మనసంతా వెగటుగా వుంది. శరీరమంతా కంపరంగా వుంది. ఇంచుమించు రెండుపూటలూ తలారా స్నానం చేస్తూనే వున్నాను- అయినా ఏమిటో చీదరగానే వుంది- స్నానం చేసి వస్తాను-"

లేచింది రాణి. అప్పుడు చూచింది ఆవిడ రాణి ముఖం లోకి. నిజంగానే రాణి ముఖం వాగా తడారిపోయింది. ఆ కళ్ళూ, ముక్కూ, నోరూ అన్నీ అలాగేవున్నా ఆ ముఖంలో జీవకళ ఏదో మాయమయిపోయింది-

ఆవిడ జాలిగా "నీలో ఇంకా వెనుకటి సున్నితత్వం పోలేదు- కొన్నాళ్ళు ఈ మనుషుల మధ్య ఉంటే నువ్వే బండబారిపోతావు-" అంది.

రాణి సమాధానం చెప్పలేదు. బాత్‌రూంలోంచి గంట వరకూ బయటికి రాలేదు.

## 7

జగన్ లేచి నిబడ్డాడు.

"బాబూ చీకటిపడింది- నేను నా గుడి కెళ్లాల?"

ఆశ్చర్యపోయాడు తిలక్

"ఈ ఊళ్ళో ఇంకో గుడి కూడా ఉందా?"

"ఆ గుడి కాదు బాబూ! నా గుడి- అంటే కల్లుపాక- ఏదెట్టా జరిగినా, ఆ కల్లుపాకకాడికి పోకుండా నాకు రోజు


*With Best Compliments From :*

# KANTHI PRINTING INKS PRIVATE LIMITED

Anjaneya Panthulu Street, Vijayawada - 520 010.

Phones : Fact : 74083 Off : 72060 Resi : 77047

*Manufacturers of :*

**Quality Printing Inks for Letter Press, Offset and Litho**

*Distributors for Twin Cities*

**SRI LAKSHMI ENTERPRISES**

Raj Bhavan Road, Hyderabad - 500 004. Phone : 35842

గడవదు బాబూ ?"

రెండు చేతులూ జోడించి వెళ్ళిపోయాడు జగన్. ఏమీ అనలేకపోయాడు తిలక్. ఈ జీవితాల కన్నిటికీ ఒక్కటే తరుణోపాయం- కల్లుపాక. అదికూడా లేకపోతే, ఈ దుర్భర దుఃఖాన్నంతటినీ ఆ ఒక్క గుండెలో ఎలా భరించ గలవు ? కల్లు తాగొద్దని నీతిబోధలు చెయ్యటం కాదు, దీనికి పరిష్కారం అసలు కల్లుపాక దగ్గిరకి వెళ్ళవలసిన అవసరమే లేకుండా చెయ్యటం. అంటే- ఆ రకమయిన మానసిక సంక్షోభం వీళ్ళకి కలగకుండా చూడటం-అది సాధ్యమేనా ? అట్లాంటి పరిస్థితులు వస్తాయా, ఏనాటికయినా, ఈ భారతంలో-

జగన్ వెళ్తూ వెళ్తూ- "వేదమూర్తి వచ్చాడంట బాబూ ? ఆయన్ని కలవండి-ఇంకా ఏటయినా చెప్తాడు-" అన్నాడు. తిలక్ వేదమూర్తి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు- పెంకుటిల్లు-ఇంటిముందు ఒకవారకి నందివర్ధన చెట్టూ- మరో వారకి పారిజాత వృక్షమూ ఉన్నాయి. అప్పుడే విచ్చుకొంటున్న పారిజాత పుష్పాలు మొత్తని సువాసన విరజిమ్ముతున్నాయి-

గుమ్మంలో నిలబడేసరికి పెరట్లో తులసికోట దగ్గిర దీపం పెడ్తున్న పెద్ద ముత్తైదువ కనిపించింది.

"ఎవరూ ?" అంది-

"వేదమూర్తి ఉన్నాడా అండీ ?" వినయంగా అడిగాడు తిలక్.

"ఎటో వెళ్ళాడు-అమ్మాయ్ ! ఎవరో చూడు," అంది ఆవిడ, బకెట్ బావిలో వేస్తూ....

లోపలి గదిలోంచి పదిహేడేళ్ళ అమ్మాయి వచ్చింది. అప్పుడే స్నానంచేసినట్లు జుట్టు విరబోసింది- నిర్లక్ష్యంగా పెట్టుకున్న బొట్టు-మరే అలాంకారాలూ లేవు. ముఖం దిగులుగా ఉంది.

"ఏం కావాలండీ ?" అని అడిగింది-

"వేదమూర్తి గారి కోసం వచ్చాను. రాణి గురించిన సమాచారం తెలుసుకోవాలని... "

రాణి పేరు వినగానే ఆ అమ్మాయి ముఖంమీద కూడా నల్లని మబ్బులు ఆవరించుకున్నాయి.

వేద రాణి సమాధి దగ్గరే ఉన్నట్లున్నాడు-పదండి నేనూ వస్తాను-" అని బయలుదేరింది-

"రాణికి అప్పుడే సమాధి ఎవరు కట్టారు ?" ఆశ్చర్యంగా అడిగాడు తిలక్.

"వేద కట్టించాడు-ఈరోజు మధ్యాహ్నం వచ్చాం మేము- రాగానే రాణి అస్థికలు తీసుకుని సమాధి కట్టించాడు. సమాధి

*With Best Compliments from :*

Grams : ASPHALT
Telex : 0465-252

Phones : 64202
64203
65679

**ANDHRA ASPHALT PRIVATE LTD.,**

10-1-32, WALTAIR UPLANDS,
VISAKHAPATNAM-3

*Manufacturers of*

All grades of Industrial Asphalt based products
Roofing Felt of all grades as per I S : Specification.

*Factory :*
MALKAPURAM
VISAKHAPATNAM-11
Phone : 7344

*Branches :*
HYDERABAD
&
MADRAS

మీద 'ప్రేమజ్యోతి' అని చెక్కించాడు–"

"తమాషాగా ఉంది."

"రాణితో పరిచయం ఉన్నవాళ్ళకి తమాషాగా ఉండదు. మా కిద్దరికీ రాణితోపరిచయం.... పరిచయం మాత్రమే కాదు– స్నేహం ఉంది."

"మీ పేరు ?"

"సువర్చల. నేను వేదమూర్తి భార్యని...."

సువర్చలతో కలిసి రాణి సమాధిదగ్గరకి వెళ్ళాడు తిలక్. ఇంకా తడిగా ఉందది. దానినే చూస్తూ చెట్టు కొమ్మకుని నిలబడ్డాడు– వేదమూర్తి తిలక్‌వచ్చిన పనివిని "ఇప్పుడే స్నానం చేసివస్తాను. చెరువుగట్టున సిమెంట్ బెంచీమీదకూర్చోండి–" అని చెరువులో స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చాడు. వేదమూర్తితో పాటు సువర్చల కూడా అక్కడే కూచుంది. జ్ఞాపకాలు తవ్వుకోసాగాడు వేదమూర్తి–

• • •

రవికుమార్ ఇస్తున్న పార్టీకి రేఖాముఖర్జీ వచ్చింది, రాణితో, ఇంకా మరికొంతమంది అందమయిన అమ్మాయిలతో. ఇలాంటి పార్టీలకి ఆవిడ మిసెస్ ముఖర్జీగానే వస్తుంది. తనవెంట వచ్చిన అమ్మాయిలు, తన స్నేహితుల కూతుళ్ళుగా– బంధువులుగా రకరకాలుగా పరిచయాలు చేస్తుంది. నిజానికి వాళ్ళలో చాలామంది అక్కడి చాలా మందికి తెలుసు– తన సోషల్ కాంటాక్ట్స్ పెంచుకోవటానికి రేఖాముఖర్జీ చాలా రకాలుగా ప్రయత్నాలు చేస్తుంది. హయ్యర్ సర్కిల్స్‌లో చాలామందితో ఆవిడకు పరిచయాలున్నాయి– వాళ్ళందరూ ఆవిడని చాలా సంతోషంగా పార్టీలకి ఆహ్వానిస్తారు, ఆవిడవెంట వచ్చే ఆడపిల్లల కోసం. అలాంటి పార్టీలలో ఎలా ప్రవర్తించాలో బాగా నేర్చుకుంది రాణి– ఎవరైనా హాట్‌డ్రింక్ ఆఫర్‌చేస్తే స్టయిల్‌గా "నో థాంక్స్!" అని చెప్తూ ఫ్రూట్‌జ్యూస్ గ్లాసు చేత్తో పట్టుకుని ఇంచుమించు అన్ని కుర్చీలదగ్గరకీ తిరుగుతూ– గలగలా ఇంగ్లీషులో మాట్లాడుతూ– అమాయకంగా ముఖం పెడుతూ– అందరి దృష్టినీ ఆకట్టుకోగలదు రాణి– ఒక ఫ్రెండ్‌తో ఆ పార్టీకివచ్చిన వేదమూర్తికి, అక్కడ రాణిని అలా చూడగానే ఊపిరి ఆగిపోయినట్లయింది. అన్నీ మరిచిపోయి రాణినే చూడసాగాడు. పింక్ కలర్ మీద ఎంబ్రాయిడరీ చేసిన ఫ్రాక్ తొడుక్కుంది రాణి. జుట్టు స్టయిల్‌గా విరబోసినట్టుగా ఉంచుకొని, మళ్ళీ చెదిరిపోకుండా క్లిప్స్ పెట్టుకుంది. సహజంగా అందమయిన మనిషి కావటంవల్ల ఆ అలంకరణలో మరింత అందంగా ఉంది. ఇంచుమించు అందరి చూపులూ రాణిచుట్టూ తిరుగుతున్నాయి. రాణిలో




ఇటీవల పెరిగిన నిర్లక్ష్యం, నిరాసక్తత కారణంగా తను మొదట వేదమూర్తిని గమనించలేదు. వేదమూర్తి తినటం తాగటం కూడా మరచిపోయి తననే చూస్తూ ఉండటంతో రాణి చూపులు కూడా అటు తిరిగాయి. ఒక్క క్షణం రాణి గుండె గతి తప్పింది. కాళ్ళు వణికాయి. గతంలోని అందమైన స్మృతులెన్నో నీలితెరల్లా ముఖాన్ని కప్పేసాయి. కళ్ళు తిరిగినట్లయి తూలిపడబోయింది- వేదమూర్తి లేచి చటుక్కున చెయ్యి పట్టుకుని ఆపాడు- ఇద్దరి కళ్ళు ఎంతో దగ్గిరగా కలుసుకున్నాయి. "మల్లీ !" వేదమూర్తి పెదవులు అస్పష్టంగా కదిలాయి. రాణి అతడి చెయ్యి విడిపించుకొని పోయి, రేఖాముఖర్జీ పక్కన కూర్చుంది. ఆ తరువాత కూచున్నచోటినుంచి కదలలేకపోయింది. కానీ, ఉండుండి చూపులు వేదమూర్తి వైపు తిరుగుతున్నాయి. అతడు రాణినే చూస్తున్నాడు. ఈలోగా హైమ అనే మరో అమ్మాయి వెళ్ళి వేదమూర్తి పక్కన కూచుంది. హైమ అతడితో బాగా చనువుఉన్నట్లుగా మాట్లాడటం చూసి లోలోపల కొంత ఆశ్చర్యపోయింది. అసలు వేదమూర్తి ఈ పార్టీకి రావడమే పెద్ద ఆశ్చర్యం. ఆ మొదటి ఆశ్చర్యం అయిపోయాక ఇక మిగిలినవాటికి వేటికీ ఆశ్చర్యపడక్కర్లేదు- రేఖాముఖర్జీతో కారులో వెళ్ళిపోతున్నప్పుడు వేదమూర్తి మరోసారి కారు దగ్గిరగా వచ్చి "మల్లీ!" అన్నాడు. రాణి వినిపించుకోకుండా కారులో కూచుంది. బిక్కముఖంతో చూస్తుండగానే కారు కదిలిపోయింది.

ఆ రాత్రి భోజనం చెయ్యలేకపోయింది రాణి. మిగిలిన అమ్మాయిలు జోక్సుతో నవ్వించాలని చూసినా నవ్వలేదు. పడుకోబోయే ముందు హైమ నడిగింది.

"ఇందాక నువ్వు మాట్లాడావే, అతడు నీకు బాగా తెలుసా ?" అని.

"కిశోర్ అండ్ సన్స్ కంపెనీ గెస్ట్‌హవుస్‌లో అయిదారు సార్లు కలుసుకున్నాం !"

అంటే ఏమిటో తెలుసుకోలేనంత అమాయకురాలు కాదిప్పుడు రాణి. ఆ గెస్ట్‌హవుస్ గురించి అడిగి తెలుసుకోవాలనిపించలేదు. అన్ని గెస్ట్‌హవుసులూ ఒకటే ! అన్నింటి కథలూ కొద్దితేడాలో ఒకటే. కానీ, రాణికి ఒకటే సందేహం.

"అతడికి డబ్బు లేదు !"

హైమ నవ్వింది.

"అవును. కానీ డబ్బున్న స్నేహితులున్నారు- అంటే చిన్న పిల్లలు- తండ్రులు వ్యాపారస్థులయితే కొడుకుల చేతుల్లో కూడా డబ్బుంటుంది. గెస్ట్‌హవుస్ వ్యవహారాలు వాళ్ళకూ తెలుస్తాయి. వేదమూర్తికి అలాంటి స్నేహితులెవరో


*With Best Compliments from :*

**HYDERABAD POLYMERS PVT. LTD.,**

83/A, Industrial Development Area,
JEEDIMETLA, HYDERABAD-500 854,

***Registered Office :***

Lane opposite to Prabhath Talkies,
Kacheguda, HYDERABAD.
Phone : 56857

**Manufacturers of HDPE Woven Stacks**

ఉన్నారనుకొంటాను. తండ్రులు ఊళ్ళో లేనప్పుడు ఈ యువకులంతా గెస్ట్‌హవుస్‌లో చేరతారు."

ఇది రాణి కళ్ళముందు తెరుచుకున్న సమాజంలోని మరో కొత్త కోణం. వేదమూర్తి- అమాయకత్వానికి మరో మారుపేరులా కనిపించే వేదమూర్తి- మంచితనమూ, మానవత్వమూ రంగరించినట్లుండే వేదమూర్తి- అతడు కూడా—

సమాజంలో మార్పువస్తోంది- శరవేగంతో వస్తోంది. దీనిని ఎవరూ గుర్తించటంలేదా? గుర్తించి కూడా ఎవరి మటుకు వాళ్ళే గుర్తించనట్లు తమని తాము మభ్యపెట్టు కొంటున్నారా?

రెండురోజుల్లోనే రాణిని వెతుక్కుంటూ వచ్చాడు వేదమూర్తి. అతడు వచ్చినందుకు రాణి సంతోషించ బోయింది. కానీ, అతడి ముఖంలో మార్పుని చూడగానే ఆ సంతోషం ఆవిరై పోయింది.

"బాగున్నావా?" అన్నాడు పలకరింపుగా. తను అతడిని గుర్తుపట్టనట్లుగా నటించదలచుకోలేదు రాణి.

"బాగున్నాను. అక్కడ అంతా బాగున్నారా?"

రాణి ఆ ఊరినుంచి వచ్చేసాక, ఎప్పుడూ హరిజనులుండే వీధికి పోలేదు వేదమూర్తి. రాణి ఉన్నప్పుడైనా ఆ వీధికి దూరంగా చెరువుగట్టున కూచునేవాడు, రాణికోసం ఎదురు చూస్తూ. రాణి ఇంట్లోవాళ్ళంతా ఎలా ఉన్నారో, అతడికేమీ తెలీదు.

అమాయకంగా తల ఊపాడు. రాణికి అర్థమయి పోయింది అతడికెంత తెలుసో....

"ఎందుకొచ్చావ్....?"

రాణి ఇంత సూటిగా అడిగేసరికి వేదమూర్తి తడబడ్డాడు.

"నిన్ను చూసిపోదామని...."

రాణి మాట్లాడలేదు. ఏదో చెప్పాలని నోరు తెరిచి అంతలో తమాయించుకొంది.

"అక్కడ నిన్ను చూసినప్పటినుంచీ మళ్ళీ ఎప్పుడు చూద్దామా అనే ఉంది...."

రాణి మాట్లాడలేదు.

"నేను.... నిన్ను ప్రేమిస్తున్నాను రాణీ!"

రాణి ఆశ్చర్యపోలేదు. వేదమూర్తి వచ్చినప్పటినుంచీ ఈ మాటలకోసమే ఎదురుచూస్తోంది. అతడు ఈ మాటలు చెప్పటంకోసమే వచ్చాడని రాణికి తెలుసు. విచిత్రంగా చూసింది.

ఆ చూపులు అర్థంకాలేదు వేదమూర్తికి. తికమక పడ్డాడు. "నిన్ను ప్రేమిస్తున్నాను. చిన్నప్పటినుంచీ....చాలా

సకల జనావళికి దీపావళి శుభాకాంక్షలు!

కొత్తదనానికి మరో పేరు...

ప్రామిస్

మురాదాబాద్ బ్రాస్ వస్తువులు .... చిత్రవిచిత్ర నగలు....

స్త్రీ పురుషులకు పనికివచ్చే అనేక రకాల చేతివస్తువులు ....

బహుమతి ఇవ్వతగిన ఆర్టికల్స్ కోసం ఒకసారి సందర్శించండి ....

ప్రామిస్ హాండీక్రాఫ్ట్స్

హోటల్ ఖాందారీ ఇంటర్నేషనల్

బందర్ రోడ్ - విజయవాడ

చిన్నప్పటినుంచీ...."

ఉద్రేకంగా చెప్పాలని తాపత్రయపడుతున్నాడు. ఆ పసిముఖం ఎఱ్ఱబడుతోంది.

రాణి నవ్వింది. ఆ నవ్వుకు తను నవ్వాలో లేక చిన్నబుచ్చుకోవాలో అర్థంకాలేదు వేదమూర్తికి. అలా ఉంది, ఆ నవ్వు.

రాణి తన హేండ్‌బ్యాగ్‌లోంచి ఒక చిన్న కాగితం తీసి దానిమీద అడ్రస్ వ్రాసి "ఈ అడ్రస్‌కి రా సాయంత్రం! వెళ్ళు" అంది.

"థాంక్యూ!" అని వెళ్ళిపోయాడు వేదమూర్తి, ఆ కాగితం జాగ్రత్తగా దాచుకుని.

సాయంత్రం ఆ అడ్రస్ ప్రకారం వెతుక్కుంటూ వెళ్ళాడు. జీరా దగ్గిర ఒక సందులో ఉన్న డాబాయిల్లు. నీట్‌గా ఉంది, ఇల్లు- ఒక మోస్తరు కాంపౌండ్. కాంపౌండ్‌లో పూలమొక్కలు. గుమ్మందగ్గిర నిలబడి కాలింగ్ బెల్ నొక్కాడు. ఆజానుబాహువయిన ఒక వ్యక్తి తలుపు తెరిచి, "కమిన్. ఏంకావాలి మీకు?" అన్నాడు. వేదమూర్తి తడబడుతూ "రాణి...." అని ఆగిపోయాడు. అతడికిప్పుడు భయంగా ఉంది. ఇతనెవరో? రాణికీ ఇతడికీ సంబంధమేమిటో- కొంపదీసి ఇతడు తనని తన్నడుగదా? కాళ్ళు వణకసాగాయి.

అతడు కనుబొమలు ముడిచి "రాణి?.... ఇక్కడ రాణి ఎవరూ లేరే!" అని తనలో తను అనుకున్నట్లుగా అనుకుని "సువర్చలా!" అని పిలిచాడు.

ఆ పిలుపు వినగానే ఉలికిపడ్డాడు వేదమూర్తి. తనకు తెలియకుండానే ఎటెన్షన్‌లో నిలబడ్డాడు.

"యస్ అంకుల్!" అంటూ వచ్చింది, పదిహేడేళ్ళ అమ్మాయి. వేదమూర్తిని చూడగానే "మీరా?" అని తనూ నిలబడిపోయింది, అలా కొన్ని క్షణాలు.

"ఎవరూ?" అన్నాడు అతడు.

"ఈయన- ఈయన.... వేదమూర్తి." కొంచెం కష్టంగా వచ్చాయి ఆ మాటలు ఆ అమ్మాయినోట.

"ఓ! నీ గదిలోకి తీసికెళ్ళి మాట్లాడు." అన్నాడు అతడు

"రండి!" అంటూ పక్కగదిలోకి దారితీసింది ఆ అమ్మాయి.

"కూర్చోండి!"

అతడు కూచోలేదు. నిలబడే చుట్టూ చూస్తున్నాడు.

"ఉండండి! కాఫీ తెస్తాను."

కాఫీ కప్పు అందించబోతే అతడు అందుకోలేదు. బల్లమీద పెట్టింది.

*With Best Compliments from :*

**VIJAYA DURGA FILMS**

GANDHINAGAR, VIJAYAWADA - 3. PHONE : 76654

*Our Successful Running Pictures*

**DAKU AUR JAWAN (Hindi-Colour)**

**D E V U D A M M A (Telugu)**

*Shortly Coming*

**AAKHRI KASAM (Hindi-Colour)**

"రాణీ నీకెలా తెలుసు?" అంతసేపటికి నోరు విప్పి మాట్లాడారు వేదమూర్తి.

మెరుపుకొట్టినట్లు అయింది ఆ అమ్మాయికి.

"రాణీకోసం వచ్చారా, మీరిక్కడికి? రాణీ మీకీ అడ్రస్ ఇచ్చిందా? భలే జోక్." గట్టిగా నవ్వింది.

వేదమూర్తి మనసు రగిలింది. ఆ అమ్మాయి కాఫీకప్పు తీసుకుని కిటికీలోంచి బయటికి పారబోసింది. పారబోసి ఊరుకోలేదు–

"సారీ! శరత్ నవలల్లో పాత్రలాగా 'స్వామీ! నాచేతికాఫీ మీరు తాగుతారా!' అని అడగలేకపోయాను."

మండుతోంది వేదమూర్తి మనసు.

"రాణీ నీకెలాతెలుసు?" మళ్ళీ అడిగాడు.

"ఒకసారి మా కాలేజీ ఫంక్షన్‌కి చీఫ్‌గెస్ట్‌గా జగన్నాధం గారిని పిలిచాం. అప్పుడు ఆయనతో రాణీ కూడా వచ్చింది. నేను గుర్తుపట్టి పలకరించాను. నా అడ్రస్ అడిగింది. ఇచ్చాను."

"ఛీ! సిగ్గులేదు." కోపంగా అన్నాడు వేదమూర్తి.

సువర్చల మళ్ళీ నవ్వింది.

"ఎవరికి సిగ్గులేదూ? నాతో మాట్లాడినందుకు రాణీకా? రాణీతో మాట్లాడినందుకు నాకా? లేక రాణీకోసం ఇల్లు వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చిన మీకా? బైదిబై, రాణీ మీలాంటివాళ్ళకోసం వస్తుందని ఎలా అనుకున్నారు? ఆవిడ చాలా హైక్లాస్! జగన్నాధంగారూ – ఇంకా అలాంటి వాళ్ళదగ్గరికి తప్పవెళ్ళదు. వేలసంఖ్యలో డొనేషన్లు వసూలు చెయ్యటం తప్ప వందల్లో ఏమీ తీసుకోదు. మీ గెస్ట్‌హవుస్ లెవెల్‌లోకి తను రాదు."

నవ్వుతోంది సువర్చల హేళనగా నిరసనగా.... సిగ్గు–కోపం–రోషం–అన్నీ ఒక్కసారి మనసుని మెలిపెట్టేస్తోంటే, సువర్చల ముఖం చూడలేక అక్కడ్నుంచి వచ్చేసాడు. రాణీమీద చాలా కోపంగా ఉంది. రాణీ తనకు దారుణమైన అవమానం చేసిందని అనిపించింది. రాణీని ఏదో చేసెయ్యాలనిపించింది. కానీ, రాణీని తను ఏంచెయ్యగలడు? రాణీ దగ్గరికి బయలుదేరేవరకూ రాణీ ఏదో చాలా చులకన అయిపోయినట్లు తోచింది. కానీ, ఇప్పుడుతెలుస్తోంది, నిజంగా రాణీ ఏ ఎత్తున ఉందో?....

సువర్చల విషయంలోనూ అంతే! సువర్చలా, తనూ ఎప్పుడైనా కలుసుకుంటే, ఆ అమ్మాయి తన కాళ్ళమీద పడి క్షమించమని ఏడుస్తుందనీ, తను తండ్రిమాటకి ఎదురు చెప్పలేక, ఆ అమ్మాయిని క్షమించకుండా ఉండలేక చాలా మథనపడవలసి వస్తుందనీ....ఇలా ఊహించేవాడు. కానీ....

ఛ! ఈ సమాజం ఏదో మారిపోతోంది. కసిగా అనుకున్నాడు.

రాణీని చూడకూడదనుకున్న వేదమూర్తి నిశ్చయం ఎంతోకాలం నిలవలేదు. రాణీకోసమే మళ్ళీ మహిళా సేవా సంస్థకి వెళ్ళాడు. అక్కడ రాణీ లేదు. హైమ ఉంది. ఏవో కొన్ని వేళాకోళాల తర్వాత, "రాణీ మీకీ ఉత్తరం ఇమ్మంది." అని ఒక కవరు ఇచ్చింది.

తెరిచి చదువుకున్నాడు.

"వేదా!

నువ్వు.... పొట్టి నిక్కరు పైకి లాక్కుంటూ నాకు లెక్కలపుస్తకం ఇచ్చిన చిట్టి వేదవే కదూ! ఎలా మాట్లాడగలిగావ్, నాతో అలాంటి మాటలు! నాకు తెలుసు! నేను చెడిపోయినదాన్నని, నీకంత ధైర్యం వచ్చిందా అలా మాట్లాడటానికి! అవును– నేను చెడిపోయిన దాన్నే! ఎంతో, ఎంతో చెడిపోయినదాన్ని. నేను చెడిపోయానని నువ్వు అసహ్యించుకొంటే నేను సంతోషించి ఉండేదాన్ని. కానీ, నువ్వు– పోనీలే! అది మరిచిపో! ఈనాటి ఈ సమాజంలో ఏదీ వింత కాదు. ఏదీ అసంభవం కాదు.

నిన్ను సువర్చల దగ్గరికి పంపించింది నిన్ను అవమానించటానికి కాదు– జీవితంలో నువ్వు పోగొట్టుకున్నదేమిటో అర్థంచేసుకొంటావని! మన సమాజమంతా ఈనాడు కాకి బంగారంలా మెరుస్తోంది. మన విలువలూ, మన ఆచారాలూ, మన నమ్మకాలూ, అన్నీ కాకిబంగారపు మెరుపులే! ఏ మాత్రమూ విలువలేని, స్థిరత్వంలేని, శోభలేని– కాకిబంగారపు మెరుపులు! తెలిసి తెలిసి ఈ కృత్రిమపు మెరుపుల వెంటే పరుగులు తీస్తున్నాం, అందరం ఒకరితో ఒకరు పోటీలుపడుతూ....సువర్చల నాకంతా చెప్పింది. సువర్చల తండ్రి తప్పతాగి భార్యను చావతంతోంటే, మీ బ్రాహ్మణ్యానికేమీ మచ్చరాలేదు. అతడు తాగిన మత్తులో కారు కిందపడి చస్తే– ఆ ఆస్తిపరురాలైన వితంతువు మీదికి అందరూ పిచ్చికుక్కల్లా రహస్యంగా ఎగబడ్డానికి బ్రాహ్మణ్యం అడ్డు రాలేదు. అలా రహస్యంగా ఆవిడని వశపరచుకోవాలని చూసే పెద్దమనుష్యులకి బుద్ధిచెప్పటానికి ఏ బ్రాహ్మణోత్తముడికీ నోరు రాలేదు. మీనాన్న ఆవిడని ఆస్తితోనూ, పిల్లలతోనూ తనదగ్గరికి వచ్చెయ్యమన్నాడట! అలా రానన్నదని కోపంలో, చివరకు ఆవిడ తనకు అండగా ఉంటానని ధైర్యంగా నిలబడ్డ విలియమ్స్‌గారితో వచ్చేస్తే– అప్పుడు– మీ బ్రాహ్మణ్యం తగలబడిపోయింది. మీ నాన్న నీ భార్యని వదిలెయ్యమని నిన్ను ఆజ్ఞాపించాడు. తండ్రిమాట జవదాటని శ్రీరామచంద్రుడివి నువ్వు. ఆ అమ్మాయిని వదిలే

కావు. ఒక వంక ఈ డ్రింక్‌పార్టీలూ- గెస్టహౌస్‌లూ- చీట్లపేకలూ- మరొక వంక బ్రాహ్మణ్యమూ, ఆచారసంప్రదాయలూ-పితృదేవుల ఆజ్ఞలూ- ఆహా! ఎంత అందమయిన సమాజం ఇది! ఎన్ని విచిత్రమయిన కోణాలు?

వేదా! నీ కంటె పెద్దదాన్ని. నీ మేలు కోరేదాన్ని. నువ్వు సంతోషంగా ఉంటే చూసి సంతోషించేదాన్ని. నిజం చెప్తున్నాను- సువర్చలలాంటి భార్య దొరకటం ఏ మొగవాడికైనా గొప్ప అదృష్టం. నీ అదృష్టం నువ్వు కాలదన్నుకుంటే నీఅంత దౌర్భాగ్యులు మరెవరూ ఉండరు. వెంటనే సువర్చలను క్షమాపణ కోరుకో! ఇప్పటికీ నీ మంచితనంలో ఆ అమ్మాయికి నమ్మకముంది.

ఎప్పటికీ నీ మేలుకోరే

మల్లి...."

వేదమూర్తి మళ్ళీ సువర్చల దగ్గరకు వెళ్ళాడు. రాణి ఉత్తరం చదివిన వెంటనే కాదు, కట్నంకోసం తండ్రితెచ్చే పెళ్ళికూతుళ్ళని చూసి జడుసుకుని. తను ఇలాగే ఉంటే తండ్రి ఎవరినో ఒకరిని తనకు కట్టబెట్టేస్తాడని హడల్ పట్టుకుంది. సువర్చల దగ్గిరకు వచ్చేసాడు. మామూలుగా ఎవరినో ఆహ్వానించినట్లు ఆహ్వానించింది ఆ అమ్మాయి.

"నాతో వస్తావా?" సూటిగా అడిగాడు.

"ఆలోచించుకోవాలి!"

"ఎంత చెడ్డా భర్తని కదా! క్షమించకూడదూ?"

బేలగా అతడు అడుగుతోంటే, ఆ అమ్మాయి నిగ్రహం కరిగిపోయింది. నవ్వేసింది.

"భర్త అని కాదు కాని, నా కర్మకాలి మిమ్మల్ని ప్రేమించాను! అందుకే రానని కచ్చితంగా చెప్పలేకపోతున్నాను- ఒకప్పటి మీ మంచితనం నాకు గుర్తుంది."

ఆ తరువాత సువర్చల అంకుల్ అని పిలిచే విలియమ్స్ సహకారంతోనే వేదమూర్తి మంచి ఉద్యోగం సంపాదించుకోగలిగాడు.

"అయిందేదో అయింది కాని, అమ్మాయిని తీసుకుని ఇంటికి రా!" అని సర్దుకుపోయాడు వేదమూర్తి తండ్రి.

## 8

వెన్నెల్లో చెరువుల నీళ్ళు తళతళలాడుతున్నాయి.

"చిన్నప్పుడు మల్లికోసం ఎదురుచూస్తూ ఈ చెరువుగట్టునే కూచునేవాడిని" అన్నాడు వేదమూర్తి.

"నారాయణ్ మాస్టారు వచ్చినట్లున్నారు. ఆయన నీ కలుసుకోండి. ఎవరు హత్యచేసారో, ఆయనకి తెలుస్తుందేమో!" అంది సువర్చల. రాణిని హత్యచేసినవాళ్ళని కనిపెట్టి శిక్షించాలని చాలా కసిగా అంది సువర్చల.

అందరు లేచారు. భోజనంచేసి మళ్ళీ యాదయ్య ఇంటికి వెళ్ళాడు తిలక్. ఆ ఇల్లు ఇదివరకులా బోసిగా లేదు. చాలా మంది మనుష్యులున్నారు. వాళ్ళంతా రాణి బంధువర్గమేమో!

తిలక్‌ని చూసి సన్నగా పొడుగ్గా ఉన్న ఒక వ్యక్తి "ఏం కావాలండీ!" అన్నాడు.

"నారాయణ్ మాస్టారు వచ్చారని తెలిసింది. ఆయనను కలుసుకోవాలి...."

"నేనే మాస్టారిని- ఏంకావాలి మీకు?"

తిలక్ తన విజిటింగ్‌కార్డుఇచ్చి "రాణికి సంబంధించిన వివారాలు కావాలి - మీకు తెలిసినంతవరకు చెప్పగలిగితే..." అన్నాడు.

• • •

పేపర్ చదువుతున్న నారాయణ్ అదిరిపడ్డాడు, ఆ ఫోటోని చూసి- దాని కింద ప్రచురింపబడ్డ వార్త చూసి- "మహిళా సేవాసంస్థలో స్వచ్ఛందవాలంటీర్‌గా పనిచేస్తున్న రాణి అనే సంఘసేవికను, రాజకీయనాయకుడు భజగోవిందం బలాత్కరించాడు. అతడిపైన విచారణ జరుగుతోంది. నాయకుడిని కఠినంగా శిక్షించాలని, మహిళాసంఘాలూ, మహిళా కళాశాలలూ, తీవ్రమైన ఆందోళన జరుపుతున్నాయి."

ఆ ఫోటోలో ఉన్నది మల్లిక. గౌనులో ఉన్నంత మాత్రాన- హెయిర్ స్టయిల్ మారినంత మాత్రాన మల్లికను గుర్తించలేకపోలేదు నారాయణ్. రాణిగా పేరు ఎందుకు మార్చుకుందో అతడికి అర్థంకాలేదు. ఆ రోజే హైదరాబాద్ చేరుకుని, మహిళాసేవా సంస్థ ఎక్కడుందో విచారించి అక్కడికి వెళ్ళి రాణితో మాట్లాడాలని అడిగాడు. తనకోసం ఎవరో వచ్చారని విన్న రాణి ఏ పత్రికావిలేఖరులో ఇంటర్వ్యూకి వచ్చారనుకుని బయటి వరండాలోకివచ్చి నారాయణ్‌ని చూసి ప్రాణ్ప్రడిపోయింది. వెంటనే అక్కడినుంచి పారిపోవాలనుకుంది. కానీ కాళ్ళు కదలలేదు. శరీరంలోని ఏ భాగానికీ చైతన్యంలేనట్లు మొద్దుబారిపోయింది.

"మల్లికా!"

రాణికి ఎవరో వాడిబల్లెంతో గుండెలో గుచ్చినట్లయింది. ఇతడు ఇప్పటికీ అలాగే పిలుస్తున్నాడు. అంత తీయగాను, అంత ఆప్యాయంగానూ పిలుస్తున్నాడు. మిగిలిన ఎవరితోనైనా అన్నట్లు "మల్లిక ఎవరూ" అనలేకపోయింది. రెండు చేతులూ జోడించి, ఏదో మాట్లాడబోయి దుఃఖంతో గొంతు పూడుకుపోగా మాట్లాడలేకపోయింది. నారాయణ్ ఆమె పరిస్థితిని అర్థంచేసుకుని దగ్గిరగా వచ్చి జోడించిన చేతులు తన చేతుల్లోకి తీసుకుని, ఆమె తల తన భుజానికి అన్చుకు

న్నాడు. అక్కడ మిగిలినవాళ్ళు తెల్లబోయి చూస్తున్నారు. రాణికేమీ తెలియటం లేదు. ఎంతో శాంతంగా స్థిమితంగా ఉంది. అతడి భుజంమీదినుంచి తల తీయాలని లేదు.

"మల్లికా ? నేను హోటల్లో దిగాను. అక్కడికి వస్తావా ? అన్నీ వివరంగా మాట్లాడుకుందాం !"

రాణి ఏం సమాధానం చెప్పిందో నారాయణ్‌కి వినిపించ లేదు. ఏదో గొణిగింది. ఆమెను తానే నడిపించుకుంటూ బయటికి తీసుకొచ్చి టాక్సీలో తను దిగిన హోటల్‌కి తీసి కెళ్ళాడు.

"మల్లికా ! ఏమిటిది ? నాయకుడు నిన్ను బలాత్కారం చేసాడా ? అసలు నువ్వు హైదరాబాద్ ఎందుకొచ్చావ్ మా కెవ్వరికీ, కనీసం నాకూ్కడా చెప్పకుండా ఎందుకొచ్చావ్ ? ఈ మహిళాసేవా సంఘంలో ఎందుకుంటున్నావ్ ? నాయకు నితో నీకు కాంటాక్ట్స్ ఎలా ఏర్పడ్డాయి ?"

నారాయణ్ ప్రశ్నల్లో ఒక్కదానికీ సమాధానం చెప్పలేక పోయింది రాణి. చేతుల్లో ముఖం కప్పుకుని దీనంగా ఏడవ సాగింది. అతడు ఎన్నోవిధాల బుజ్జగించాక, ఎలాగో ఏడుపు ఆపుకుని ఒక్కొక్కటీ జరిగిన సంగతులన్నీ చెప్పి "ఇప్పుడు మాత్రం ఆ భజగోవిందం నన్ను బలాత్కారం చెయ్యలేదు. ఆ నాటకం నేనే ఆడాను." అంది. ఆ విష యాలు వివరంగా చెప్పింది.

ఏదో కళాప్రదర్శనకు ప్రారంభోత్సవం అవుతోంది. భజగోవిందాన్నీ మరో ఇద్దరు నాయకులను ఆహ్వానించారు వాళ్ళు. రాణి మరికొందరు స్నేహితులతో వచ్చింది. ఉప న్యాసాలూ,వగైరాలు అయ్యేసరికి రాత్రి తొమ్మిది అయ్యింది. రాణి భజగోవిందంతో తానే మాటలు కలిపింది. ఆ మహాను భావుడు ఒకనాటి మల్లిని అప్పుడేమరిచిపోయాడు. రాణి మల్లి కావచ్చుననే అనుమానమైనారాలేదు. అతడి లెక్కలప్రకారం మల్లీ- రాణీ ఒకటి కావటానికి వీల్లేదు. మీటింగ్ అయి పోయాక, "సార్ ! ఇవ్వాళ మా కారు రాలేదు. టాక్సీలో నయినా, ఆటోలో నయినా వెళ్ళాలంటే భయంగా ఉంది. కొంచెం మా సంఘం దగ్గిర డ్రాప్‌చేస్తారా ?" అని అడిగింది.

"ఓ ! ష్యూర్ !" అన్నాడు భజగోవిందం. కారులో వెనకసీట్లో తన పక్కన కూచోపెట్టుకున్నాడు. రాణిని తాకాలా, వద్దా అని సందేహిస్తూండగా రాణి తనే తనకాలు అతడి కాలికి తాకించింది. భజగోవిందం హుషారుగా తన చెయ్యి రాణిభుజంచుట్టూ వేసాడు. రాణి నవ్వింది. సేవా సంఘం రాగానే కారు ఆగింది. "అప్పుడే వచ్చేసింది!" అన్నాడు భజగోవిందం దిగులుగా.

రాణి కారు దిగకుండా "ప్లీజ్ ! నా గదిలోకొచ్చి కాస్త కాఫీ తీసుకుని వెళ్ళండి !" అంది. భజగోవిందం సందే హిస్తూ "ఇప్పుడొద్దులే ! మరోసారి కలుసుకుందాం !" అన్నాడు భావగర్భితంగా.

"ఫరవాలేదండీ ! చూడండీ ! నాగది మిగిలిన బిల్డింగ్‌కి చాలా దూరంలో ఉంటుంది." అని చూపించింది.

నిజంగానే మెయిన్ బిల్డింగ్‌కి దూరంగా ఉంది ఆ గది. కాముకుడైన భజగోవిందం మనసు ఊగులాడింది. "సరే ! పద ! మీ సంఘాన్ని కూడా చూచినట్లుంటది- మీ సావి త్రమ్మ నన్ను చాలాసార్లు రమ్మంది" అని దిగాడు.

సావిత్రమ్మతో అతనికున్న పరిచయం అతడికి కొంత ధైర్యానిచ్చింది.

రాణి గదిలోకి వచ్చి చుట్టూ చూసాడు. చుట్టుపక్కల ఎవరూ లేరు. మంచం, దానిమీద పక్క నీట్‌గా ఉన్నాయి. రాణి తనంతట తనే అతడిని కౌగిలించుకుంది. ఇక భజగో విందం నిగ్రహించుకోలేకపోయాడు. తలుపులు జాగ్రత్తగా గడియపెట్టి ఆ తరువాతే రాణిమీద పడ్డాడు. పాపం, అతడికి తెలియదు, వెనుక బాత్‌రూంలోంచి బయటికి మరో తలుపు ఉందని. అతడికి పూర్తిగా మతిపోనిచ్చి రాణి గావు కేకలు పెట్టింది. అక్కడితో మహిళా సేవాసంస్థలో ఉన్న వాళ్ళంతా బిలబిలలాడుతూ రావటం, రాణి తెలివితప్పి పడి పోయినట్లు నటించటం- పోలీసురిపోర్ట్‌లూ, డాక్టర్ రిపో ర్టులూ- వగైరా, వగైరా....

ఇప్పుడు రాణి మల్లికాదు. గుడిసెల్లో ఉండే నిరుపేద హరిజన బాలిక కాదు. ఈనాడు రాణి వెనుక రేఖాముఖర్జీ ఉంది. అంతకంటె రాణి వ్యామోహంలో పూర్తిగా తల మునకలవుతున్న జగన్నాధం ఉన్నాడు. భజగోవిందం తాను తప్పుచెయ్యలేదని బుకాయించటానికి కూడా వీల్లేక పోయింది. అతడు చెయ్యగలిగినదల్లా రాణి తనంత తానే ఆహ్వానించిందని చెప్పటం మాత్రమే ! ఆ మాటలు ఎవరూ నమ్మలేదు. ఒకరిద్దరు నమ్మినా, "చిన్నపిల్ల రమ్మంటే మాత్రం నువ్వు వెళ్తావా ?" అని భజగోవిందాన్నే తిట్టారు. జగన్నాధం గట్టి పట్టుదలతో తన రాణిని పాడుచేసినవాడిమీద కక్షతీర్చుకోవటానికి పూనుకోవటంవల్ల అతడి పదవి ఊడిపోయింది. ఈ రాణి కథతోపాటు, ఇంకా అతని పాత కథలనేకం పత్రికల కెక్కాయి. కొందరు ఎలా సంపా దించారో ఫొటోలుకూడా ప్రచురించారు. ఉన్నవీ, లేనివీ అనేక కథలు ప్రచారమయ్యాయి. భజగోవిందం అన్ని విధాలా భ్రష్టుడయిపోయాడు. పనిలో పనిగా అతడిమీద అవినీతి కేసులుకూడా వచ్చాయి "సిరి తాపోయినపోవును...."

అన్నట్లు అతడిపడి తిరుక్షవరం అయింది.

నారాయణ్ అంతా విని "సరే! ఇప్పుడు నీ కక్ష తీరిందా?" అన్నాడు.

"తీరింది?"

"ఇకనేం? నాతో వచ్చెయ్యి."

మతిపోయినట్లు చూసింది. రెండుచేతులూ చాచి ఆమెను దగ్గిరగా తీసుకున్నాడు.

"ఫూలిష్‌గా ప్రవర్తించకు- ఈ రకమైన జీవితంలో అశాంతి, ఆందోళన తప్ప మరేం ఉండవు. రా! నాతో వచ్చెయ్!"

కళ్ళు మూసుకున్నా రాణి కళ్ళముందు ఆనాటి రామప్ప దేవాలయంలోని నాగిని శిల్పంలా కనిపించింది. అపూర్వ యవ్వన శోభ- దానిని చుట్టుకుని కాలసర్పాలు! ఆ నాగిని తానే అనిపించింది. తానొక విషకన్యలా తోచింది. మంచి గంధంలా- సన్నజాజుల సౌకుమార్యంలా- వేసవి సాయం త్రపు చల్లని పిల్లగాలిలా- హాయిగా ఉన్న అతడి కౌగిలి లోంచి బయటపడింది. ఇప్పుడు చల్లదనం లేదు- శాంతి లేదు- స్థిమితంలేదు- భద్రత అసలు లేదు. ఉన్నది ఒక్కటే! తనను చుట్టుకుని తనలో ఒక భాగంగా ఉన్న కాలసర్పాల విషం!

"మాస్టారూ! వెళ్తున్నాను. మళ్ళీ జన్మ అంటూ ఉంటే, అప్పుడు- మీ కాలిచెప్పునయి పుడతాను."

వెళ్ళిపోయింది. తాను చెయ్యగలిగింది ఏమీలేదని అర్థ మయింది నారాయణ్‌కి.

చాలా రోజుల తర్వాత తన ఊరికి వచ్చింది రాణి మరి కొందరు మహిళాసేవాసంఘ సభ్యులతో.... రాణి రావటానికి ముందే వెంకట్రావుకి కబురొచ్చింది. 'ఆ ఊరికి రాణి అనే ఆవిడ వస్తుందనీ,- ఆవిడకి సకలమర్యాదలూ చేయాలనీ....'

వెంకట్రావు అజమాయిషీచేస్తున్న పొలం వెంకట్రావుది కాదు. ఆ పొలం హక్కుదారు తాను రాజకీయాలలో సిటీల్లో తిరుగుతూ తన పొలంచూసే బాధ్యత వెంకట్రావు మీద ఉంచాడు. అతడి అండచూసుకొనే వెంకట్రావు ఆ ఊళ్ళో ఎన్ని వెధవ్వేషాలైనా వెయ్యగలుగుతున్నాడు. ఇంచుమించు నూరెకరాల పొలమున్నా అతి తెలివిగా లేండ్‌సీలింగ్‌లోకి రాకుండా కాపాడుకోగలిగారు. ఇప్పుడు ఆ బంధువే వ్రాసాడు, వెంకట్రావుకి. రాణికి ఏలోటూ రానియ్యకుండా జాగ్రత్తగా చూడమని.

రాణీ, ఆవిడ స్నేహితులూ ట్రావెలర్స్ బంగళాలో దిగారు. వాళ్ళకు కాపలాగా చేతిలో తుపాకితో ఘూర్ఖా- అగ్గగ్గలాడుతూ ట్రావెలర్స్ బంగళాకి వచ్చిన వెంకట్రావు రాణినిచూసి నిర్ఘాంతపోయాడు. తన ఊరికి వచ్చాక రాణి ఫ్రాక్‌మానేసి మామూలుగా చీర కట్టుకుంది. నిర్ఘాంత పోతూ నిలబడి వెంకట్రావును చూసి గర్వంగా నవ్వింది రాణి.

"ఈ ఊళ్ళో మంచి హోటల్స్ ఏమీ లేనట్లున్నాయి. టౌన్‌లో హోటల్‌నుంచి మాకు మంచి ఫలహారాలు తెప్పించండి. ఇరవై మందికి కావాలి. త్వరగా కావాలి."

వెంకట్రావు ముఖం మాడిపోయింది. ఏదైనా ఎదురు చెపుదామంటే, తన సంపదకంతకూ యజమాని ఆజ్ఞ. అతడికి కోపంవస్తే తనను తీసేసి ఈ పొలం చూసుకోవ టానికి మరొకరిని పెట్టుకోగలడు.

అతడి అండచూసుకొనే తను ఎన్ని ఆటలైనా ఆడ గలుగుతున్నాడు. అతడికి ఎదురుతిరిగి తనేం చెయ్యలేడు. చచ్చినట్టు టౌన్‌కి మనుష్యులను పంపించి టిఫిన్స్ తెప్పిం చాడు. రాణి ముందు ఉంచాడు.

"ఛ! ఏం ఫలహారాలండీ ఇవి? గొడ్లయినా తింటాయా? మీ ఊళ్ళో మనుష్యులు ఇలాంటివే తింటారా?" రాణి చీదరించుకొంటుంటే, స్నేహితులు నవ్వారు. వెంక ట్రావు మనసు రగిలిపోయింది. అక్కడితో ఆగలేదు రాణి. ఆ మరునాడు తనవీ తన స్నేహితులవీ విడిచేసిన బట్టలు కుప్పలా పోసి "ఇవన్నీ ఉతికించి తెప్పించండి," అంది. నల్లగా మాడిపోతున్న వెంకట్రావు ముఖం చూస్తోంటే రాణికి పరమానందంగా ఉంది.

రాణి- జగన్నాథ-గారి ప్రియురాలు. ఊళ్ళోకొచ్చిందని ప్రముఖులకి చాలామందికి తెలిసింది. అక్కడితో రాణిని గౌరవించటానికి ఒకరితో ఒకరు పోటీలు పడసాగారు. ఒకరు లంచ్‌కి పిలిస్తే- మరొకరు డిన్నర్‌కి పిలిచారు. సభలూ, సమావేశాలూ ఏర్పాటు చేసి, రాణిని పూలమాలలతో గౌరవించి తమకు అమూల్యమైన ఆవిడ సందేశాన్ని అంద జేయమని ప్రాధేయపడేవారు. ఏ ఊళ్ళో తనను అందరూ హీనంగా చూసారో, ఏ ఊళ్ళో తన తప్పులేకపోయినా అందరూ నానా మాటలూ అన్నారో, అదే ఊళ్ళో అందరూ పోటీలుపడి తనను గౌరవిస్తోంటే, విరగబడి నవ్వాలని పించేది రాణికి. తనను గౌరవించాలని ఆరాటపడే పెద్ద మనుష్యులని "మీరసలు మనుష్యులేనా? లేక మరబొమ్మలా" అని ముఖంమీదే అడిగేయ్యాలనిపించేది.

'కాకిబంగారం! ఈ సమాజం మొత్తం అర్థరహితమైన కాకిబంగారం!' తనలో తను అనుకుంది కసిగా.

అన్నింటికంటె గుళ్ళో రాణికి ప్రత్యేకంగా దర్శన మిప్పించి, రాణిపేర ప్రత్యేకంగా అర్చన చేయించారు,

ఊరి పెద్దలు. రాణి దేవుడికి నమస్కారం చేసింది. కానీ, ప్రసాదం మాత్రం నిర్లక్ష్యంగా తిరస్కరించింది. "అపచారం! అపచారం!" అనుకున్నారు, పూజారితోసహా పెద్దలందరూ.

అన్నీ బాగున్నాయి కానీ, రాణిని చూడాలని వచ్చిన తన కుటుంబంతో మల్లిగా మాట్లాడలేకపోయినందుకు మాత్రం చాలా బాధపడింది. కొందరు తనవాళ్ళని "పొండి! పొండి!" అని వెనక్కి నెడుతున్నప్పుడు మనసు విలవిలలాడింది. "వాళ్ళని అలా వెనక్కి నెట్టకండి- నాకందరూ ఒకటే! ఇంకా వాళ్ళే ఎక్కువ." అంది. రాణి విశాల హృదయాన్ని అందరూ ఐక్యకంఠంతో పొగిడారు. అలా పొగిడినవాళ్ళలో రాణిని మల్లిగా గుర్తించినవాళ్ళు కూడా ఉన్నారు. అయినా ఒక్కళ్ళయినా బాహాటంగా మల్లే రాణి అని అనలేదు. వాళ్ళలో వాళ్ళుమాత్రం లక్ష గుసగుసలు చెప్పుకున్నారు. ఆ గుసగుసల్లో నిజాలూ, అబద్ధాలూ బోలెడన్ని ఉన్నాయి.

రాణి ఊళ్ళోకొచ్చిందని విని నారాయణ్ కూడా వచ్చాడు. రాణిని చూడటానికి వెళ్ళాడు.

"థాంక్యూ సర్! నామీద ఇంకా ఆ మాత్రం దయ ఉన్నందుకు ..."

"నువ్వు ఇడియట్‌వి. ఇప్పటికైనా నాతో రా!"

"లాభంలేదు సర్! ఇప్పుడు నన్ను వీళ్ళంతా ఒక దేవతని చేసేసారు. నేను ఆ దేవతని కానని తెలిస్తే వీళ్ళే నన్ను చంపేస్తారు... "

విచిత్రంగా వచ్చాయి రాణినోట ఆ మాటలు.

"ఎక్కడికైనా పారిపోదాం!"

"సారీ సర్! నన్ను ఒకప్పుడు ఏడిపించిన సమాజాన్ని నేనే ఆడించాలని ఒకప్పుడు కలలు కన్నాను. ఇప్పుడా కలలు ఫలిస్తున్నాయి. నన్ను ఆనందించనివ్వండి."

"నీ కలలు పండించుకోవటానికి నువ్వు చెల్లించుకొన్న మూల్యం అతి ప్రియమైనది మల్లికా. ఇంతకూ నువ్వు సాధించినదేమిటీ?"

"కాకి బంగారం!"

"కాకిబంగారం?"

"అవును సార్! బంగారంలా మెరుస్తుంది. చిన్నపిల్లలు నగల్లా పెట్టుకుని ఆడుకుంటారు. వాటి మెరుపు తప్ప మరెందుకూ పనికిరాని, ఏ విలువా లేని బంగారం- పేరుకి మాత్రం బంగారం!"

"తెలిసి తెలిసి నువ్వెందుకిలా... "

పూర్తిచెయ్యలేకపోయాడు నారాయణ్ బాధతో....

With Best Compliments From

**DEEPAK ENTERPRISES & TRADERS**

GANDHI MARKET, SECUNDERABAD. Phone : 73251

SUPPLIERS OF INDUSTRIAL ITEMS AND ELECTRODES

"నేను శిక్షించాలనుకొన్నది భజగోవిందాన్నీ, వెంకట్రావునీ, పూజారినీ మాత్రమే కాదు సార్! నన్ను నేనుకూడా శిక్షించుకోవాలనుకున్నాను. నేనుకూడా ఈ సమాజంలో ఒక భాగాన్నే!"

నారాయణ్ లేచి వెళ్ళిపోయాడు.

"ఒక్క రిక్వెస్ట్ సార్"

"చెప్పు!"

"మా మహతిని చూసాను సార్! చింకిబట్టలతో కనిపించింది. నేను మా వాళ్ళకోసం ఒక్క పెంకుటిల్లు కట్టించటం తప్ప ఇంకేమీ చెయ్యలేకపోయాను. నాన్న దాన్ని చదువు మానిపించినట్లున్నాడు. నా చేతులతో దాన్ని పెంచాను. మహతి అని నేనే పేరు పెట్టుకున్నాను. ఇప్పుడు దాన్ని అలా చూస్తోంటే నా గుండె చెదిరిపోతోంది. దాన్ని మీరు ఎలాఅయినా చదువులో పెట్టాలి. మహతినాటికయినా కాలం మారకపోతుందా?"

"కాలం ఒక అద్దంలాంటిది. అందులో ప్రతిఫలించేది మనమే!"

"ఏమిటి సర్?"

"ఏం లేదు. తిలక్ కవితలో ఒక కొటేషన్ నాకు నచ్చినది. నేను వెళ్తాను."

"మహతి సంగతి?"

"తప్పకుండా నాకు చేతనయినది చేస్తాను."

నారాయణ్ వచ్చేశాడు.

వెంకట్రావుని రాణి ఎన్నో రకాలుగా అవమానిస్తోంది. అతడు సహించలేకపోతున్నాడు.

ఆ రోజు రాణి కుటుంబమంతా రాణిని చూడటానికి వచ్చారు. ఆ హాలులో ఉన్న కుర్చీలన్నీ వాళ్ళందరూ ఆక్రమించుకున్నారు. వెంకట్రావు నిలబడవలసివచ్చింది. యాదయ్య అలవాటుగా లేచినిలబడి "కూకోండి బాబయ్యా!" అన్నాడు. రాణి అదిభరించలేక "మీరు కూచోండి! ఆయన నిలబడి ఉంటారులెండి. పెద్దవాళ్ళముందు నిలబడటం ఆయనకు అలవాటే!" అంది.

రాణి స్నేహితులు నవ్వారు. వాళ్ళతోపాటు యాదయ్య అతడి భార్యాపిల్లలూ కూడా నవ్వారు. అది భరించలేకపోయాడు వెంకట్రావు. ఈ యాదయ్య- తన చెప్పుకింద నల్లిలా పడిఉండే యాదయ్య తనను చూసి నవ్వతాడా? ఈ రాణికి ఇంత కండకావరమా? ఇన్ని విధాలుగా తనను అవమానిస్తుందా? గుళ్ళో పూజారీ తనూ ఇంకా మరి కొందరూ, మజాచేసుకొంటుంటే, నలుగుర్నీ పిలిచి అల్లరి చేసింది. పూజారి ఆ గుళ్ళోనే ఉరిపోసుకున్నాడు. ఏం


*With Best Compliments from*

**india block makers**

RAMKOTE, HYDERABAD - 500001., Phone : 50207

Gandhi nagar, Vijayawada.

చెయ్యాలి దీన్ని? బాహాటంగా ఎదిరించలేడు! ఏదో ఒకటి చెయ్యాలి. ఇంక ఈ అవమానాలు భరించలేడు.

ఆ రాత్రికే రాణిని ఎవరో హత్యచేసి పాడునూతిలో పారేసారు. రాణి హత్యచేయబడగానే రాణి మల్లి అనీ, హరిజనుల పిల్ల అనీ అందరికీ బాహాటంగా తెలిసిపోయింది. అక్కడితో ఆ హత్యవిషయంలో ఎవరూ జోక్యం చేసుకోలేదు, జగన్నాథంతో సహా....

## 9

నారాయణ్ లేచాడు.

"రాణిని హత్యచేసింది వెంకట్రావూ, అతడి పరివారమూ అనటంలో సందేహంలేదు. మీరు వాళ్ళకు శిక్షపడేలా చేయగలిగితే సమాజానికి మేలు జరుగుతుంది."

తిలక్ ఏమీ సమాధానం చెప్పలేకపోయాడు. తన వంతు సేకరించిన సమాచారం అధికారులకు అందజేయగలడు. అంతే? శిక్షవెయ్యటం, వెయ్యకపోవటం తన చేతుల్లో లేదు.

వెంకట్రావూ అతడి బృందమూ ఆ ఊళ్ళో చిన్న రైతులను చాలా ఇబ్బంది పెడుతున్నారనీ, ముఠా తగవులు ప్రబలిపోతున్నాయనీ రిపోర్టులు వస్తే ఆ విషయం విచారించటానికి వచ్చాడు తిలక్ ఆ ఊరికి. అనుకోకుండా రాణి హత్యకేసు ఎదురయింది. తను సేకరించిన సమాచారము, ఆ రాత్రి వెంకట్రావు రాణి దగ్గరకు వచ్చాడని వాచ్‌మన్ చెప్పిన మాటలు పై అధికారులకు పంపాడు తిలక్.

ఆ రోజు పొలంగట్లదగ్గిర వెంకట్రావు బృందానికీ మరో పక్షానికీ కొట్లాటలవుతున్నాయని విని తన పోలీస్ బలగంతో అక్కడికి వెళ్ళాడు తిలక్. ఉభయపక్షాలూ కర్రలతో పరస్పరం తలలు పగలకొట్టుకుంటున్నారు. తిలక్ వెంటనే రంగంలోకి దూకి ఉభయపక్షాలను బెదిరించి, ఉభయ పక్షాలలోనూ కొందరిని అరెస్ట్‌చేసాడు. అరెస్ట్‌చేసినవాళ్ళను తనతో స్టేషన్‌కి తీసికెళ్తోంటే, కొందరు గూండాలు కర్రలతో అడ్డుపడి వెంకట్రావు బృందంలో మనుష్యులని అరెస్ట్‌చేయటానికి వీల్లేదన్నారు. తిలక్ వాళ్ళని విడిచిపెట్టటానికి వీల్లేదన్నాడు. వాళ్ళు కలియబడి దౌర్జన్యంగా వెంకట్రావు మనుష్యులను విడిపించబోయారు. తిలక్ వాళ్ళను ఎదుర్కొని ఆ గూండాలను కూడా అరెస్ట్‌చేసాడు.

తిలక్ చేసిన ఈ సాహసానికి పై అధికారులు ఆనందించలేదు సరికదా, కొట్లాటలతో ఏ విధంగానూ సంబంధంలేని 'పెద్దమనుష్యుల్ని' అన్యాయంగా బంధించినందుకు సంజాయిషీ అడిగారు. మతిపోయింది తిలక్‌కి.

* * *

రాణి హత్యకి సంబంధించిన ఫైలు అతిజాగ్రత్తగా అధికారులదగ్గిరుంది కదలకుండా_ పెద్దలందరూ కూడ బలుక్కొని అది కదలకుండా జాగ్రత్తపడ్డారు. అది కదిలితే దానితోపాటు అనేక జాతకాలు కదుల్తాయని.

తిలక్‌ని సస్పెండ్‌చేసారు, అన్యాయంగా అరెస్టులు చేసినందుకు.

తన సూట్‌కేస్‌తో ట్రైన్ ఎక్కబోతున్న తిలక్‌ని వెంకట్రావ్ బృందం ఎద్దేవచేసారు. చిత్రంగా తిలక్‌కి బాధ కలగలేదు. అతడికి రాణిమాటలు గుర్తొచ్చాయి.

'కాకి బంగారం!'


యువ డిసెంబరు సంచికలో ...

విలువలు (నవల) ఇచ్ఛాపురపు రామచంద్రరావు

అగ్నిశిఖ (సీరియల్) వాసిరెడ్డి సీతాదేవి

కేప్టన్ కథ (సీరియల్) వీనాదేవి



Printed and Published by A. Chandra Seker Rao at 5-9-88, Public Garden Road, Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001.
Editor: A. SUDHAKARA RAO